మార్చి 2016

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 8 సంచిక : 2
పేజీలు : 68
వెల: రూ.20/-



## మహిళల అభ్యున్నతే దేశ ప్రగతికి మూలం



పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్‌ను సమకూర్చే అంశాలుపై టిసిపార్డులో జరిగిన
కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ కె.తారక రామారావు




మహబూబ్‌నగర్ జిల్లా గంట్లవెల్లి గ్రామంలో పర్యటించిన అనంతరం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గూర్చి
అడిగితెలుసుకుంటున్న కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ అదనపు కార్యదర్శి శ్రీ ఎ.కె.గోయల్, ఐఏఎస్




ఉపాధి హామీ చట్టం - పదేండ్లు అమలు - ఫలితాలు - అనుభవాలు అంశంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం
ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సులో మాట్లాడుతున్న సంఘసంస్కర్త అరుణారాయ్, ఐఏఎస్ (ఆర్)

# టిసిపార్డ్
TSIPARD

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 2

మార్చి 2016



ఎడిటర్

**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.
కమీషనర్, టిసిపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**కె.యాదయ్య**
**డా॥కె.అసయ్య**
**ఎ.నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్,**
**టిసిపార్డ్**
**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్



ప్రచురణ
**టిసిపార్డ్**
రాజేంద్రనగర్
హైదరాబాద్ - 500 030
తెలంగాణ, ఇండియా.
ఫోన్ : 040 - 24018656
ఫ్యాక్స్ : 040 - 24017005
E-mail:editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిసిపార్డ్‌కిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


సంపాదకీయం ........ 4
వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళామణులు ........ 5
గంట్లవెళ్లి గ్రామాన్ని సందర్శించిన శ్రీ ఎ.కె.గోయేల్, ఐఏఎస్ ........ 7
మహిళల భద్రతకు చర్యలు ........ 8
పేదరిక నిర్మూలన - ఉపాధి హామీచట్టం ........ 9
టిసిపార్డునందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ........ 10
సంవత్సరం పొడువునా పచ్చిమేత లభ్యతకు బహువార్షిక జొన్న సాగు వివరాలు ... 11
మోతెగడ్డ వీరభద్ర క్షేత్రం ........ 12
కేంద్రబడ్జెట్‌లో గ్రామీణ వికాసానికి, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట ........ 13
మహిళా సాధికారత - స్థానిక సంస్థలు, చట్టసభల్లో మహిళలు ........ 14
మహిళా సౌభాగ్యమే జాతికి శ్రీరామరక్ష ........ 15
అవనిలో సగమైనా వివక్షే? ........ 17
తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ప్రభుత్వాలను కేరళ తరహాలో బలోపేతం ........ 19
మహిళ ........ 22
అభివృద్ధికి చిరునామా బొప్పాజీవాడి ........ 23
ముస్సోరి ఐఏఎస్ అకాడమీలో ప్రసంగించిన మహిళా సర్పంచ్ ........ 24
స్త్రీ శక్తి ........ 25
సమాజంలో స్త్రీకి మహోన్నత స్థానం ........ 26
అంతరిక్షంలో భారత మహిళలు ........ 27
బడ్జెట్‌లో గ్రామీణ, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ........ 28
తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు వెలుగొందాలే ........ 30
తల్లిపాల ప్రాముఖ్యత ........ 32
టిసిపార్డునందు స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ ........ 34
పిల్లల మనుగడ, ఎదుగుదలకు సూచనలు ........ 35
కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్‌శాఖ అదనపు కార్యదర్శి ఎ.కే.గోయల్‌తో టిసిపార్డ్ కమీషనర్ సమావేశం ........ 36
గృహహింస నుండి మహిళలకు చట్టపరమైన రక్షణ ........ 37
గ్రామీణ పారిశుధ్యంలో 'మ్యాజిక్‌పిట్' ........ 38
వస్తుసేవలు వినియోగం ........ 40
బేటీబచావో...దేశ్ బనావో. ........ 42
గ్రామ పంచాయతీ అధికారాలు మరియు విధులు ........ 43
గ్రామ పంచాయతీల పరిపాలనలో వివిధ స్థాయిల్లోని అధికారుల ముఖ్యవిధులు .. 46
మహిళా సాధికారత - త్రాగునీరు, పారిశుధ్యం ........ 50
పాపాయి పదిలం ........ 53
కిశోర బాలికల ఆరోగ్యం -శుభ్రత ........ 54
విద్యారంగం - నేటి స్థితిగతులు ........ 57
ఉపాధి హామీ చట్టంపై రాష్ట్రస్థాయి సదస్సు ........ 59
గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యత ........ 60
వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ........ 61
జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ సంస్థ నూతన డైరెక్టర్ జనరల్ 62
వివిధ రంగాల్లో మొదటి మహిళ ........ 63
ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన ........ 64

# మహిళల పురోగతి దేశప్రగతికి ప్రతీకలు

ఏ దేశమైతే మహిళలను గౌరవించి ఆదరిస్తుందో ఆ దేశం పురోగమనం ఆశించిన రీతిలో నడుస్తుందని అంటారు. భారత దేశంలో మహిళలను శక్తి స్వరూపిణులుగా గౌరవించే సాంప్రదాయం కూడా ఉంది. కుటుంబం జీవనానికి మహిళలే మూలాధారం అని గుర్తించి, పేదవారి కుటుంబాలలో ఆమెకు యజమానురాలిగా ఆమె పేర ఇంటి స్థలం, రేషన్ కార్డులు ఇచ్చి బాధ్యతలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రోత్సహన్నిస్తుంది. గతంలో మనదేశంలో కూడ మాతృస్వామిక కుటుంబాలు ఉండేవి ఇప్పటికి కేరళలో మాతృస్వామిక కుటుంబ వ్యవస్థ స్థిరంగా నడుస్తోంది. వారినే కుటుంబాభివృద్ధికి మూలస్థంభాలుగా గుర్తించి 1990 అనంతర సంస్కరణలలో ప్రోత్సహించడం జరుగుతుంది. మహిళా స్వయం సహాయక సంఘాలను దేశవ్యాప్తంగా నెలకొల్పబడ్డాయి. అందున తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఎస్‌హెచ్‌జిఏను స్థాపించి విజయవంతంగా నిర్వహించడం జరుగుతుంది. ఈనాడు ఎస్‌హెచ్‌జి మహిళా సంఘాలు దాదాపు 60 లక్షలున్నాయి. వీరు పావలావడ్డీకే ప్రభుత్వ హామీతో బ్యాంకుల నుండి రుణాలు పొంది కుటీర పరిశ్రమలాంటి చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ కుటుంబాలను పోషించుకొంటున్నారు.

పాలవెల్లువ, ఆహార స్వయం సమృద్ధి, గ్రోమోర్ పథకాలను విజయవంతం చేసిన వారు మహిళలే. ఎస్‌హెచ్‌జి మహిళా సంఘాల సభ్యులు తమ తమ కుటుంబాలను పోషించుకొంటూనే పరోక్షంగా సమాజాభివృద్ధికి కూడా తోడ్పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో పురుషులతోపాటు తమ సత్తా చాటుకొంటున్నారు. ఇజ్రాయిల్‌కు ప్రధానిగా చేసిన గోల్డా మేయర్, శ్రీలంక ప్రధానిగా బండార నాయకే, బ్రిటన్ ప్రధానిగా చేసిన మార్గరెట్ థాచర్, ఫ్రాన్స్ అధ్యక్షురాలిగా చేసిన మేయర్ లాంటి మహిళలు ఎందరో ప్రముఖ స్థానాలను అలంకరించారు.

ఇక మనదేశానికి వస్తే ప్రధానిగా ప్రపంచఖ్యాతినార్జించిన ఇందిరాగాంధీ, ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభాధ్యక్షురాలిగా వ్యవహరించిన విజయలక్ష్మీ పండిట్, తొలి స్వాతంత్ర సమరయోధురాలైన ఝాన్సీలక్ష్మీ బాయి తదుపరి స్వరాజ్య పోరాటంలో ముందు వరుసులో నుండిన సరోజినీ నాయుడు, సుచేతాకృపలానీ, దుర్గాబాయి దేశ్‌ముఖ్, లక్ష్మీసెహగల్, ఐక్యరాజ్యసమతిలో సంగీత కచ్చేరినిచ్చిన ఎం.ఎస్.సుబ్బలక్ష్మిలాంటి మహిళామణులు ఎంతో ఖ్యాతిగాంచినారు. వారే కాకుండా ఈనాడు మన దేశంలో పరిపాలనా, బ్యాంకింగ్, వ్యాపార, విజ్ఞానశాస్త్ర, క్రీడా, సేవా రంగాలలో ఎందరో మహిళలు తమ దీక్షా దక్షతలతో ఖ్యాతిగాంచినారు. మరెందరో మహిళలు తమ నిస్వార్థసేవలతో తాము ఎంచుకొన్న క్షేత్రాలలో బడుగులకు, ఇతర దురదృష్టకర జీవులకు కొంత ఊరట కల్పిస్తున్నారు.

మన రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను మెరుగుపరచేందుకు వారి జీవనోపాధి మెరుగుపరచేందుకు వివిధ పథకాలను ప్రవేశపెట్టడమేకాకుండా వీలైనంతవరకు అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే కృషి చేస్తోంది. వారిని కేవలం లబ్ధిదారులుగా చూడకుండా దేశప్రగతిలో భాగస్వాములుగా చూస్తోంది. ఈ అంశానికి సంబంధిత అధికారులు, ఉద్యోగులు, అనధికార సంస్థలు గుర్తించి మహిళా పురోభివృద్ధికి పాటుపడతారని ఆశిద్దాం.

(అనిత రామచంద్రన్)

# వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళామణులు



మహిళలు చైతన్యవంతులు కాని దేశం పురోభివృద్ధి సాధించలేదు.
మహిళల స్థితి గతులను బట్టి ఏ దేశ పరిస్థితి అయినా అంచనా వేయవచ్చు.
మహిళలను సరిగా గుర్తించని కుటుంబానికి, దేశానికి భవిష్యత్తు లేదు. – స్వామి వివేకానంద

**మ**హిళ జీవితంలో అనేక పాత్రలు పోషిస్తుంది. కుటుంబ నేపథ్యంలో మంచి కుమార్తెగా, భార్యగా, తల్లిగా, నానమ్మగా, అమ్మమ్మగా అదేవిధంగా సామాజికంగా విద్యార్థినిగా, గృహిణిగా, ఉద్యోగిగా, వివిధ పాత్రలలో జీవిస్తుంది.

దేశ చరిత్రలో ఎందరో మహిళలు గృహిణులుగా, వీర వనితలుగా, పరిపాలకులుగా, విద్యావేత్తలుగా, వ్యవసాయకులుగా, వృత్తి నైపుణ్య రమణులుగా, నాట్య మయూరాలుగా, క్రీడామణులుగా, సంగీత విద్వాంసులుగా, దార్శనికులుగా, యోగినులుగా, రచయిత్రులుగా, కవయిత్రులుగా, రాజనీతి కోవిదులుగా, పారిశ్రామిక వేత్తలుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా, సంఘ సేవకులుగా, అన్నపూర్ణలుగా విభిన్న రంగాలలో రాణించారు. మరెందరో నేటి మహిళలు విభిన్న రంగాలలో విశిష్టరీతిలో వికసిస్తున్నారు. నేటి ఆధునిక మహిళలకు స్ఫూర్తి ప్రధాతలుగా నిలుస్తున్నారు.

గృహసీమ నుండి గగనతలం దాకా ఎంతో కృషితో, పట్టుదలతో, ఓర్పు, నేర్పుతో ముమ్ముందుకు సాగిపోతుంది నేటి మహిళ.

మహిళలు అనేక రంగాలలో అడుగుపెట్టి, తమ విజ్ఞానంతో, వివేకంతో, వివేచనతో అనూహ్యమయిన విజయాలను సాధిస్తున్నారు.

తెల్లవారి అన్యాయాన్నెదిరించిన ఝాన్సీ లక్ష్మీబాయి, దురాక్రమణ దారులపై కత్తి ఎత్తిన కాకతీయ రుద్రమ్మ, వీరతిలకం దిద్ది భర్తను యుద్ధరంగానికి పంపిన మగువ "మాంచాల", అత్యంత ధైర్య సాహసాలను ఉగ్గుపాలతో రంగరించిన శివాజి తల్లి జిజియాబాయి, నిర్భాగ్యులను, నిరుపేదలను ఆదరించిన ప్రేమమూర్తి మథర్ థెరిసా వంటి మహనీయులు ఎందరో మహిళలకు స్ఫూర్తి ప్రధాతలు.



సృష్టిలో ప్రేమ స్వరూపిణి మహిళ. ప్రాణికి ప్రాణం పోస్తుంది. భగవంతుడు తనకు మారుగా మనిషి పట్ల ప్రేమను చూపించడానికి తల్లిని సృష్టించినట్లు చెపుతారు. అందువల్ల ప్రపంచంలో అవ్యాజమయిన ప్రేమకు ప్రతిరూపం తల్లిప్రేమ.

తినడానికి మూడు రొట్టెలున్నప్పుడు తినవలసిన వారు నలుగురైనప్పుడు, నాకు ఆకలి లేదు అనే వ్యక్తి స్త్రీ. స్త్రీ తన ఆకలి పట్టించుకోదు, ఆరోగ్యం పట్టించుకోదు, తన ప్రాణం లెక్కచేయదు. జీవితాంతం కుటుంబ సభ్యుల కోసం క్రొవ్వొత్తిలా కరిగిపోతూ, వారి జీవితాలకు వెలుగు ప్రసాదిస్తుంది.

## మహిళల కోసం తెలంగాణ ప్రభుత్వ పథకాలు

### మహిళల భద్రత కోసం "షీ బృందాలు"

హైద్రాబాద్ నగరంలో మహిళలు, యువతులు, విద్యార్థినులు, మైనర్ బాలికలపై నిరంతరంగా, యదేచ్ఛగా కొనసాగుతున్న అఘాయిత్యాలను, అత్యాచారాలను మరియు ఈవ్ టీజింగ్ సమస్యలకు ముగింపు పలకాలన్న దృఢ సంకల్పంతో ఇంటా, బయట, కార్యాలయాల్లో, బస్సుల్లో, రైళ్ళలో మహిళలను, ఉద్యోగులను, విద్యార్థులను రక్షించేందుకు "షి" బృందాలు 24.10.2014 నుంచి నగరంలో అందుబాటులోనికి వచ్చాయి. "తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ ఎంపవర్‌మెంటు ఆఫ్ ఉమెన్" పేరుతో ఒక సంస్థను రిజిస్ట్రేషన్ చేసి స్థాపించడం జరిగింది. షీ క్యాబ్స్‌లో మహిళా డ్రైవర్లను ప్రోత్సహించి, 'షీ క్యాబ్స్' పేరుతో మహిళా అభ్యర్థులకే టాక్సీలు సమకూర్చడం జరిగింది.



ప్రస్తుతం హైద్రాబాద్ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో 25 కి. పైగా 'షి' బృందాలు ఎంతో సమర్ధవంతంగా నగర అదనపు పోలీస్ కమీషనర్ (నేరాలు) స్వాతిలాక్రా) ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి.

### ఆరోగ్యలక్ష్మి

మహిళా సంక్షేమము మరియు రాష్ట్రంలోని తల్లి బిడ్డలందరు ఆరోగ్యంగా ఉండాలని వారికి పౌష్టిక ఆహారం అందించి మాతా శిశు మరణాల రేటును తగ్గించే ప్రధాన లక్ష్యంగా ఆరోగ్య లక్ష్మి కార్యక్రమాన్ని జనవరి 1, 2015న మన రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగింది. గర్భిణులు, బిడ్డకు పాలిస్తున్న తల్లు (బాలింత)లకు పౌష్టికాహారం సమకూర్చడం కోసం అంగన్‌వాడి కేంద్రాలలో ప్రతి రోజు ఒక పూర్తి భోజనం ఏర్పాటు చేస్తారు. గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలు: ప్రతిరోజు ఒక గ్రుడ్డు, 200 మి.ల్లీ. పాలతో పాటు నెలలో 25 రోజుల పాటు సంపూర్ణ పౌష్టికాహార భోజనం అందిస్తారు. 7 నెలల నుండి 3 సం॥లోపు పిల్లలు: నెలకు 16 గ్రుడ్లు, 2.5 కిలోల పౌష్టికాహార ప్యాకెట్లను అందజేస్తారు. 3 సం॥ నుండి 7 సం॥లోపు పిల్లలు: అన్నం, పప్పు కూరలు, స్నాక్స్ మరియు ప్రతిరోజు ఒక గ్రుడ్డు. ఈ పథకం ద్వారా అందజేయబడుచున్నది.



### కళ్యాణలక్ష్మి

కళ్యాణలక్ష్మి పథకం ద్వారా నిరుపేదలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుపేదలైన 18 సం॥ నిండిన అవివాహిత యువతులకు పెళ్లి అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా పెళ్ళి ఖర్చుల నిమిత్తం రూ. 51 వేలను ప్రభుత్వం నేరుగా యువతుల కుటుంబాలకు అందిస్తుంది. ఈ పథకం అక్టోబర్ 2, 2014 తేదీ నుండి అమలులోకి వచ్చింది.



### షాదీ ముబారక్

మైనారిటీ వర్గాల స్త్రీల వివాహ సమయంలో వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వారికి వివాహ సమయంలో ప్రభుత్వ సహకారం అందించి వారి తల్లిదండ్రుల ఆర్థిక బాధలు తగ్గించుటకు షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా మైనారిటీ కమ్యూనిటీకి చెందిన 18 సం॥ నిండిన అవివాహిత బాలికలకు వివాహ సమయంలో రూ. 51,000/- ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అదజేస్తుంది. ఈ కార్యక్రమం అక్టోబర్ 2, 2014 నుండి అమలులోకి వచ్చింది.




### ఆసరా

తెలంగాణ సమాజంలోని నిరుపేదలకు సంక్షేమము మరియు సామాజిక భద్రత కల్పించాలనే ఆశయంతో తెలంగాణ ప్రభుత్వం 'ఆసరా' పథకాన్ని 1.10.2014న ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా నిస్సహాయక స్థితిలో ఉన్న నిరుపేదలైన వృద్ధులు, వితంతువులు,వికలాంగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులు మరియు హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారు సగౌరవంగా సమాజంలో జీవించేందుకు తోడ్పడుతుంది. భరోసా కల్పిస్తుంది. వృద్ధులు, వితంతువులు, కల్లు గీత పనివారు, నేత పనివారు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రోగులకు రూ. 1000/- మరియు వికలాంగులకు రూ. 1500/- ఆర్థిక సహాయంగా జీవన భృతి



కల్పిస్తుంది.

**దళిత కుటుంబాలకు (మహిళా సభ్యులకు) మూడు ఎకరాల భూమి:**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దళితుల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించినంతగా దళితులు అభివృద్ధి చెందలేదు. ఇప్పటికీ 90% దళితులు నిరుపేదలుగానే ఉన్నారు. అందుకనే సామాజిక అసమానతలను రూపుమాపి సాధికారతను కల్పించే ఉద్దేశ్యంతో భూమిలేని నిరుపేద దళిత వ్యవసాయాధారిత కుటుంబాలకు ప్రతి కుటుంబానికి మూడెకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖర్ రావు గారు నిర్ణయించారు. ఈ భూమిలో బోరు, మోటారు, కరెంట్ సదుపాయం లాంటి వసతులను ప్రభుత్వం కల్పిస్తుంది. ఈ పథకము ద్వారా మహిళా లబ్దిదారుల పేరిట పట్టాను రూపొందించి భూములను రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది.



**సమగ్ర శిశుసేవా పథకాలు**

మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పలు కార్యక్రమాలను అమలు చేస్తుంది. మహిళల పట్ల ప్రదర్శితమవుతున్న వివక్షతపై అవగాహన కల్పించడం, విద్యా, ఉపాధి రంగాల్లో స్త్రీ, పురుష అసమానతలను రూపుమాపడం, మహిళల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక కార్యక్రమాలను తీసుకురావడం, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలలో మహిళలను భాగస్వాములను చేయడం. వారి శక్తి సామర్థ్యాలను పెంచే విధంగా ప్రత్యేక శిక్షణలు కల్పించడం ద్వారా మహిళా సాధికారితను సాధించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది.

**కెజి టూ పిజీ ఉచిత విద్య**

ప్రభుత్వం కేవలం అవకాశాలను కల్పించగలదు. అయితే ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం మహిళల ముఖ్య కర్తవ్యం. అందుకు తగిన కృషి చేయాలి. విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి, కులాల, మతాలకు అతీతంగా అందరికీ ఉచిత మరియు నాణ్యమైన విద్యను అందించాలనే దృఢ నిశ్చయంతో తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.



**ఈ పథకం యొక్క లక్ష్యాలు:**

1. కుల, మతాలకు అతీతంగా డబ్బుతో పని లేకుండానే నాణ్యమైన ఉచిత విద్యను అందించడము.

2. ప్రాథమిక స్థాయి నుంచే అనగా 5వ తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయడం.

3. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంతో పాటుగా మెరుగైన వైద్యం గురుకుల పాఠశాలలో అందించడము.

**డబుల్ బెడ్‌రూమ్**

కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ అనేవి ప్రజలందరికి ఎంతో అవసరం. కానీ ధరలు అందుబాటులో లేక నిరుపేదలు, బడుగువర్గాల వారి సొంత ఇంటి కల కలగానే మిగిలిపోతుందని వారి సొంత గూడు కల నెరవేర్చడం కోసం తెలంగాణ ప్రభుత్వం రెండు పడక గదుల నిర్మాణం పథకం చేపట్టింది. కుటుంబ యజమాని భార్య పేరున ఇల్లు మంజూరు చేస్తారు.



**ప్రజా ప్రతినిధులుగా రాణిస్తున్న మహిళామణులు**

చట్ట సభలలోనే కాకుండా 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీ రాజ్ సంస్థలలో సర్పంచులుగా, సభ్యులుగా, అధ్యక్షులుగా, ఛైర్మన్‌లుగా పదవులు అలంకరించడానికి మహిళలకు 50% రిజర్వేషన్ అవకాశం కలిగి మొత్తం దేశవ్యాప్తంగా ఎంతో మంది మహిళలకు 50% రిజర్వేషన్ స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం లభించింది. ప్రజా ప్రతినిధులుగా అధికారం చేపట్టిన తర్వాత వారి అనుభవాలు, విజయగాథలు స్థానిక ప్రభుత్వాల్లోని మిగతా ప్రతినిధులకు స్ఫూర్తిదాయకం అవుతున్నాయి. అట్టడుగు స్థాయి నుండి అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఆత్మవిశ్వాసంతో అందరినీ కలుపుకుని అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. బహుముఖ అభివృద్ధిని సాధించడంలో కృతకృత్యులవుతున్నారు. బాధ్యతాయుతమయిన చైతన్యవంతమయిన నాయకత్వంతో ముందుకు పోతున్నారు. ప్రజాసేవే పరమావధిగా ముందుకెళున్నారు. నైతిక ప్రమాణాలను నిలబెట్టుకుంటూ ప్రజలకు దిశా, నిర్దేశం చేయగలుగుతున్నారు. ఎంతో ఆశావహంగా, సహేతుకంగా ఆలోచిస్తూ చట్టాలను, మార్గదర్శకాలను అనుసరిస్తూ పరిపాలన సాగిస్తున్నారు.

సాహసం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ఎంతో సమర్థవంతమైన నాయకురాళ్ళుగా ఎదుగుతున్నారు.

**కె. యాదయ్య గౌడ్**

**సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్**



# మహిళల భద్రతకు చర్యలు

"తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. అర్ధరాత్రి సమయంలో ఒక మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి హ్యాపీగా తిరగగలగాలి. నగరంలో ఆ రకమైన భద్రత కావాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు చాలా సందర్భాల్లో పోలీసు అధికారులకు సూచించిన విషయం తెలిసిందే.

రాష్ట్ర రాజధాని భద్రతపై దృష్టిసారించిన ముఖ్యమంత్రి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.340 కోట్లు మంజూరు చేసి, జంట కమిషనరేట్లకు కొత్త పెట్రోలింగ్ వాహనాలను ఇచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం మహిళల భద్రతపై దృష్టి సారించారు. ఇందుకు ముఖ్యమంత్రి స్వయంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.

ఢిల్లీలో మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు, విధి విధానాలు మేలు చేసే విధంగా ఉన్నట్టు సిఎం గుర్తించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని రాష్ట్ర పోలీసు అనురాగ్‌శర్మ, నగర కొత్వాల్ మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సిఎం సూచనలు, మహిళల భద్రతపై ఢిల్లీలో అమలవుతున్న విధివిధానాలపై నగర పోలీసులు అధ్యయనం మొదలు పెట్టారు.

నగరంలో ఐదు జోన్‌లు ఉండగా, మూడు మహిళ పోలీసు స్టేషన్‌లే ఉన్నాయి. వాటిల్లో కూడా సరిపడా సిబ్బంది లేదు. ఈ మూడు పోలీసు స్టేషన్‌లలో కూడా వివాహిత మహిళల కుటుంబ నేపథ్యంలోనే వచ్చే ఫిర్యాదులను మాత్రమే పరిశీలిస్తున్నారు. ఇతర మహిళా సంబంధిత నేరాలను పరిశీలించడం లేదు. స్థానికంగా ఉన్న శాంతిభద్రతల పోలీసు స్టేషన్‌లలో మహిళా సిబ్బంది లేదు. మొత్తం హైదరాబాద్‌లో మహిళా ఇన్‌స్పెక్టర్లు ఆరుగురు ఉన్నారు. ఎస్సైలు 12 మంది ఉన్నారు. మహిళా సంబంధిత నేరాలు మాత్రమే వందల్లో నమోదవుతున్నాయి.

పెరుగుతున్న నేరాలు సంఖ్యకు అనుగుణంగా మహిళా అధికారులు, సిబ్బంది సంఖ్య లేకపోవడంతో కేసుల దర్యాప్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా కేసులు కోర్టులో వీగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులతో సరిపడా సిబ్బంది, అధికారులు, ఠాణాలు, భద్రత లేకపోవడంతో మహిళలకు నగరంలో భద్రత కరువైందనే చెప్పుకోవాలి.

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. మహిళల భద్రత విషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి పలుమార్లు పోలీసు అధికారులతో చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో మహిళా భద్రత విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు, చర్యలపై స్వయంగా దృష్టి సారించారు.

ఢిల్లీలో ఉన్న సెక్యూరిటీ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ సిస్టమ్‌ను అధ్యయనం చేసినట్టు సమాచారం. ఈ విషయాన్ని రాష్ట్ర పోలీస్ బాస్ అనురాగ్ శర్మ, నగర కొత్వాల్ మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, మహిళ భద్రతపై ప్రత్యేక నివేదిక అందజేయాలని కోరారు. మహిళల భద్రతపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. దీంతో సిటీ పోలీసులు మహిళల భద్రతపై ప్రస్తుతం అమలులో ఉన్న నిర్ణయాలు, చేపట్టాల్సిన అంశాలపై అధ్యయనం మొదలుపెట్టినారు.

●



# పేదరిక నిర్మూలన - ఉపాధిహామీ చట్టం

**భా**రతదేశం స్వాతంత్ర్యానంతరం అనేక సమస్యలు ఎదుర్కొన్నది. అందులో ప్రధానమైనది నిరక్షరాస్యత, పేదరికం, అనారోగ్యం వీటిని ఎదుర్కొకనడానికి అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించబడినాయి. సంక్షేమ పథకాలు ప్రారంభించడానికి ప్రధాన కారణం ఆనాటి ప్రధాని నెహ్రూ పైన సోవియట్ ప్రభావం, నెహ్రూ సోషలిస్టు భావాలు కలిగి ఉండటం. సంక్షేమ పథకాలు మాత్రం పేదరికాన్ని నిర్మూలించగలుగుతాయి అని నెహ్రూ ప్రగాడ విశ్వాసం.

అందులో భాగంగా 1952లో సామాజిక అభివృద్ధి పథకం ప్రారంభించినారు. దాని తరువాత చిన్నసన్నకారు రైతుల అభివృద్ధి పథకం, సమీకృత గ్రామీణాభివృద్ధి పథకం, ట్రైసం, ఇ.ఎ.ఎస్., ఎస్.జి.ఎస్.వై.లాంటి అనేక పథకాలు ప్రవేశ పెట్టబడినాయి. కాని ఆ పథకాలు అనుకున్నంత లక్ష్యాలు నెరవేర్చలేదు.

దానికి ప్రధాన కారణం అవి పథకాలు మాత్రమే వాటికి చట్టబద్ధత లేకపోవడం. కాని మొట్టమొదటి ప్రయత్నంగా ఉపాధి హామీ చట్టం 2005లో ఆమోదించబడినది. దీని ద్వారా నైపుణ్యం లేని కూలీలకు 100 రోజుల పని హామీ లభించబడినది. కనుక ఈ చట్టం పేదరిక నిర్మూలన యందు ఒక మైలురాయి లాంటిది. ప్రస్తుతానికి దేశ జనాభాలోని 125 కోట్ల మందిలో 35 కోట్ల మంది దీని ద్వారా ప్రయోజనం పొందినారు.

ఈ దశాబ్ద కాలంలో ఉపాధి హామీ చట్టం ద్వారా అనేక ప్రయోజనాలు కలిగినాయి. పేదల జీవన ప్రమాణాలు అభివృద్ధి చెందినవి. వారి కొనుగోలు శక్తి పెరిగినది. ఈ సం॥ 2016-17లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం రూ.38,500 కోట్లు కేటాయించబడింది. కేటాయించబడిన వనరులు ప్రత్యక్షంగా కూలీలకు చెల్లించబడుతాయి. ఏలాంటి మధ్యవర్తులు ఉండరు. యంత్రాలు ఉపయోగించరు ఎందుకంటే గతంలో రాజీవ్‌గాంధీ ప్రస్తావించినట్లు కేంద్రం కేటాయించిన వనరులు 15% ప్రజలకు చేరుతున్నాయని 85% దళారులు పాలు అయినట్లు ప్రస్తావించడం జరిగినది.

కాని దానికి భిన్నంగా ఉపాధి హామీ యందు 100% వేతనాలు కూలీలకే చెల్లించబడుతున్నాయి. దీనిపై పారదర్శకంగా సామాజిక తనిఖీ కలదు. కూలీలకు పోస్టాఫీస్‌లో బయోమెట్రిక్ విధానం ద్వారా చెల్లించడం జరుగుతుంది. నిధుల దుర్వినియోగానికి అవకాశం లేదు. దీనికి ప్రధాన కారణం సాంకేతిక పరిజ్ఞానం మేళవించి అవినీతిని అరికట్టడం జరిగినది. కేంద్రీకృత ఆర్థిక నిర్వహణ, డి.మాస్టర్, జి.పి.ఎస్.బయోమెట్రిక్ ఆధార్ అనుసంధానం ద్వారా ప్రతి కూలి చేసిన వారికి మాత్రమే చెల్లిస్తున్నారు.

### దశాబ్దకాలంలో సామాజికాభివృద్ధి

1. గతంలో ఆడవారికి, మగవారికి వేరు, వేరు కూలీ చెల్లించేవారు.

కాని ఉపాధి హామీపథకం క్రింద ఒకే పరిమాణం గల పని ఎవరు చేసినా ఒకే వేతనం చెల్లిస్తారు. దీనియందు లింగ వివక్షత కూడా అరికట్టబడింది.

గతంలో మగవారికి 100 రూపాయలు, ఆడవారికి 100 రూపాయలు, నాట్లు, కోతలు సమయాల్లో ఉపాధి హామీకి ముందు చెల్లించేవారు. నేడు అవి 200 రూపాయలకు కూలీ పెరిగినది. అంటే ఈ దశాబ్దకాలంలో కూలీ వేతనం 100% పెరిగింది. దీనివల్ల పేదవారి జీవన ప్రమాణం పెరగడానికి తొడ్పడినది. వారి ఆరోగ్యంపైన, పిల్లల చదువుపైన ఖర్చు చేస్తున్నారు. గ్రామాలలో పరిశీలిస్తే కూలీల పిల్లలు డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు మరియు ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు వెళ్తున్నారు.

కాని కొంత మంది పెద్ద వ్యవసాయ దారులు, ఉపాధి హామీ వ్యతిరేకులు కూలీ పెరగడం వల్ల వ్యవసాయ పెట్టుబడి పెరిగినది. దీనిని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి అని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్నారు.

కాని ఉపాధి హామీ ప్రధాన లక్ష్యం వ్యవసాయం పనులు లేని సమయంలో కూలీలకు పని లభించని కాలంలో 100 రోజులు పని కల్పించడం అట్ల కాకుండా వ్యవసాయానికి అనుసంధానం చేస్తే అమలు లక్ష్యం నీరుగారుతుంది.

ఈ చట్టం అనేక మంది పేదవారి జీవితంలో వెలుగునిపుతోంది. అనేక పేదవారు కూలీలుగా వాళ్ళ పొలల్లోనే పనిచేసుకున్నారు. అనేక లక్షల బీడు భూముల వ్యవసాయోగ్యంగా మారటం జరిగింది. అనేక గ్రామాల్లో మౌళిక వసతులు, మట్టిరోడ్లు, కంకరరోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించడం జరిగినది. అనేక మందికి ఇందిర జల ప్రభల ద్వారా నీటివసతి, విద్యుచ్ఛక్తి పంపుసెట్లు ఇవ్వడం జరిగినది. నీటి సంరక్షణ, తేమను భూగర్భ జలాలు పెంచడం జరిగినది.

అంతేకాకుండా అనేక మంది నిరుద్యోగులకు మేట్లు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సలహాదారులు, కంప్యూటర్ ఆపరేటర్స్‌గా అవకాశాలు దొరికినవి.

నేడు లైఫ్ ప్రాజెక్టు ద్వారా నిరుద్యోగులకు సెక్యూరిటీగార్డు, అకౌంట్స్, మేస్త్రిలు, గార్మెంట్స్ మేకింగ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. నైపుణ్యం అభివృద్ధికి శిక్షణ నిర్వహిస్తున్నారు.

ఈ విధంగా ఉపాధి హామీ చట్టం గత దశాబ్ద కాలంగా పేదరిక నిర్మూలనకు మంచి అస్త్రంగా పనిచేసినది. గతంలో ఏ పథకం దీనంతగా పేదవారి జీవితం పై ప్రభావం చూపలేదు. దీనిని పేదరిక నిర్మూలన లక్ష్యం నెరవేర్చు వరకు కొనసాగించవలసి ఉన్నది.

**బి.శేషాద్రి,** సెంటర్ హెడ్, సి.డి.పి.&ఏ

# టిసిపార్డు నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం





తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థలో మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా టిసిపార్డు ఉద్యోగులతోపాటు సెర్ప్, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖా మహిళలు పాల్గొని, మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను గూర్చి పేర్కొన్నారు. మహిళ తల్లిగా, అక్కగా చెల్లిగా కుటుంబాలలో వారు పోషిస్తున్న పాత్రను గూర్చి వివరించే పాటలు, డ్యాన్స్, డ్రామాలు ప్రదర్శించారు. ముఖ్యంగా గ్రూపు డ్యాన్స్ పాటలు ఎంతో ఘనంగా మహిళలు తమ విషయాలను గూర్చి ప్రస్తావించారు.

మహిళలు వారి వారి నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా టిసిపార్డు కమీషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాలు ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు బహుముఖ పాత్రలను పోషించారు. పంచాయతీ సంస్థలలో 50% రిజర్వేషన్లు కల్పించడం ఒక ప్రాముఖ్యతో కూడిన ప్రజాస్వామ్యయుత పాలన, పారదర్శకతకు ఆమె ప్రతీక అనికొనియాడారు. ఈ కార్యక్రమంలో టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ కె.యాదయ్య, సిడబ్ల్యుసిడి సెంటర్ హెడ్ కుసుమ మాధురి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంవత్సరం పొడవునా పచ్చిమేత లభ్యతకు బహువార్షిక జొన్న (సిఓఎఫ్‌ఎస్-09 లేదా కో.ఎఫ్.ఎస్-29) సాగు వివరాలు

ప్రతి రైతు సంవత్సరం పొడవునా సుస్థిర ఆదాయం పొందాలంటే పశుపోషణ తప్పనిసరి. పాడికి ఆధారం పచ్చిమేత అనే నానుడి మనందరికీ తెలిసిందే. పచ్చిమేత తేలికగా జీర్ణమవడమే కాకుండా పాడిపశువులకు అవసరమైన మాంసకృత్తులు, విటమిన్లు మరియు ఖనిజాలు అధికంగా లభిస్తాయి. పచ్చిమేతను పుష్కలంగా మేపినట్లయితే పాల దిగుబడి, నాణ్యత (వెన్నశాతం) పెరుగుతుంది. పాడిపశువులకు పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తపడితే రోగ నిరోధకశక్తి పెరిగి వ్యాధులు సులభంగా ఆశించవు.

పాల ఉత్పత్తిలో 60-70% ఖర్చు పశువుమేతపై ఉంటుంది. రైతులు పశుగ్రాసం స్వయంగా సాగుచేయడం ద్వారా పాడిపశువులకు నాణ్యమైన పచ్చిగడ్డి మేపి అధిక పాలదిగుబడి సాధించవచ్చు. అంతేకాకుండా పాల ఉత్పత్తి ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు.

సంవత్సరం పొడవునా పచ్చిమేత లభించాలంటే ఒక ప్రణాళికా బద్ధంగా పశుగ్రాసాలను సాగు చేసుకోవాలి. రైతు సోదరులు పశుగ్రాసాల కొరకు కేటాయించిన పొలంలో కొంత విస్తీర్ణంలో బహువార్షిక పశు గ్రాసాలను, మిగిలిన విస్తీర్ణంలో కాలానుగుణంగా పచ్చిమేతను అందించే పశుగ్రాసాలను సాగుచేసుకోవాలి. జొన్నపంటను పశుగ్రాసాలలో ప్రధాన పశుగ్రాసపంటగా చెప్పుకోవచ్చు. జొన్నలో ఒకే కోతనిచ్చేవి, రెండు లేదా మూడు కోతలనిచ్చే ఏకవార్షికాలు మరియు పలు కోతలనిచ్చే బహువార్షిక రకాలు ఉన్నాయి. పలు కోతలనిచ్చే బహువార్షిక రకాల్లో డి.ఒ.ఎఫ్.ఎస్. (సిఓఎఫ్ఎస్-29) అనే రకం నీటి వసతిలో సాగు చేయుటకు అనుకూలం. ఈ బహువార్షిక జొన్న ఎక్కువ మాంసకృత్తులు (7%-9.5%), తక్కువ పీచుపదార్థం (34.0%) కలిగియుండి 65 నుండి 70 రోజుల్లో 50% పూతదశకు వస్తుంది. మొక్కలు 220-250 సెం.మీ. పొడవు పెరిగి సంవత్సరానికి 60 నుండి 70 రోజుల వ్యవధిలో 5-6 కోతలనిస్తుంది.

బహువార్షిక జొన్న (సిఓఎఫ్ఎస్-29) సాగు వివరాలు : నీటిపారుదల ఉన్న ప్రాంతాలలో సంవత్సరం పొడవునా విత్తుకోవచ్చు. నల్లరేగడి, ఒండ్రుమట్టి, ఎర్రచల్కా నేలలు అనుకూలంగా ఉంటాయి. పొలాన్ని ఇనుప నాగలితో లోతుగా 2.3 సార్లు దుక్కివచ్చేవరకూ దున్ని హెక్టారుకు 5 కిలోల విత్తనాన్ని 30 సెం.మీ. ఎడంగా సాళ్ళలో విత్తుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం**

దుక్కిలో 12.5 ట/హె పశువుల ఎరువు లేదా కంపోస్టుతో బాటుగా 2 కిలోల అజోస్పైరిల్లమ్ (జీవన ఎరువు)ను వేయాలి. ప్రతి హెక్టారు భూమిలో 45 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 40 కిలోల పొటాషియం ఎరువులను దుక్కిలో విత్తేముందు వేసుకోవాలి. విత్తిన 30 రోజులకు పైపాటుగా 45 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను వేసి నీరు పెట్టాలి. అదే విధంగా ప్రతి కోత తరువాత 45 కిలోల నత్రజనినిచ్చే ఎరువును వేసి నీరు పెట్టాలి. నాలుగవ కోత తరువాత 45 కిలోల నత్రజనినిచ్చే ఎరువుతోబాటుగా 40 కిలోల భాస్వరం, 40 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను పైపాటుగా వేసుకోవాలి.



**కలుపు యాజమాన్యం**

కలుపు నివారణకు 2000 గ్రా అట్రాసిన్ 50% పొడి మందును 500 లీటర్ల నీటిలో కలిపి హెక్టారు విస్తీర్ణంలో, విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపుల తడినేలపై పిచికారి చేసుకోవాలి. విత్తిన 20-30 రోజులకు గుంటక లేక దంతితో అంతర కృషి చేయడం వలన కలుపును సమర్ధవంతంగా నివారించుకోవచ్చు. అవసరాన్ని బట్టి ప్రతికోత తరువాత కలుపుతీయాలి.

**నీటి యాజమాన్యం**

విత్తిన వెంటనే మరియు విత్తిన మూడవరోజున పలుచగా నీటి తడులివ్వాలి. ఆ తరువాత ప్రతి 10-15 రోజులకొకసారి వర్షపాతం మరియు నేలస్వభావాన్ని బట్టి నీటి తడులివ్వాలి. ప్రతికోత తరువాత పై పాలగా ఎరువులను వేసి తప్పనిసరిగా నీటిని ఇవ్వాలి.

**పంట కోత దిగుబడి**

ఈ జొన్న లేతదశలో ఉన్నప్పుడు హైడ్రోసైనిక్ ఆటిక్ యాసిడ్ అనే విషపదార్థం ఉంటుంది కాబట్టి పంట పూత దశకు వచ్చే వరకు కోసి మేపకూడదు. ఈ జొన్న పంటను 50% పూతదశలో కోసి మేపినట్లయితే పశువులకు ఎటువంటి హాని ఉండదు. పోషకాలు కూడా ఈ దశలో అత్యధిక శాతంలో ఉంటాయి. సరియైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అయిదు నుండి ఆరు కోతలలో హెక్టారుకు 100 నుండి 150 (నేల స్వభావాన్ని బట్టి) టన్నుల పచ్చిమేత దిగుబడి పొందవచ్చు.ఆకుల శాతం, ఎక్కువగా ఉండి కాండమునేవళంగా ఉ ఒడడం వలన ఈ జొన్న గ్రాసాన్ని ముక్కలు చేయకుండా మేపినాగాని పశువుల పూర్తిగా మేస్తాయి. పశుగ్రాసం వృధా అవదు. కాబట్టి ప్రతిపాడి రైతు తన పొలంలో కొంత విస్తీర్ణంలో ఈ బహువార్షిక జొన్న, కో.ఎఫ్.ఎస్-29 (సిఓఎఫ్ఎస్-29) రకాన్ని సాగు చేసుకొని సంవత్సరం పొడవునా నిర్ధిష్ట పరిమాణంలో నాణ్యమైన పచ్చిమేతను పొందవచ్చు.

**డా॥ఆర్.సుశీల, డా॥ఆర్.వి.టి.బాలాజీ నాయక్, డా॥ టి.శశికళ, డా॥ ఎం.అనురాధ, ప్రొ॥జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం.**

# మోతెగడ్డ వీరభద్ర క్షేత్రం

తెలుగు మాట్లాడే రెండు రాష్ట్రాలలో ఎన్నో ఆలయాలు, యాత్రాస్థలాలు ప్రకృతి సోయగాలతో మనోల్లాసాన్ని కలిగించే ప్రాంతాలు కోకొల్లలుగా దర్శనమిస్తాయి. వీటిలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి చెందిన మెతెగడ్డ ఒక్కటి. ఇక్కడ వీరభద్ర క్షేత్రం ప్రకృతి రమణీయకతకు ఆలవాలమై, ఆధ్యాత్మిక అనుభూతిభరితమై, ఆహ్లాదకరమైన గోదావరి నది మధ్యలో తపో ముద్రను తలపించే ఒక యోగి పుంగవునిలా అగుపిస్తుంటుంది.

ఖమ్మం జిల్లాలో భద్రాది శ్రీరామచంద్రమూర్తి కొలువైన భద్రాచల క్షేత్రానికి కనుచూపుమేరల్లో గోదావరి నదీ తీరం వెంబడి వెళ్ళగలిగితే ఈ మోతెగడ్డ వీరభద్రనిలయం చూడగలుగుతాం!

మోతెగడ్డ ఒక అందాల దీవిగా ఆకట్టుకుటుంది. గోదావరి నదికి ఎంత పెద్ద వరదలు సంభవించిన ఈ దీవి మాత్రం ఎట్టి పరిస్థితులలో మునగదు. ముఖ్యంగా జూలై మాసం నుంచి నవంబర్ వరకు గోదారమ్మ పరవళ్ళు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తు ఉన్నందున ఆయ మాసాల మధ్య అక్కడికి వెళ్లేందుకు యాత్రికులు ఎవ్వరూ సాహసించరు. ఆఖరి దేవాలయ పూజారి కూడా నవంబర్ నెల తర్వాతే నాటు పడవలో పూజాదికాలు నిర్వహించేటందుకు వెళుతుంటాడు. అక్కడి దీవి చట్టు ఇసుక తిన్నెలు సంధ్యా సమయంలో గోదవరి జలాల మీద సూర్యదేవుని కిరణాలు ప్రతి బింబించే దృశ్యం చూసి తీరాల్సిందే.

ఈ వీరభద్రుని దర్శించాలంటే రెండు మార్గాలు వున్నాయి. ఒకటి భద్రాచలం పట్టణం నుంచి వెళ్తున్నప్పుడు వచ్చే సారపాక కూడలి నుంచి ఇరవెండి రహదారిలో పోతుంటే నాలుగు కిలోమీటీర్ల దూరం వెళ్ళాక మోతె నుంచి గోదావరి తీరానికి దారి అగుపిస్తుంది. దాదాపు కిలోమీటరు అక్కణ్ణుంచి వెళ్ళాక మెట్ల రేవు తగులుతుంది. అక్కణ్ణుంచి మోతెగడ్డ చేరుకోవాలంటే పడవ ఏర్పాటు చేసుకుంటే సౌకర్యంగా ఉంటుంది. రెండో మార్గం భద్రాచలం పట్టణం నుండి పర్ణశాల, దుమ్ముగూడెం, వెళ్లే మార్గంలో రహదారికి నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్ళాక చెన్నంపేట అనే చిన్న పల్లెటూరు వస్తుంది. ఆ పల్లె నుండి గోదావరి నదీ తీరానికి పోవాల్సి ఉంటుంది. అయితే నదిలో మోతెగడ్డ దీవి వరకు నడిచ్చే వరకు నడిచే వెళ్ళాల్సి ఉంటుంది. కొద్దిగా కష్టంగానే అనిపించినా ఆ అనుభూతి జీవితకాలం గుర్తుండిపోయేలా ఉంటుంది. వీరభద్ర దర్శనంతో వీర భద్రాద్రి రామయ్య దర్శనం రెండు కలిసి వస్తాయి. పైగా శైవ కేశవుల మధ్య భేదం లేదన్నది మనకు అనుభవైక వేదం అవుతుంది కూడ.

స్థల పురాణాన్ని ఆధారం చేసుకొని చెప్పాల్సి వచ్చినట్లయితే మోతెగడ్డ భద్రకాళి సమేత వీరభద్రుని ఆలయం పురాతనమైన ఆలయంగా భావించడానికి ఎట్టి ఆక్షేపణలేదనిపిస్తుంది. దీని యొక్క ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఇంతని చెప్పేవీలులేదు. ఈ కోవెల పదమూడవ శతాబ్దంలో గిరిజనులే దీనిని నిర్మించినట్లుగా చెప్పబడుతున్నది. ఎప్పుడు కట్టారోగాని అది ఈ నాటికీ చెక్కుచెదరకుండా ఉంది. దీనికి క్షేత్ర పాలకుడు ప్రత్యక్ష నారయణుడైన సూర్యనారాయణుడే పురాణాల్లో చెప్పినట్లుగా వీరభద్రస్వామి వారి వృత్తాంతం పరిశీలిద్దాం! యజ్ఞవాటిక సాక్షిగా ముక్కంటి శివుడు దక్షప్రజాపతి చేతిలో అవమానాల పాలయ్యాడు. అందువల్ల ఆయన అర్ధాంగి సతీదేవి ఆత్మాహుతి చేసుకున్నది. ఆ కారణంగా రుద్రుడు ఆగ్రహోదగ్రుడై ఊగిపోయాడు. ఆ పరమశివుని ఆగ్రహం నుండి వీరభద్రుడు జన్మించినట్లు చెప్పబడింది. ఆ అనంతరం నీలకంఠుడు కరాళనృత్యం చేస్తూ దక్షప్రజాపతిని సంహరిస్తాడు. ఇంతవరకు కథ పురాణాల ఆధారంగా చెప్పబడినది. కాని మోతెగడ్డ స్థానికులు చెప్పే ఐతిహ్యం ఇందుకు భిన్నంగా తోస్తుంది.

అదేమంటే గోదావరి తీరానికి వేటుకు బయల్దేరిన వీరభద్రుడనే రాజు గిరిజన యువతి భద్రకాళితో ప్రేమలో పడినట్లు చెబుతారు. అంతేకాకుండా ఆ కొండ జాతి గిరిజనులకు కొండంత అండగా నిలిచి వీరభద్రుడు వారి కొంగుబంగారమయ్యాడని వీరందరిచే దేవుడు లాంటి అల్లుడనిపించుకోగలిగాడు. అందుచేత ఆయా గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ వారి పాలిట దైవంగా మారినట్లు చెప్పబడింది. బహుశా ఆకృతజ్ఞతతోనే ఆ గిరిజనులు ఆయనకు భక్తి పూర్వకంగా ఆలయాన్ని నిర్మించి ఉంటారు.

ప్రస్తుతంలోకి వచ్చినట్లైతే ఈ ప్రాంతపు గిరిజనులు ప్రతి ఏటా మహాశిరాత్రి పర్వదిన నా వారి వీరభద్ర స్వామివారికి భద్రకాళిమాతకు కళ్యాణం జరిపించడం పరిపాటియ్యింది. వారు ఆరోజు వస్తు వస్తు వీరభద్రుని వివాహార్థం గోటి తలంబ్రాలు తేవడం ఆ గిరిజనుల ఆచారంగా వస్తున్నది. తమ ఆడ బిడుచ భద్రకాళి అమ్మవారికి తాళబొట్టు కట్నకానుకలు సమర్పిస్తూ భక్తిపూర్వకంగా శివరాత్రి ఆనాడు అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు లింగోద్భవ కాలంలో వీరభద్రుడికి, భద్రకాళికీ కళ్యాణాన్ని వైభవపూర్వకంగా జరిపిస్తారు. ఈ భద్రకాళి వీరభద్రులు కళ్యాణాన్నిగాను ఒక్క తెలంగాణ ప్రజలేకాదు ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల నుండి కూడా పలువురు పలు ప్రాంతాలలో స్థిర పడిన గిరిజనులు ఆ వేడుక చూడగలిగేందుకు సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు. ఇది స్థల పూరాణం.

ఈ క్షేత్రంలో ఓ సత్సంప్రదాయం అగుపిస్తుంటుంది. అదేమనగా మహాశివరాత్రి పర్వదినాన సంతానవంతులుకాని కులకాంతలు ప్రాణభారం పేరుతో ప్రత్యేక దీక్ష చేపడతారు. ముందుగా వారు గోదావరి నదిలో తలస్నాన మాచరించి ఆ తడిదస్తులతోనే గుట్టపైకి పోయి ఆలయంలో చుట్టూ తమ తమ శక్తిమేరకు పలుమార్లు పొర్లుదండాలు పెడతారు. స్వప్నం వంటి ద్యానస్థితిని పొందిన అనంతరం వీరభద్ర స్వామి దర్శనమిచ్చి ఫలాన్నీ ప్రసాదిస్తాడనే అదే అనుగ్రహంగా చెబుతుంటారు.

ఒకవేళ దీక్ష గనుక భంగమైనా, కలలో పండు ప్రసాదం అందకుండా బట్టతడి ఆరిపోయినా తిరిగి ఆ స్త్రీలు గోదాట్లో స్నానం చేసొచ్చి ఇంకో పర్యాయం దీక్ష చేపట్టవలిసి ఉంటుంది. వీరభద్రుని కటాక్షం వలన సంతానం పొందగలిగన అదృష్టవంతులు ఇక్కడే పిల్లలకు తిరిగి పుట్టు వెంట్రుకలు తీయిస్తుండటం ఒక ఆచారంగా కొనసాగుతుంది. దీనికి తోడు వారు బిడ్డలకు అన్నం పట్టించడం ఆనవాయితిగా మారింది. వీరభద్రుని కటాక్షం కంటికి రెప్పలా కాపాడుతుందనే నమ్మకం ఆ గిరిజనులలో అపారంగా నేటికి కొనసాగుతుంది. శివరాత్రి పర్వ దినాలలో ఈ మోతెగడ్డ క్షేత్రం గిరిజనులతో కిటకిటలాడుతూ కనువిందు చేస్తూ ఉంటుంది.

**– డా॥ మంతెన సూర్యనారయణరాజు విశ్రాంత ఉపన్యాసకులు**

# కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ వికాసానికి, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

ద్రవ్యలోటు సమస్యలతో సతమతమవుతున్న దేశ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్థికమంత్రి అరుణ్‌జైటీ గ్రామీణాభివృద్ధిపై కేంద్రీకరించి బడ్జెట్‌ను రూపొందించారు. పేదల అభ్యున్నతిని కాంక్షిస్తూ రూపొందించిన విధానాలకు దన్నుగా ఉండేందుకు పన్నుల రాబడిని పెంచుకునేందుకు ప్రయత్నించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్థిక క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక మంత్రి తన పదవీ కాలంలో అతి సంక్లిష్ట పరిస్థితుల్లో 2016-17కు గాను బడ్జెట్‌ను తీర్చిదిద్దారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా వున్నా ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ బడ్జెట్‌ను రూపొందించారు. ప్రజలకు వాగ్దానం చేసేవిధంగా పాలనను అందించేందుకు బడ్జెట్‌పై కసరత్తు చేశారు.

బీజెపి దేశీయంగా గత కొంత కాలంగా రాజకీయంగా, ఆర్థికంగా ఎదురవుతున్న సవాళ్ళ నేపథ్యంలో మందగమనంలో వున్న ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఆర్థికాభివృద్ధి వేగాన్ని పట్టిలాగుతున్న ద్రవ్యలోటును పూడ్చేందుకు చేయాల్సిన ప్రయత్నమంతా చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పుకున్నట్లు ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి బడ్జెట్‌ను రూపొందించింది. రాబోయే కాలంలో ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు రూపొందించిన జనరంజకంగా విధానాలతో సన్నద్ధమైంది. ఈ క్రమంలో... పేదలకు ఉపయోగపడుతున్న సబ్సిడీ పథకాలను క్రమబద్ధీకరణకు పూనుకున్నది. అలాగే ధనికులపై పన్నుల భారాన్ని మోపి పేదల సంక్షేమానికి పెద్దపీట వేసింది. ప్రధాని మోదీ తన ప్రసంగాల్లో ఉపయోగించే కొటేషన్ల స్ఫూర్తితో బడ్జెట్‌లో సంస్కరణల విధానాలు, పథకాలను పునర్‌వ్యవస్థీకరించడం సబ్సిడీలను క్రమబద్ధీకరించడం లాంటి వాటికి పెద్దపీట వేశారు.

గత ఏడాది మోదీ ప్రభుత్వం విధించిన 'స్వచ్ఛభారత్ సెస్సు'పై దేశవ్యాప్తంగా విభిన్న స్పందనలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం ఈసారి బడ్జెట్‌లో మరో పన్నును విధించేందుకు సిద్ధమయింది. 'కృషి కళ్యాణ్' పేరుతో వ్యవసాయ సెస్సును పన్నులు విధించే అర్హత వున్న సేవలన్నింటిపై 0.5 శాతం వ్యవసాయ పన్నును విధించింది. అది 2016 జూన్ 1 నుంచి అమలులోకి రానున్నది. దీని ద్వారా వచ్చే ఆదాయన్నంతా వ్యవసాయాభివృద్ధికి, రైతులు సంక్షేమానికి ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంలోనే భారతీయ నగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలను తీర్చేందుకు శిస్తులు విధించేందుకు మార్గాలను వెదికారు. ఈ నేపథ్యంలో పెట్రోలుతో నడిచే చిన్న కార్లపై 1 శాతం పన్నును విధించారు. సిఎన్‌జి, ఎల్‌పిజి గ్యాస్‌తో నడిచే వాటిపై 2.5శాతం పన్నును, డీజిల్‌తో నడిచే ఇంకా ఇతర పెద్ద వాహనాలపై నాలుగు శాతం పన్నును విధించారు. పర్యావరణాన్ని సంరక్షించేందుకు కాలుష్యాన్ని అరికట్టేందుకు క్లీన్ ఎన్విరాన్‌మెంట్ పన్నును టన్ను బొగ్గుపై 200 రూపాయలు వున్నదాన్ని 400లకు పెంచారు. అలాగే ఏడాదికి 50 కోట్లకు తక్కవ రాబడి ఉన్న 13 వివిధ రకాల పన్నులను ప్రభుత్వం రద్దు చేసింది.

ఆర్థికాభివృద్ధి రేటును పెంచేందుకు జైట్లీ ద్రవ్య సమీకరణపై దృష్టిపెట్టినట్లు బడ్జెట్ రూపు రేఖలు చెబుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న ద్రవ్యలోటును 3.9 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గించేందుకు పథకాలు రూపొందించారు. ఈ క్రమంలో ప్రణాళికా వ్యయం 15 శాతం అంటే 5.5 లక్షల కోట్లు పెరిగింది. ఇది మోది అనుసరిస్తున ఆర్థిక, అభివృద్ధి విధానలను ఊతమిచ్చే విధంగానే ఉంది. ఈ క్రమంలో 99,861 కోట్ల వనరులు అవసరమవుతాయి. మొత్తంగా చూస్తే ప్రస్తుత బడ్జెట్ రైతు అనుకూల బడ్జెట్‌గా రూపొందించేందుకు చేసిన కసరత్తు కనిపిస్తున్నది. రైతులకు సంబంధించిన పథకాల కోసం, రైతుల సంక్షేమ నిధులు, ఆహార ధాన్యాల అమ్మకం, నిల్వ చేసుకోవడం, క్రాప్ ఇన్స్యూరెన్స్ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి నిధులు పెంచుతున్నారు. మహిళ సాధికారత, అభ్యున్నతి కోసం ఎల్‌పిజీ గ్యాస్ సిలిండర్లను మహిళ పేరుమీదనే ఇచ్చేందుకు సంసిద్ధమయ్యారు. దీనికోసం కేంద్రం రెండువేల కోట్లను కేటాయించి దేశవ్యాప్తంగా ఉన్న 1.5 కోట్ల పేద మహిళలకు గ్యాస్‌ను అందించనున్నారు. దీంతో మహిళ ఆర్థిక స్థితి మాత్రమే గాక, ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించినట్లు అవుతుంది. వంటచేయడంలో వున్న కష్టాలను దూరం చేయడమే కాదు, గ్యాస్ అందించడంలో యువతకు కూడా ఉపాధి దొరుకుతుంది.

ఈ క్రమంలో అతి ముఖ్యమైన తొమ్మిది రంగాలకు ప్రాధాన్యమిచ్చారు. ఇందులో మౌలిక వనరుల కల్పన, ఆరోగ్యం, విద్య తదితర రంగాలకు ప్రాముఖ్యాన్ని పెంచారు. అలాగే ఈ బడ్జెట్‌లో చాలా విషయాల గురించి ప్రస్తావనేలేదు. ఏడో పే కమీషన్ సూచించిన విధంగా జీతభత్యాలు పెంచితే పడే భారం గురించి ప్రస్తావన అయిన లేదు. 23.5 శాతం పెంచిన జీతభత్యాల భారాన్ని ఏ విధంగా పూడ్చుకుంటారో చెప్పలేదు. అలాగే రక్షణ రంగంలోని సైనికులకు సంబంధించి 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' విధానంతో పడే భారాన్ని ఎలా అధిగమిస్తారో చెప్పలేదు.

ముఖ్యమైన గమనార్హమైన విషయమేమిటంటే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రక్షణ రంగాలకు సంబంధించి ఖర్చును 94,588 కోట్ల నుంచి 86,340 కోట్లకు తగ్గించారు. అదే క్రమంలో రెవెన్యూ వ్యయాలను మాత్రం 1.58 లక్షల కోట్ల నుంచి 1.69 లక్షల పెంచారు. కొసమెరుపు ఏమంటే చరిత్ర పురుషుల జన్మదినోత్సవాలకు ప్రభుత్వం అధిక ప్రాధ్యానం ఇచ్చి వంద కోట్లను కేటాయించింది. దీన్ దయాల్ ఉపాధ్యాయ దినోత్సవం, గురు గోబింద్‌సింగ్ 300వ జన్మదినోత్సవాలను ఘనంగా జరపాలని నిశ్చయించింది. ఈ సంప్రదాయం ఇప్పుడు వచ్చింది కాదు. చారిత్రక పురుషుల జయంతి వర్ధంతి ఉత్సవాలను ఘనంగా జరిపి వారి త్యాగనిరతిని శ్లాఘించుకోవడం మన విధి. కాకుంటే గత ఏడాది ఈ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ప్రకటించినా నిధులను కేటాయించలేదు. ఇప్పుడు నిధులను కేటాయించి వారి ప్రాముఖ్యాన్ని దేశానికి చాటాలని నిర్ణయించింది.

– మయాంక్ జైన్, జర్నలిస్టు

# మహిళా సాధికారత - స్థానిక సంస్థలు, చట్టసభల్లో మహిళలు

స్థానిక సంస్థలు తమ నివాస ప్రాంత ప్రజల అవసరాలు తీర్చడానికి ఏర్పడినటువంటి సంస్థలు. ప్రజల కనీస అవసరాలైన మంచినీరు, పారిశుద్ధ్యం, ప్రాథమిక విద్య, దానితోపాటు ఆరోగ్యంలాంటి అవసరాలు నెరవేర్చడానికి ఏర్పడినది. కాని నేడు ఈ సంస్థలు కనీస అవసరాలతోపాటు బలహీన వర్గాలైన హరిజన, గిరిజన, వెనకబడిన, మహిళలను నాయకులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహిస్తున్నాయి.

ముఖ్యంగా ఇంటికి పరిమితమైన మహిళలను వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, మండల ప్రాదేశికవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ నియోజకవర్గ సభ్యులు మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయిన అవకాశం కలిగినది. మొట్టమొదట 1987లో మండల వ్యవస్థ ఏర్పడినప్పుడు 33% అవకాశం కల్పించబడినది.

మన రాష్ట్రంలో 2013 సం॥ నుంచి దీనిని 50%కు కల్పించబడినది. దీనిని ఆదర్శంగా తీసుకొని నేడు దేశంలో మొత్తం 50% కల్పించడానికి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బీరేందర్ సింగ్ సుముఖత తెల్పడం జరిగినది. దీనిని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో బిల్లు ప్రతిపాదించి అవకాశం కలదు. ఇది కార్యరూపం దాలిస్తే దేశం మొత్తం పంచాయతీరాజ్ మూడంచెల వ్యవస్థలో 50% మహిళలు నాయకత్వం మరో అవకాశం కలుగుతుంది. ఈ విధంగా మహిళను ప్రోత్సహిస్తే వారు స్థానిక సంస్థలు ఎన్నికైన సభ్యులు తర్వాత చట్టసభ సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశం కలుగుతుంది.

మహిళలకు సమభాగం ప్రాతినిధ్యం కల్పించడానికి ప్రధాన కారణం జనాభాలో సగం ఉండటం, స్థానిక సంస్థలు అమలు చేసే కార్యక్రమాల ప్రభావం ముఖ్యంగా మహిళలపైనే ఉండటం వలన మహిళలకు సగభాగం కల్పించవలసి వచ్చినది. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు కేటాయించిన 29 అంశాలలో

1. మంచినీరు 2. పారిశుద్ధ్యం 3. ప్రాథమిక విద్య
4. ప్రాథమిక ఆరోగ్యం 5. ఉపాధి మొదలైనవి కలవు.

కాని మహిళలు ఎదుర్కొనే సమస్యలైనటువంటి కలుషిత మంచినీరు, బహిరంగ మల విసర్జన, అంటురోగాలు, పోషక పదార్థాల లేమి, ఉపాధి, మురుగు నీటి కాలువలు, కూలి లేకపోవడం, చిన్న పిల్లలు బడి మానివేయడం మొదలైనవి. ఈ సమస్యలను పరిష్కారించే సంస్థలు పంచాయతీరాజ్ సంస్థలు. ఈ సమస్యలు అధిగమించే కార్యక్రమాలు మహిళలను భాగస్వామ్యం చేయడం జరిగినది. ఈ విధంగా స్థానిక సంస్థలు స్థానిక అవసరాలే తీర్చడమే కాకుండా బలహీనవర్గాలకు, మహిళలను, నాయకులుగా తయారు చేసే శిక్షణ కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. మహిళలకు తగు ప్రాతినిధ్యం స్థానిక సంస్థల వరకే కాకుండా చట్టసభలైన శాసనసభ, పార్లమెంట్‌నందు కూడా కల్పించవలసిన అవసరం ఉన్నది. స్థానిక సంస్థలలో యం.పి.పి.లు, జడ్‌పిటిసిలుగా పనిచేసిన వారు నేడు శాసనసభ, పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికై రాణిస్తున్నారు. మహిళలకు చట్టసభలలో రిజర్వేషన్లు లేకపోవడం వలన బలహీనవర్గాలకు చెందిన మహిళలు తగినంతగా చట్టసభలలో ప్రవేశం అవకాశం కలగడం లేదు. కనుక దేశ జనాభాలో సగ భాగం గల మహిళలకు చట్టసభలలో కల్పించవలసిన అవసరం ఉన్నది. కీలక నిర్ణయాలు చట్టసభలలో తీసుకొంటారు. దానిలో మహిళలను భాగస్వామ్యం లేకపోతే సమన్యాయం జరగదు. నేడు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన మహిళలపైన అత్యాచారాలు, గృహహింస, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులపైన కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి చట్ట సభలలో మహిళలకు తగు ప్రాతినిధ్యం కల్పించే అవసరం ఉంది.

## తెలంగాణాలోని స్థానిక సంస్థల్లో మహిళా ప్రాతినిధ్యం

| S. No | Name of the District | ZP Chairpersons | | | ZPTCs | | | MPPs | | | MPTCs | | | Sarpanches | | | Wardmembers | | | Total Elected Representatives | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | M | F | Total | M | F | Total | M | F | Total | M | F | Total | M | F | Total | M | F | Total | M | F | Total |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 1. | Adilabad | 0 | 1 | 1 | 23 | 28 | 51 | 14 | 38 | 52 | 244 | 336 | 580 | 388 | 473 | 861 | 3503 | 4307 | 7810 | 4172 | 5183 | 9355 |
| 2. | Karimnagar | 0 | 1 | 1 | 26 | 31 | 57 | 19 | 35 | 54 | 370 | 429 | 799 | 584 | 623 | 1207 | 5166 | 5883 | 11049 | 6165 | 7022 | 13167 |
| 3. | Khammam | 0 | 1 | 1 | 19 | 20 | 39 | 7 | 14 | 21 | 228 | 354 | 582 | 310 | 359 | 669 | 2850 | 3518 | 6368 | 3414 | 4266 | 7680 |
| 4. | Mahabubnagar | 1 | 0 | 1 | 29 | 30 | 59 | 24 | 39 | 63 | 395 | 481 | 876 | 610 | 720 | 1330 | 5534 | 6655 | 12189 | 6593 | 7925 | 14518 |
| 5. | Medak | 0 | 1 | 1 | 18 | 26 | 44 | 16 | 29 | 45 | 290 | 354 | 644 | 488 | 578 | 1066 | 4247 | 5094 | 9341 | 5059 | 6082 | 11141 |
| 6. | Nalgondal | 1 | 0 | 1 | 27 | 30 | 57 | 22 | 37 | 59 | 338 | 429 | 767 | 547 | 629 | 1176 | 4789 | 5716 | 10505 | 5724 | 6841 | 12565 |
| 7. | Nizamabad | 1 | | 1 | 18 | 17 | 35 | 12 | 24 | 36 | 249 | 297 | 546 | 340 | 378 | 718 | 3006 | 3651 | 6657 | 3626 | 4367 | 7993 |
| 8. | Rangareddy | 0 | 1 | 1 | 14 | 17 | 31 | 12 | 20 | 32 | 247 | 360 | 553 | 315 | 361 | 676 | 2806 | 3367 | 6173 | 3394 | 4072 | 7466 |
| 9. | Warangal | 0 | 1 | 1 | 20 | 29 | 49 | 16 | 32 | 48 | 281 | 391 | 672 | 438 | 501 | 939 | 3923 | 4692 | 8615 | 4678 | 5646 | 10324 |
| | **Total** | **3** | **6** | **9** | **194** | **228** | **422** | **142** | **268** | **410** | **2642** | **3377** | **6019** | **4020** | **4622** | **8642** | **35824** | **42883** | **78707** | **42825** | **51384** | **94209** |

| | % of Female |
|---|---|
| ZP Chairpers | 67% |
| ZPTCs | 54% |
| MPPs | 65% |
| MPTCs | 56% |
| Sarpanches | 53% |
| Wardmembers | 54% |
| **Total** | **55%** |

– బి.శేషాద్రి, సెంటర్‌హెడ్, సిడిపిఏ, టిసిపార్డ్

# మహిళా సౌభాగ్యమే జాతికి శ్రీరామరక్ష

ప్రస్తుత సమాజంలో హింసాత్మక ప్రవృత్తి, విశృంఖలం కావటంతో లైంగిక రాక్షసత్వం చెలరేగుతోంది. వయస్సుతో సంబంధం లేకుండా ఆడతనంపై విరుచుకుపడుతున్న ఈ అమానుష లైంగిక ఉన్మాదానికి ఆడపిల్లలు, యువతులు, మహిళలు, ఎందరో నిస్సహాయంగా బలి అవుతున్నారు. ప్రతి ఏటా మహిళా దినోత్సవాలు గుర్తుచేస్తున్నా పసివయస్సు ఆడపిల్లలు కూడా భద్రతగా ఎదిగి, యువతులుగా విద్యా ఉపాధి అవకాశాలతో పెరిగి సామాజిక నిర్మాణంలో సమాన భాగస్వామ్యంతో జీవించడానికి అడుగడుగున అప్రమత్తత అనివార్యమవుతోంది. అధునాతన సమాజం పెంపకం, చదువు, సంస్కృతి ఉద్యోగాలు, సాధికారత, స్వేచ్ఛ వంటి అంశాలలో జీవనపరంగా చట్టపరంగా ఎన్నో అవకాశాలు, హక్కులు కల్పిస్తున్నా మహిళా సౌభాగ్యానికి చైతన్యవంతమైన కార్యాచరణ కొనసాగుతున్నా లైంగికదాడులు క్రౌర్యం నిరంతరం తలెత్తుతూనే ఉంది. సాధారణంగా కుటుంబాలలోని పేదరికం, నిరక్షరాస్యత, అజ్ఞానం పొంచి ఉండే నిస్సహాయత ఆర్థిక దైన్యంతో ఆధారపడవలసిన దుస్థితి దారితప్పించే అమాయకత్వం, అదుపు లేని స్వేచ్ఛ వంటి కారణాలు లైంగిక విపత్కరతను ఎదుర్కోవలసిన పరిణామాల దుర్ఘటనలకు దృష్టాంతాలుగా స్పష్టంగా కనపడుతున్నాయి. అదే విధంగా విద్యాధికులైన యువతులు, విద్యార్థినులు, ఉద్యోగ ఇతర సామాజిక, సాంకేతిక పౌర రంగాలలోని మహిళలు ఇంటా బయటా ప్రత్యక్షంగా, పరోక్షంగా అవాంఛనీయ దుష్టత్వాన్ని అనుభవించవలసి వస్తోంది. ఒంటరిగా, అర్ధరాత్రి స్వాతంత్ర్యం ఉల్టా అయి పట్టపగలు స్నేహితునితో అయినా అత్యాచార ప్రాణ సంకటం ఎదుర్కోవలసిన పరిస్థితులలో నిరంతర జాగరూతకత అవసరమవుతోంది.

మానవ ఆవిర్భావానికి ప్రకృతి సహజమైన లైంగిక ఆకర్షణలో ఆదిమ అనాగరికత ఆధునికతతో క్రమేపీ మాతృ, పితృస్వామ్య వ్యవస్థలున్నా పురుషునిదే పైచేయిగా ఆధిపత్యం కొనసాగుతోంది. మానసికంగా దృఢమైనా శారీరకంగా దుర్బలత్వం, యుగాల కాలభ్రమణంలోని కుటుంబ భాగస్వామ్య బాధ్యతలు మహిళకు కొన్ని పరిమితులు సంక్రమింపచేసాయి. ప్రధానంగా కుటుంబ వ్యవస్థ ప్రశాంతంగా దర్మబద్ధంగా కొనసాగడానికి నాటి స్త్రీ ఆధిపత్య హక్కులు వదులుకోవటం క్రమేపీ అణచివేతకు ఆమోదించడం, సామాజిక ధర్మమైంది. దాంపత్యధర్మంగా పురుషుని లేదా భర్తను అనుసరించడం పాతివ్రత్య నియమాలు, నిబంధనలను ఔదలదాల్చటం జీవన ధర్మమైంది. ప్రపంచంలో ఏ మత సిద్ధాంతాలైనా, స్త్రీ పురుష సమానత్వం ఉపదేశిస్తూనే నిర్దేశిస్తూనే కేవలం సృష్టి పునరుత్పత్తికి సంబంధించిన లైంగిక ప్రాధాన్యత దృష్ట్యా కోర్కెల అనుభవంతో పాటు పిల్లల్ని కనిపెంచటం స్త్రీ బాధ్యత అయ్యింది. పురుషుని ఆస్తిగా స్త్రీ భావించబడిన అన్యాయం అణచివేత, దాస్యజీవనపు స్థితిగతుల దౌర్భాగ్యం నుంచి ఆధునిక శాస్త్రీయ సమాజపు వెన్నెల వెలుగులు ప్రసరించాయి. అదే స్త్రీ పురుష సమానత.

## ప్రపంచ ప్రజాస్వామ్యంలో మహిళా సాధికారత

21వ శతాబ్దం నాటికి మహిళ అన్ని రంగాలలో పురుషునితో సమానంగా పోటీ పడుతూ సామాజిక ప్రగతికి దోహదం చేస్తోంది. గత రెండు శతాబ్దాలలో ప్రపంచ స్థాయిలో మహిళల మేధాసంపన్నత



విజ్ఞాన, శాస్త్రీయ ఆధునిక రంగాలలో ప్రతిభావంతులుగా విజయాలను కైవసం చేసుకొంది. అదే విధంగా కేవలం అందచందాల ఆకర్షణలలోనే కాకుండా సాహిత్య, కళా, సంగీత, క్రీడా తదితర రంగాలలో అరుదైన అపురూపమైన మేధాసంపన్నతతో ప్రపంచాన్ని అబ్బురపరిచింది. సనాతన మూఢాచార సంప్రదాయపు జీవన భావజాలంలో నలిగి కృంగి కృశించిన భారత మహిళా లోకం ఒకనాటి సతీసహగము, బాల్యవివాహాలు వంటి పురుషాధిక్యత దురహంకార దురాచార సామాజిక దుర్నీతి నుంచి విముక్తి సాధించింది. రాజారాయ్ మోహన్‌రాయ్, కందుకూరి విరేశలింగం, గురజాడ వెంకట అప్పారావు వంటి సంఘ

సంస్కర్తలైన వైతాళిక మహోదయులు ఎందరో స్త్రీల జీవితాలలో దీప్తి ప్రసరింపజేశారు. తెలుగునాట గుడిపాటి వెంకటచలం స్త్రీకి హృదయం, శరీరం, మనస్సు, మేధస్సు వుందంటూ విప్లవోత్తేజంతో సాహితీ కొరడా ఝుళిపించారు.

ప్రపంచంలో ఆధునిక మహిళ పురుషులతో సమానంగా అధికార సాధికారత సాధించే దిశలో సుమారు రెండు శతాబ్దాల పోరాట నేపథ్యం చరిత్రలో స్పష్టమవుతోంది. 1867లో బ్రిటిష్ పార్లమెంట్‌లో మహిళలకు ఓటు హక్కు, ఎన్నికలలో పోటీ చేసే హక్కు ఇవ్వాలని జాన్ స్టువర్ట్ మిల్ ప్రతిపాదించిన సవరణ ఘోరంగా ఓడిపోయింది. అమెరికా, బ్రిటన్‌లలో మహిళలు ఓటు హక్కుకై ఆందోళన అదే శతాబ్దం మధ్య ఆరంభమైంది. 1893లో ప్రపంచంలో ప్రథమంగా న్యూజిలాండ్ స్వయంపాలిత బ్రిటిష్ కాలనీ వయోజన మహిళలకు ఓటుహక్కు ప్రసాదించింది. 1918లో 30 ఏళ్లు పైబడిన మహిళలకు ఆస్తి ప్రాతిపదికన సభ్యులుగా ఎన్నుకొనే హక్కు బ్రిటన్ ఇచ్చింది. 1920 నాటికి యు.ఎస్. డెన్మార్క్, జర్మనీ, కెనడా మహిళలకు ఓటు హక్కు ప్రసాదించాయి. 1928నాటికి బ్రిటన్ పురుషులతో సమానంగా అందరికీ ఓటు హక్కు ఇచ్చింది. 1944లో ఫ్రాన్స్, 1950లో ఇండియా మహిళలకు ఓటుహక్కు చట్టబద్ధంగా ఇచ్చాయి. బ్రిటిష్ సామ్రాజ్యాధిపత్యం నుంచి విముక్తి సాధించిన స్వతంత్ర దేశాలలో మహిళా చైతన్యం పెల్లుబికింది. ప్రపంచంలో ప్రజాస్వామ్యబద్ధమైన పార్లమంటరీ ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థకు సంబంధించి డెన్మార్క్ విద్యామంత్రిణిగా 1924-1926లలో నినాబాన్గ్ వ్యవహరించారు. 1960లో సిరిమావో బండార నాయకే శ్రీలంక ప్రపంచ తొలి మహిళా ప్రధానిగా గుర్తింపు పొందారు. 1974లో అర్జెంటీనాలో ఇసాబెల్ పెరాన్ తొలి ప్రపంచ మహిళా అధ్యక్షురాలిగా 1966లో ఇందిరాగాంధీ భారత ప్రధానిగా, 1950లో ఐస్‌లాండ్ అధ్యక్షురాలిగా విగ్డిస్ ఫిన్బోగడొట్టిర్, ఆ దేశాధినేతగా 16 సంవత్సరాలు పాలించారు. ఊయల లూపిన చేతులు దేశాల అధినేతలుగా చరిత్ర సృష్టించడం ఆరంభమైంది. ప్రపంచంలో సంపన్న సాంకేతికతలో అగ్రాసనాధిపత్యం వహిస్తున్న అమెరికాకు ఇంతవరకు మహిళ ప్రెసిడెంట్ కాలేదు. 1872లో విక్టోరియా ఉడ్‌హల్ విఫల ప్రయత్నం, మళ్లీ రానున్న ప్రస్తుత అధ్యక్ష ఎన్నికలలో పోటీలో డెమోక్రట్‌ల నుంచి హిల్లరీ రోధామ్ క్లింటన్ రిపబ్లిక్‌ల నుంచి కార్లీ ఫియొరిగా అభ్యర్థులుగా రంగంలో ఉన్నారు.

విశ్వవ్యాప్తంగా స్త్రీ, పురుష వివక్ష లేకుండా వయోజన ఓటింగ్ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థకు కీలకం కావటంతో ప్రపంచ మహిళా సాధికారత గర్వంగా ప్రస్తుతం తల ఎత్తుకుంటోంది. మతాధిపత్య ప్రాచీన సమాజం, మహిళా శక్తిని బుజ్జగిస్తూనే, కుటుంబ వ్యవస్థను ప్రాణాధారంగా సంభవిస్తూనే సృష్ట్యాధి నుంచి ప్రత్యేక పరిమితులు విధించింది. కాని ప్రాచీన, మధ్య, ఆధునిక, అధునాతన ఏకాల పరిభ్రమణంలో అయినా అన్నిరంగాలలో మహిళా శక్తి చైతన్యవంతంగా ఈ పరిస్థితిని ఎదుర్కొంటూ నిలద్రొక్కుకుంటోంది. ఎందరో మహిళలు సామ్రాజ్యాధినేతలుగా నాడు మహారాణులుగా సమాజాన్ని శాసించారు. పితృస్వామ్య భావజాలంతో మాతృస్వామ్యం సంఘర్షించిన దృష్టాంతాలు కోకొల్లలు. కుటుంబ వ్యవస్థ నిర్మాణంలో తల్లి, చెల్లి, భార్య ఏ స్థానంలో ఉన్నా మహిళా శక్తి అనిర్వచనీయ ఆత్మీయ శక్తిగా సమాజాన్ని అంతర్భాగంగా ఔదలదాల్చి నడిపిస్తోంది. కాని జనాభాకు తగ్గట్టుగా ప్రాతినిధ్యం లేదు. ప్రపంచ ప్రాంతీయ స్థాయి పార్లమెంటులలో సగటున రెండు హౌస్‌లలో మహిళల శాతం 21.8 ఉంది. ఇది అమెరికాలో 25.2 శాతం, యూరప్ దేశాలలో 24.6 శాతం, ఏసియాలో 18.4 శాతం పార్లమెంట్ ఉభయసభలలో సగటు సామాన్య సంఖ్యగా ఉన్నట్టుగా రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మీడియా నివేదికల ప్రకారం డ్రైవింగ్‌పైన నిషేధం ఉన్న సౌదీ అరేబియా దేశంలో రాచరిక వ్యవస్థ అనుమతించిన మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికలలో 978 మంది మహిళలు అభ్యర్థులుగా పబ్లిక్ పోల్స్‌లో రిజిస్టరు చేసుకోగా 18 మంది విజయం సాధించారు. సౌదీ చరిత్రలో విచిత్ర సువర్ణ అధ్యాయం అది. అయినా స్విట్జర్లాండ్‌లో ఈనాటికి మహిళలకు ఓటు హక్కు లేదు.

21వ శతాబ్దంలో భారతీయ మహిళ అందులో యువతరం సమానత సాధించే సంఘర్షణలతో సాహసికంగా వెలుగుచూస్తోంది. కాదేదీ మహిళకు అనర్హం అన్నట్లుగా విమానయానాలలో పైలట్లుగా, జలాంతర్గాములలో సాయుధ సైనికశక్తిగా చేయూత ఇస్తే దూసుకుపోతున్నారు. విదేశాలలో భారతీయ కీర్తిప్రతిష్టల బావుటాలు ఎగరేస్తున్నాయి. అసాధారణమైన మేధాసంపన్నతతో శాస్త్రీయ వైద్య, కుటుంబాలలో తల్లిగా, భార్యగా నిర్వర్తించే బాధ్యతలతో పాటు మత దైవసంబంధిత నైతికతా విలువలకు పురుషులకంటే ఏ మతం అయినా మహిళలే కట్టుబడి ఉంటున్నారు. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ సంఘర్షణాయుతంగా సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు. సవాళ్లు విసురుతున్నారు. హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాలు, అన్యాయాలు లైంగిక దాడులు, ఆర్థిక ఇబ్బందులు, వేద నాయుతదైన్యం, ఆకర్షణల ప్రలోభాలు, వంచనాయుత ఆధిపత్య వికృత వైఖరులను నిలదీస్తున్నారు. ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అయ్యప్ప, శనీశ్వర అంతరాలయం మహిళల ప్రవేశ నిషేధం ప్రస్తావనలో మహిళా ఉద్యమ నేతల స్పందన ఆందోళన జాతీయ సంచలనమైనది. ఇటీవల హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో 79 డివిజన్‌లలో మహిళా కార్పొరేటర్‌లు పాగా వేయడం మహిళా చైతన్యానికి ప్రతీక. 50 శాతం రిజర్వేషన్ సాధించిన నాడే సాధికారతకు సమానత భారతీయ మహిళా జనజీవన శుభోదయం.

**– జయసూర్య, జర్నలిస్టు**




# అవనిలో సగమైనా వివక్షే?

ఆకాశంలో సగమైనా మహిళలు సమాజంలో సగంగా అన్నీ హక్కులు పొందడం లేదు, పొందినా అవేవీ అనుభవంలోకి రావడం లేదు. శ్రమ ఉత్పత్తిలో సగానికి తక్కువేమీ కాకపోయినా కడుపులోంచి బిడ్డను కనాలన్నా, తాను ఎంతవరకు చదువుకోవాలన్నా, ఎలా జీవించాలన్నా నిర్ణయించుకునే స్వేచ్ఛ స్త్రీకి లేదు. స్త్రీ ఎప్పుడూ మగవాడి కనుసన్నల్లో జీవించాలి. చిన్నప్పుడు తండ్రి, పెళ్లి తర్వాత భర్త, ముసలితనంలో కొడుకుల అధీనంలో జీవించాల్సి వస్తుంది. ఈ పరిస్థితి పోగొట్టేందుకు సమాజంలో అన్ని వర్గాలు చింతన చేయాల్సి ఉంటుంది. సమాజం ఏ సెక్షన్ పట్ల నిర్లక్ష్యంగా ఉంటుందో సెక్షన్‌కు అనుకూలత పెంచేందుకు ప్రత్యేకంగా దినోత్సవాలు జరుపుకోవాల్సి వస్తుంది. ఇప్పుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కూడా అంతే, మార్చి 8న జరిగే ఈ మహిళా దినోత్సవానికి ఎంతో చరిత్ర ఉంది. మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలవబడింది. వివిధ ప్రాంతాలలో ఈ ఆరచణ మహిళలకు గౌరవం, గుర్తింపు అనే సాధారణ ఉత్సవంగా ఉన్నా, తర్వాత మహిళల ఆర్థిక, రాజకీయ ఘటనగా ప్రారంభమై, ఆచరణ వివిధ దేశాలు ముఖ్యంగా తూర్పు, యూరప్, రష్యా, పూర్వ సోవియట్ సమూహపు దేశాల సంస్కృతిలో మిళితమైంది. కొన్ని ప్రాంతాల్లో ఈ దినానికి రాజకీయ రంగు పోయి, పురుషులు స్త్రీలకు అభిమానం వ్యక్తపరిచే విధంగా జరుపుతారు. ఈ ప్రయత్నమే మహిళలను అన్నింటా ముందుకు తీసుకెడుతుంది. ప్రారంభంలో మహిళా దినోత్సవం వేరు వేరు తేదీలలో ఆచరించబడింది. చికాగోలో మే3, 1908, న్యూయార్క్‌లో ఫిబ్రవరి 28, 1909, ఫిబ్రవరి 27, 1910 రెండో అంతర్జాతీయ సామ్యవాద సమావేశానికి ముందుగా ఆగస్టు 1910లో అంతర్జాతీయ మహిళా సమావేశం కోపెన్‌హాగెన్‌లో జరిగింది. అమెరికా సామ్యవాదులచే ఉత్తేజితులై, జర్మన్ సామ్యవాది లూయిస్ జియట్జ్ వార్షిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని ప్రతిపాదించగా జర్మన్ సామ్యవాది క్లారా జెట్కిన్ సమర్థించారు. 17 దేశాల నుంచి వచ్చిన 100 మహిళలు మహిళకు ఓటు హక్కుతో పాటు సమాన హక్కులు సాధించడానికి సరైన వ్యూహమని అంగీకరించారు. తదుపరి సంవత్సరం మార్చి 19, 1911న పది లక్షల మందిపైగా ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలలో మార్చి 19, 1911న మహిళా దినోత్సవం ఆచరించారు. ఆస్ట్రో-హంగేరియన్ రాజ్యంలో 300కు పైగా ప్రదర్శనలు జరిగినవి. వియన్నాలో రింగ్ స్ట్రాసెలో ప్రదర్శన చేశారు. మహిళలు ఓటు హక్కు, ప్రభుత్వ పదవుల హక్కు అడిగారు. ఉపాధిలో లింగ విచక్షణ పద్ధతులను ప్రతిఘటించారు. అమెరికాలో ఫిబ్రవరి చివరి ఆదివారం నాడు మహిళా దినోత్సవం జరుపుకుంటూనే ఉన్నారు. 1913లో రష్యన్ మహిళలు వారి మొదటి మహిళా దినోత్సవాన్ని ఫిబ్రవరి చివరి ఆదివారం జరుపుకున్నారు. (అప్పటికే రష్యాలో జూలియట్ కాలెండర్ అమలులో ఉంది) 1914 వరకు మహిళా సమస్యల గురించి ఎన్నో ఆందోళనలు జరిగినా అవేవీ మార్చి 8న జరగలేదు. అయితే 1914 నుంచి ఆ రోజుని మహిళా దినోత్సవంగా ప్రకటించుకున్నారు. అప్పటి నుంచే అన్నీ దేశాల్లోనూ మార్చి 8నే మహిళా దినోత్సవంగా తీర్మానించారు. 1914లో జర్మనీ జరుపుకున్న మహిళా దినోత్సవాన్ని మహిళా ఓటుహక్కు కోసం అంకితమిచ్చారు. తర్వాత ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాలు జరుపుకోవడం ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి ప్రతి మహిళా దినోత్సవానికి 1996 నుంచే థీమ్స్ ప్రకటించడం ప్రారంభించింది.

భారతదేశంలో తొలిగా అహ్మదాబాద్‌లో అనసూయా సారాభాయ్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్ అనే పేరుతో కార్మిక సంఘం ప్రారంభించింది. భారత కార్మిక ఉద్యమంలో కార్మిక స్త్రీలను సంఘటితం చేసిన మహిళా నేతలలో సుశీలా గోపాలన్, విమలా రణదివే, కెప్టెన్ లక్ష్మీ సెహగల్, అహల్యా రంగ్నేకర్, పార్వతీ కృష్ణన్ ప్రముఖులు, ఈ పోరాటాల ఫలితంగానే స్వాతంత్ర్యం తర్వాత కార్మికుల బ్రతుకులు



మెరుగయ్యాయి. కార్మికుల పని పరిస్థితులు, వేతనాలు, మహిళా కార్మికుల గురించి చట్టాలను చేయబడ్డాయి. ఇలా దేశంలో మహిళల శ్రమకు గుర్తింపు ఇవ్వడం ప్రారంభమై, ఇప్పుడు మహిళలకు రాజకీయాల్లో స్థానం ఇచ్చే పరిస్థితి వచ్చింది. రిజర్వేషన్లు ఇవ్వడం స్థానిక సంస్థల్లో అమలు జరుగుతున్నా, అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు రావాల్సి ఉంది. దీని కోసం పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందాల్సి ఉంది. సోనియాగాంధీ నాయకత్వంలో పదేళ్లు పాలించిన యుపిఎ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ మహిళా బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినా ఇంకా ఆమోదం పొందలేదు. ఒకవేళ పొందినా స్త్రీలు చట్ట సభలకు ఎన్నికైతే పంచాయతీరాజ్ అనుభవమే పునరావృతం అవుతుందేమో, స్త్రీలు డమ్మీలుగా మిగిలిపోతారేమో, స్త్రీలను ఇంటికి పరిమితం చేసే ఫ్యూడల్ వ్యవస్థ ఇప్పటికీ రాజ్యం ఏలుతుంది. ఏనాడు పార్లమెంట్‌లో మహిళా ప్రతినిధులు 11 శాతంకు మించలేదు. అప్పుడప్పుడు స్త్రీలే పాలకులుగా వచ్చినా, మహిళల రక్షణకు తగు చర్యలు తీసుకోలేకపోతున్నారు. స్త్రీలపై కుటుంబ హింస రోజురోజుకు పెరుగుతుంది. పైగా దేశంలో పెళ్లి సామాజిక సంబంధంగా కాకుండా, ఆర్థిక సంబంధంగా మారిపోయింది. పెళ్లి తంతు వధువు కుటుంబం నుంచి డబ్బును గుంజుకునేందుకు మార్గంగా మారిపోయింది. 1956, 1986లలో చేయబడిన హిందూవారసత్వ చట్టం ప్రకారం ఆడ మగ తేడా లేకుండా ఆస్తిలో సమాన హక్కు ఇవ్వబడింది. కానీ ఈ పితృస్వామ్యవ్యవస్థలో ఏ కుటుంబం మహిళలకు ఆస్తిలో వాటా ఇవ్వటం లేదు. 1961 వరకట్న నిషేధ చట్టం చేసినప్పటికీ ఈ దురాచారం గౌరవంగా అమలు చేస్తూ మహిళల పట్ల శాపంగా మార్చారు. భ్రూణ హత్యలు పెరిగిపోతున్నాయి. 1994లో గర్భస్థ శిశువు పరీక్ష నియంత్రణ చట్టం వచ్చినా భ్రూణ హత్యలు ఆగడం లేదు.

శిశు లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించినా దేశవ్యాప్తంగా చాలా మంది డాక్టర్లు ప్రలోభాలకు గురై గుప్తసంకేతాల ద్వారా పుట్టబోయే బిడ్డ గురించి చెబుతున్నారు. హర్యానాలో అన్ని రాష్ట్రాల కంటే తక్కువ ఆడశిశువులు జన్మనిస్తున్నారు. హర్యానాలో ప్రతి వెయ్యి మంది మగశిశువులకు 830 మంది ఆడపిల్లలు జన్మిస్తున్నారు. తర్వాత స్థానంలో పంజాబ్(846), జమ్ముకాశ్మీర్(859) ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సైతం ఈ సంఖ్య 861 మాత్రమే కావడం గమనార్హం. 1971లో దేశంలో 1000 మంది మగశిశువులకు 990 ఆడశిశువులు జన్మించేవారు. ఇప్పుడు సంఖ్య బాగా తగ్గిపోయింది. పల్లెలతో పోలిస్తే, విద్యావంతులు ఎక్కువగా ఉండే పట్టణాల్లోనే ఆడశిశువుల సంఖ్య తగ్గిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో 919 పాపాయిలు జన్మిస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో ఆ సంఖ్య 902కే పరిమితమైంది. కుల, మత, ప్రాంత, సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు లేకుండా అన్ని వర్గాల వారి ఆడపిల్లల పట్ల వివక్ష పెరుగుతోందని ఆరోగ్య మంత్రిత్వశాఖ వర్గాలు చెబుతున్నాయి. అదీగాక శిశుమరణాల రేటులో కూడా ఆడపిల్లల సంఖ్యే ఎక్కువగా ఉందని తెలిపాయి. చిన్న కుటుంబానికే పరిమితమవుతున్న కారణంగా ఎక్కువ మంది ఒక్క సంతానాన్నే కోరుకుంటున్నారు. అదీ మగపిల్లాడైతే బాగుంటుందనుకుంటున్నారు. తొలి కాన్పులో ఆడపిల్ల పుడితే రెండోసారి మగశిశువు కోసం ప్రయత్నిస్తున్నారు. పైకి ఎన్ని కారణాలు చెప్పుకున్నా మన సమాజంలో స్త్రీల పట్ల చిన్న చూపు ఉ



ండటమే ప్రధాన కారణం. అందుకనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాల సందర్భంలోనైనా సమాజంలోని అన్ని వర్గాలు స్త్రీలు అన్ని రంగాల్లో రాణించే విధంగా పూర్తిస్థాయి సహకారం అందించాలి. మహిళా దినోత్సవం అనేది వేడుక కాదు, మహిళల పట్ల వివక్షతను పోగొట్టేందుకు సమాజమంతా ప్రతిన పూనాల్సిన దినం.

**– ఏనుగుల పావని, న్యాయకళాశాల**

# తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ప్రభుత్వాలను కేరళ తరహాలో బలోపేతం

తేది 6-02-2016 నుండి 13-02-16 వరకు శ్రీయుత కమీషనర్ టిసిపార్డ్, హైదరాబాద్‌గారి ఆదేశాలతో కరీంనగర్ జిల్లా ప్రజాపరిషత్ - ఛైర్‌పర్సన్ శ్రీమతి తుల ఉమగారి మరియు వైస్ ఛైర్మన్ శ్రీ రాయిరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సులలో కేరళ రాష్ట్రంలోని స్థానిక సంస్థల (పిఆర్ఐఎస్) పనితీరు, ప్రణాళికలు, అభివృద్ధి పథకాలు, మొదలగునవి అమలు తీరుపై అధ్యయన యాత్ర 57 మంది జడ్‌పిటిసిలు 2 కో-ఆప్టెడ్ మెంబర్, అధికారులు కె.మాధురిగారు, టిసిపార్డు, జడ్‌పిడిటిఎం కోట సురేందర్‌లు వెళ్ళి రావటం జరిగినది. ఇట్టి కార్యక్రమమును శ్రీయుత ఎంపి కరీంనగర్ బి.వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్ శ్రీ కొప్పుల ఈశ్వర్, సాంస్కృతిక రథసారధి శ్రీ రసమయి బాలకిషన్, చొప్పదండి ఎం.ఎల్.ఏ. శ్రీమతి శోభగాలన్నలు, అధికారులు జడ్‌పి సిఇఓ సురజ్‌కుమార్‌గారు, డిప్యూటీ సిఇఓ గౌతమ్‌రెడ్డిగారల సమక్షంలో పచ్చజెండా ఊపి యాత్ర ప్రారంభించారు.

కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కెఐఎల్ఏ) త్రిసూర్ యందు తేది: 8-02-2016 రోజున డైరెక్టర్, కలాశ్రీ పిపి బలం, ప్రొ॥టి.రాఘవన్, ప్రొ॥సన్ని జార్జ్, రామక్రిష్ణగారులు శిక్షణ ప్రారంభించి కేరళ గుర్చి, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, 73వ రాజ్యాంగ సవరణ-అధికారాలు, విధులు, నిధులు, సిబ్బంది పనితీరు అంశాలపై బోధించడం జరిగినది. రెండు బృందాలుగా వేరుచేసి ఒకదానికి ఛైర్మన్ శ్రీమతి టి.ఉమగారు, 2వ దానికి శ్రీ ఆర్.రాజారెడ్డిగారు నాయకత్వం వహించి 9-02-2016 రోజున కేరళలోని వల్లచీర, మడకత్రా గ్రామ పంచాయితీలను సందర్శించి గ్రామసభలలో పాల్గొని ప్రజలతో, ప్రజాప్రతినిధులతో, ఉద్యోగులతో ప్రత్యక్ష అనుభవాలను పంచుకోవటం జరిగినది. 9-2-16 రోజున జిల్లా పంచాయితీలు అయిన పాలక్కడ్, త్రిసూర్‌లను అట్లే 10-2-16 రోజున బ్లాక్ పంచాయితీలు తల్లిక్కులమ్, ముల్లాస్సెరిలను సందర్శించటం జరిగినది. కేరళ సందర్శనలో జడ్‌పిటిసిఎస్ బృందం వారు ప్రత్యక్షంగా చూసి, వారితో చర్చించి, సమావేశాలలో పాల్గొని ఈ క్రింది అనుభవాలను తెలిపారు.

కేరళ ఎక్కడ చూసిన పచ్చని పండ్లతోటలు, ప్రతి ఇంటి ఆవరణలో కనీసం 15 నుండి 30 మొక్కలు, పండ్ల చెట్లు, పూలతోటలు చాలా ఆహ్లాదకరమైన వాతావరణం దీనితో అక్కడ విస్తరమైన వర్షాలు, ఎత్తయిన కొండలు, ప్రకృతి చాలా చూడముచ్చటగాయుంది.

గ్రామ పంచాయతీలలో సమీక్షలతో, ప్రత్యక్షంగా చూసిన విషయాలు: 100% అక్షరాస్యత, ప్రతి పౌరునికి విజ్ఞానం, జీవన నైపుణ్యం, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో కూడిన వైఖరులతో వారు ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలో వివిధ స్థాయిలలో ఉద్యోగాలు చేస్తూ అత్యధిక ఆదాయాలు గడిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవవనరులను - ఎక్సేంజ్ చేసే రాష్ట్రంగా కనపడినది. సర్కారీ వైద్యం 3 రకాల ఆసుపత్రులు గ్రామ పంచాయతీల అధీనంలో నడుస్తాయి. హొమియోపతి, ఆల్లోపతి, ఆయుర్వేదం చక్కటి భవనాలు, పూర్తిస్థాయిలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది, కార్పొరేట్ హాస్పిటల్ సౌకర్యాలు సరిపోయే మందులు అందిస్తూ విద్యతోపాటు ప్రజారోగ్యంనకు ప్రత్యేక శ్రద్ధ కనపరచి వైద్యసేవలు సామాన్యులకు అందుబాటులో ఉంచటం గొప్ప విశేషంగా కనపడినది. సుమారు 80% మంది ప్రజలు ప్రభుత్వం ఆసుపత్రికి వెళ్ళటం జరుగుతుంది. రోజుకు 150 నుండి 200 వరకు ఓ.పి. వస్తారని 20 వేల మందికి ఒక పిహెచ్‌సి యుందని, గిరిజనకొండ ప్రాంతాలతో 3000 జనాభాకు ఒక ఉపకేంద్రం ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకపథకంతో స్థానిక ప్రభుత్వం (జిపి) పర్యవేక్షణలలో ఒక వాహనం, నర్సు మందులు ఇంటికి వెళ్ళి మందులు అల్పహారం పెట్టటం జరుగుతుంది. వైద్యం "అద్భుతం" ఇలాగే మన రాష్ట్రంలో కూడా అమలుకు గౌ॥ముఖ్యమంత్రితో మాట్లాడతామని జడ్‌పిఛైర్‌పర్సన్ తెలిపారు. కేరళలలో సంపూర్ణంగా స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, విధులు, నిధులు, సిబ్బంది పర్యవేక్షణ బదాలయించి నాణ్యమైన పొలిటికల్ విల్ కలిగిన సమర్థవంతమైన, నైతిక విలువలు, పరిపాలన పరిజ్ఞానం, ప్రజలను, అధికారులను, తనతోటి ప్రజాప్రతినిధులను సమన్వయం చేసి సమిష్టి లక్ష్యాలను సాధించేందుకు చక్కటి ప్రణాళికలతో ముందుకు వెళ్ళటం జరుగుతుంది.

ప్రజలందరూ అధికారంలో పాలు పంచుకోవడాన్నే ప్రజాస్వామ్యం అంటారు. ఒకరికోసం అందరం, అందరికోసం ఒకరు అనే మూలసూత్రంతో వారు ఆయా సభ, వార్డు సభలు, స్టాండింగ్ కమిటిలు సమావేశాలు, తీర్మానాలతో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల తుది జాబితా తయారు చేస్తారు. ఇందులో ఎం.ఎల్.ఏ., ఎం.పి.ల జోక్యం గాని పరోక్ష ఒత్తిడిగాని ఎంత మాత్రం యుండదు. నిర్భయంగా ప్రజలు, 13 శాఖల ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని యదార్థ నిరుపేద లబ్ధిదారులకు ప్రయోజనాలు (అన్ని పథకాలు సిఎస్‌పి, స్టేట్) చేరేలా చేసి మానవత్వం చాటుతున్నారు.

"కేంద్రంలో 20 మంది కూర్చోని శాసించే పద్ధతి అసలైన ప్రజాస్వామ్యం కాదు- ప్రతి గ్రామంలోని ప్రజలు దిగువస్థాయి నుంచి నడిపేది ప్రజాస్వామ్యం"

- మహాత్మాగాంధీ

పైసూక్తిని అక్షరాల అమలు చేసి చూపిస్తున్నారు. అది అన్ని రాష్ట్రలకు ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన మన తెలంగాణకు "ఆదర్శం" అయ్యేల మన అందరి బాధ్యులుగా కృషి చేస్తాం అన్నారు.

గ్రామ పంచాయతీ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 1/3 వంతు కేటాయింపు చేస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ వార్షిక బడ్జెట్ సుమారు 5 కోట్లు వరకు ఉంటుంది. ఉదా: మడకత్రా జిపి ఆర్థిక వివరాలు ఈ క్రింది విధంగా కలవు.

(1 ఏప్రిల్ 2014 నుండి 31 మార్చి 2015)

మడక్కత్రా జిపి ఆదాయాలు - వ్యయాలు 2014-15

ట్యాక్స్ రెవెన్యూ

| | | |
|---|---|---|
| 1. | ప్రాపర్టి టాక్స్ నివాసభవనాలు | 50,36,831 |

| | |
|---|---|
| 2. ప్రొఫెషనల్ టాక్స్ – సంస్థలు, వ్యాపారులు | 1,78,290 |
| 3. ప్రొఫెషనల్ టాక్స్ – ఉద్యోగాలు | 27,62,520 |
| 4. టాక్స్ రివిషన్ | 36,304 |
| | 79,41,337 |
| 5. రెంటల్ ఆదాయాలు జిపి | 3,250 |
| 6. ఫీజులు, యూజర్ ఛార్జీలు | 7,78,618 |
| 7. అమ్మకం–హైర్ ఛార్జీలు | 1,00,040 |
| 8. రెవెన్యూ గ్రాంట్స్, కంట్రిబూషన్స్ | 7,07,74,478 |
| 9. ఇన్‌వెస్ట్‌మెంట్స్‌పై ఆదాయం | 27,644 |
| 10. వడ్డీల ఆదాయాలు | 18,674 |
| 11. ఇతర ఆదాయాలు | 64,341 |
| | 7,97,08,382 |

వ్యయాలు

| | |
|---|---|
| 1. ఎస్టాబ్లెస్‌మెంట్‌ఖర్చులు | 66,43,652 |
| 2. అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు | 12,34,229 |
| 3. ఆపరేషన్ అండ్ మెండినెన్స్ | 24,84,588 |
| 4. వడ్డీలు, ఫైనాన్స్ ఛార్జీలు | 94,216 |
| 5. వికేంద్రీకరణ ప్రణాళిక కార్యక్రమాలు | |
| ఎ) ఉత్పత్తి రంగం | 48,66,538 |
| బి) సేవల రంగం | 3,14,16,262 |
| సి) మౌళిక సదుపాయలు | 24,76,339 |
| డి) సెక్టార్ డివిజన్స్‌లలో | 2,74,901 |
| 6. వ్యయాలు స్టేట్ స్పానర్డ్ స్కీమ్‌లు | 1,76,73,816 |
| 7. ప్రాజెక్ట్ నిర్వహణ | 52,21,376 |
| 8. రెవెన్యూ వ్యయాలు | 12,91,254 |
| 9. తరుగుదల వ్యయాలు | 13,16,711 |

ఒక్క జిపి మొత్తం ఆదాయాలు 7,97,08,382 వ్యయాలు 7,49,93,882 ఒక్క వార్షిక (2014-15) సంవత్సరములో మిగులు ఆదాయాలు 47,14,500 యున్నాయి.

పై పట్టిక విశ్లేషణతో మనం అర్థం చేసుకొన్నది 100% పన్నుల చెల్లింపు వుంటుంది. ప్రతి గ్రామ పంచాయతీలో పూర్తిస్థాయి సిబ్బంది, పూర్తి కంప్యూటరీకరణ, లాన్ మరియు వాన్ సేవలు ప్రతి ఆఫీసులో కల్పించి పారదర్శకత, జవాబుదారీతనం కల్గించే విధానం అద్భుతంగా అమలు చేస్తుంది.

ప్రతి వస్తుసేవల వినియోగంపై తప్పక రశీదు పొందుతారు. ఉదా: మద్యం షాపులో కూడా వినియోగదారులు తప్పక రశీదు పొందుతారు. ప్రభుత్వమే అమ్ముతుంది. కాని రాబోయే 10 సం॥లో మద్యరహిత రాష్ట్రంగా ఏర్పాటుకు కృషి చేస్తున్నాం అని తెలిపారు.

పై విధంగా తెలంగాణ పంచాయతీ వ్యవస్థలోను సమూల మార్పులు, సంస్కరణలు తెచ్చి ప్రతి గ్రామ పంచాయతీకి ఆదాయవనరులు పెంచాల్సిన అవసరం యుందని పేర్కొన్నారు.

మడక్కత్రా జిపి అధ్యక్షులు శ్రీ వినయన్‌గారు, సెక్రటరీ సుదాంగరాన్, సహాయ సెక్రటరీ రాజేశ్వరిగారు మరిన్ని వివరాలు ఈ క్రింది విధముగా తమ తమ ప్రసంగాలలో తెలిపారు.

జనాభా 2,934 (ఎం-12, 236 ఎఫ్-12708, ఎస్‌సి 10,700, ఎస్‌టి- వార్డులు 16, .....కల్లుగడ, జిల్లా త్రిస్సూర్.

ఎన్నికలు పార్టీపరంగా జరుగుతాయి. ఎల్‌డిఎఫ్ అధికారంలోయుంది. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం యుంది. పోటీ చేసే అభ్యర్థిని వార్డు గ్రామ, బ్లాక్‌స్థాయి పార్టీ నేతలు ఓటింగ్ ద్వారా నిర్ధారిస్తారు. ఎన్నికల ఖర్చులు ప్రజావిరాళాలు సేకరణతో ఖర్చు చేస్తారు. ప్రతి పైసాకు లెక్క చూపిస్తారు. ప్రజలకు జవాబుదారిగా వ్యవహరిస్తాయి.

తలిక్కులమ్ బ్లాక్ పంచాయతీ ఆదాయం 8,87,68,310. వ్యయాలు 9,05,57,695, ఎంజిఎన్ఆర్ఇహెచ్ఎస్ 9,09,00,000. వ్యయం 9,30,00,000. ఆదాయ మార్గాలు పుష్కలంగా యున్నాయి.

ఎస్‌సి కుటుంబాలు 20,418, ఎస్‌టి కుటుంబాలు 64 మంది కలరు. ఎస్.సి. నిరుపేదలకు ప్రభుత్వపరంగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుంది.

ఇక్కడి ప్రజల జీవనోపాధులు – విదేశాలకు వెళ్ళటం, వ్యవసాయం (కొబ్బరి, అరటి, పోకచెక్కలు, రబ్బరు, వరి ప్రధానమైనవి) చేపల వేట, కొన్ని పరిశ్రమలు, కూరగాయాలు పండించటం జరుగుతుంది. వ్యవసాయం చాలా తక్కువేయుంది.

ఆరోగ్య, విద్య స్టాడింగ్ కమిటి అధ్యక్షులు సులేఖ జనత్‌తో వైద్యం, పాఠశాల పనితీరును సందర్శించి పిల్లలతో, టీచర్స్‌తో మాట్లాడి తెలుసుకోవటం జరిగినది.

పాలక్కడ్ జిల్లా పంచాయతీ ఛైర్‌పర్సన్ శ్రీమతి శాంతకుమారి వైస్‌ఛైర్మన్ నారాయణదాసు, సెక్రటరీ (మన సిఇఒ) మజీద్ మరియు జడ్‌పి మెంబర్స్‌తో కలసి అనేక విషయాలు అధ్యయనం చేయటం జరిగింది. జిల్లా పంచాయతీతో 15% ప్రణాళిక నిధులు 67.21 కోట్లు ఎస్.సి.ల సంక్షేమం కోసం 38.29 కోట్లు, ఎస్.టి.సంక్షేమం 4,09 కోట్లు, నిర్వహణ గ్రాంట్లు 26.4 కోట్లు నిధులు వెచ్చిస్తున్నారు.

జిల్లా పంచాయతీ ద్వారా హైడల్ పవర్ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నారు. ఇంత వరకు ఏ రాష్ట్రంలో జడ్‌పి ద్వారా నిర్మించి నిర్వహించటం జరుగలేదు. 1.5 మెగావాట్ట్ (3.5), విద్యుత్ ఉత్పత్తి చేసి కెఎస్ఇబికి విద్యుత్ అమ్మి సం॥నకు 92 లక్షల ఆదాయం గడిస్తున్నాయి.

కేరళ రాష్ట్ర మాదిరి మన తెలంగాణ రాష్ట్రంలో కూడా విద్య, వైద్యంతోపాటు గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై నైపుణ్యాలు, భాషలపై (ఇంగ్లీష్, హిందీ) అనర్గలంగా మాట్లాడేలా, విదేశాలలో ఉపాధి, ఉద్యోగాలు పొందేలా విజ్ఞానం అందించాలని, జీవనదులలో నీటిని మిషన్ కాకతీయ ద్వారా ప్రతి చేనుకు సాగునీరు అందేలా ప్రతి జిల్లాకు ఒక పరిశ్రమ నెలకొల్పేలా, అధికారి వికేంద్రీకరణలో భాగంగా గ్రామజ్యోతి ఏడు ఫంక్షనల్ కమిటిలను బలోపేతం చేసి ప్రజల భాగస్వామ్యం పెంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి గ్రామసభలను బలోపేతం చేసి ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం దొరికేలా" ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామజ్యోతి కమిటిలు బాధ్యులు సమిష్టిగా సమన్వయంతో కృషి చేసి సామాజిక సాధికారత, స్వయం సమృద్ధి సాధించాలని కోరుకుందాం.

**కోట సురేందర్,**
**జిల్లా శిక్షణా మేనేజర్, కరీంనగర్**

# గంట్లవెల్లి గ్రామాన్ని సందర్శించిన భారత ప్రభుత్వ పంచాయితీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ.ఎ.కె.గోయేల్, ఐ.ఏ.ఎస్

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామాన్ని తేది:10-03-2016 నాడు మధ్యాహ్నం 3గం॥లకు భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి శ్రీ.ఎ.కె.గోయేల్ గారు సందర్శించారు.

ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లలిత, మరియు వార్డు సభ్యులతో గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీ సభ్యులతో సమావేశమై, గ్రామంలో అమలవుతున్న ఉపాధిహామి పథకం, త్రాగునీరు సరఫరా, ఆరోగ్య సేవలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం మరియు పారిశుధ్య కార్యక్రమాల అమలు మరియు శిక్షణ కార్యక్రమాల గురించి మరియు గ్రామ అభివృద్ధికి తయారుచేసుకున్న గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత గ్రామంలో నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం మరియు వృధా నీటిని నిలుపుతూ, భూగర్భ జలాలు పెంపొందించుటకు నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సర్పంచ్ లలిత భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ గోయేల్ మాట్లాడుతూ ఇక్కడి గ్రామ పంచాయతీ పరిపాలన విధానం, పథకాల అమలు చాలా బాగుందని సంతృప్తిని వ్యక్తం చేసి సర్పంచ్ మరియు పాలక మండలిని అభినందించారు.



**బి.వెంకటయ్య, జిల్లా శిక్షణా మేనేజర్, మహబూబ్‌నగర్**

# స్వచ్ఛ తెలంగాణ లక్ష్యంతో ముందడుగు!

**ప్రతి పేదవాడి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం**

**రాష్ట్రంలో** బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) వార్డులు 332 ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి అనువుగా రాష్ట్రంలో ప్రారంభించిన స్వచ్ఛ తెలంగాణలో భాగంగా ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడమే కాకుండా ఆరోగ్య పరిరక్షణకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడంతో ఇది సాధ్యమైంది. తెలంగాణలోని 67 మున్సిపాలిటీల పరిధిలో 1862 వార్డులుండగా, వాటిలో 332 వార్డులను ఓపెన్ డెఫికేషన్ ఫ్రీగా నిర్ధారించారు. కాగా మిగిలిన 1530 వార్డుల్లోనూ ఓడీఎఫ్‌ను సాధించేందుకు మునిసిపల్ అధికారులు కృషి చేస్తున్నారు. పట్టణాల్లో నివసించే ప్రతి పేదవాడి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

లక్ష్యం సాధించిన మున్సిపాలిటీలివే...!

ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ లక్ష్యాలు సాధించిన 332 వార్డులున్న మున్సిపాలిటీలు ఇవే. అచ్చంపేటలో 7, బాదేపల్లి 2, కల్వకుర్తి 3, కొల్లాపూర్ 2, నాగర్‌కర్నూల్ 3, నారాయణపేట 2, షాద్‌నగర్ 4, వనపర్తి 9, గజ్వేల్ 8, మెదక్ 4, సదాశివపేట 8, సంగారెడ్డి 2, సిద్దిపేట 34, జహీరాబాద్ 4, భువనగిరి 3, హుజూర్‌నగర్ 10, కోదాడ 3, మిర్యాలగూడ 4, సూర్యాపేట 5, బడంగ్‌పేట 5, ఇబ్రహీంపట్నం 2, మేడ్చల్ 8, తాండూర్ 1, బెల్లంపల్లి 14, భైంసా 11, కాగజ్‌నగర్ 1, మంచిర్యాల 2, మందమర్రి 10, నిర్మల్ 1, హుస్నాబాద్ 11, హుజూరాబాద్ 5, జగిత్యాల 5, జమ్మికుంట 1, కరీంనగర్ 30, కోరుట్ల 6, మెట్‌పల్లి 5, పెద్దపల్లి 5, రామగుండం 9, సిరిసిల్ల 31, వేములవాడ 5, మధిర 2, మణుగూరు 2, పాల్వంచ 13, సత్తుపల్లి 12, భూపాలపల్లి 11, జనగామ 4, మహబూబాబాద్ 1, నర్సంపేట 3, పరకాలలో 2 వార్డులను ఓడీపీ ప్రాంతాలుగా అధికారులు నిర్ధారించారు.

ప్రతి పేదవాడి ఇంటికి...

పట్టణాల్లో కొనసాగుతున్న ఆరు బటయ కాలకృత్యాల అనవాయితీకి స్వస్తి పలకాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మురికివాడల్లో కనీస వసతులు లేకుండా జీవిస్తున్న కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంకల్పించారు. ఇందుకోసం ప్రతి పేదవాడికి రూ.15వేల ఖర్చుతో మరుగుదొడ్డి నిర్మాణాన్ని చేపట్టాలని సిఎం నిర్ణయించారు. 2019 నాటికి మున్సిపాలిటీల్లో మరుగుదొడ్లు లేని ఇల్లు ఉండకూడదన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణాల్లో ఇల్లు ఉండి మరుగుదొడ్డిలేని ప్రతి ఇంటి యజమాని ఈ పథకానికి అర్హుడేనని నిర్ణయించారు. పట్టణాల్లోని మురికివాడల్లో కొన్ని బస్తీల్లో ఇండ్లలో మరుగుదొడ్డి నిర్మాణానికి స్థల సమస్య ఉంటుంది. అక్కడ కమ్యూనిటీ టాయ్‌లెట్లను నిర్మించాలని నిర్ణయించారు.

# మహిళ

**హైతీ అనే దేశంలో మహిళలు ఎంత నిక్కృష్టమైన దురాచారానికి గురవుతున్నారంటె యుక్తవయసు రాగానే యువతుల్లో లైంగిక ఇచ్ఛ కలుగకుండ ఉండుట కొరకు ఆమె జననాంగంలోని కొద్ది భాగాన్ని కత్తిరించివేస్తారు. ఆ క్రియ శాస్త్రీయ పద్ధతుల్లో జరగదు. మన దగ్గర ఇంతకు ముందు నాటు మంత్రసానులు పురుడు పోసేవారు. అదేవిధంగా అశాస్త్రీయ పద్ధతిలో ఒక యువతి జననాంగాన్ని కత్తిరించే సమయంలో మూత్రకోశానికి సంబంధించిన భాగం కూడ తెగిపోయింది.**



మహిళ అన్ని దేశాలలోను, అన్ని కాలాలలోను వివక్షతకు, అణచివేతకు, హింసకు గురి అవుతూనే ఉన్నది. స్త్రీని ఒక వస్తువుగా భావించినందువలననే ధర్మరాజు జూదములో ద్రౌపదిని ఫణంగా పెట్టగలిగాడు. ఆడినమాట తప్పరాదని ఆమె ఇష్టా అయిష్టాలను తెలుసుకోకుండానే హరిశ్చంద్రుడు తాను అమ్ముడుపోయి భార్య చంద్రమతిని కూడా అమ్మేశాడు. మహిళ వ్యాపారానికి ఉపయోగపడే పరికరంగా, ధనార్జనకు మూలంగా ఎటు తిప్పితే అటు తిరిగే ఆటబొమ్మగా, అవసరాలు తీర్చేదానిలా తయారు చేశారు. వ్యాపార ప్రకటనలలో మహిళల అశ్లీల దృశ్యాల చిత్రాలకు ఉపయోగపడుచున్నది. ధనార్జన కొరకు వ్యభిచార గృహాలకు అమ్ముడుపోతున్నది. అందరి అవసరాలు తీర్చే స్థితికి చేరుకుంది.

మహిళకు మనసుందని, ఆలోచనలు, కోరికలు ఉంటాయని, భావోద్వేగాలు గలిగే మనసున్న మహిళ అని, ఆమె కూడా ఒక వ్యక్తి అనే తలవని వారు నేటికి లేకపోలేరు. ప్రభంద కావ్యాలలో మహిళల అంద చందాలను హిమాలయాలంత ఉన్నతంగా వర్ణించారు, పొగిడారు. చంద్రబింబంలాంటి ముఖమని, చెంపకు చారెడేసి కన్నులని, కందిరీగలాంటి సన్నని నడుము అని, మందగమని అని వర్ణనలతో ముంచెత్తారు. అంతేగాదు స్త్రీ శక్తి స్వరూపిణి అని, ఆదిశక్తి అని ఉన్నత పీఠం మీద కూర్చోబెట్టారు. ఎవరెన్ని రకాల పొగిడినా, తెగిడినా, ప్రశంసించిన అవన్ని మేడిపండు లాంటవే. రకరకాల సమస్యలకు గురవుతూనే ఉంది. కన్యాశుల్కం సమాజంలో ఉన్నప్పుడు బలయింది స్త్రీనే. నేడు వరకట్న పిశాచానికి గురవుతున్నదీ మహిళే. ఆకుచాటున దాగి ఉండే పిందెలాగా స్త్రీ తండ్రి, భర్త, కొడుకు చాటున అణగిమణగి ఉండాలనేవారు నేటికీ ఉన్నారు. అందుకే నిర్భయ అత్యాచార సమయంలో "ఆమె ఆ కామాంధుల కాళ్ళమీద పడి 'అన్నా' అని వేడుకోవలసిందని" ఒక సాధువుగారు సెలవిచ్చారు. మహిళ స్వంత ఆలోచనలు, భావాలు తీసుకునే స్వేచ్ఛ పురుషాధిక్య సమాజంలో లేదు. తండ్రి, భర్త, కొడుకు ఎవరూ ఈ విషయంలో మినహాయింపు కాదు. హైతీ అనే దేశంలో మహిళలు ఎంత నిక్కృష్టమైన దురాచారానికి గురవుతున్నారంటె యుక్తవయసు రాగానే యువతుల్లో లైంగిక ఇచ్ఛ కలుగకుండ ఉండుట కొరకు ఆమె జననాంగంలోని కొద్ది భాగాన్ని కత్తిరించి వేస్తారు. ఆ క్రియ శాస్త్రీయ పద్ధతుల్లో జరగదు. మన దగ్గర ఇంతకు ముందు నాటు మంత్రసానులు పురుడు పోసేవారు. అదేవిధంగా అశాస్త్రీయ పద్ధతిలో ఒక యువతి జననాంగాన్ని కత్తిరించే సమయంలో మూత్రకోశానికి సంబంధించిన భాగం కూడ తెగిపోయింది.

సంఘసంస్కర్తలు రాజారామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, పూలే దంపతులు, కార్వే మహాశయుడు, వీరేశలింగం పంతులు గారు, రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు మొదలగు వారు స్త్రీ విద్య కొరకు, స్త్రీల పట్ల ఉన్న అసాంఘిక దురాచారాలను రూపుమాపటానికి అనితరసాధ్యం కాని కృషిచేశారు. దాని ఫలితంగానే నేటి యువతులు, మహిళలు అన్ని రంగాలలోను పురుషులతోపాటు ధీటుగా అప్రతిహతంగా ముందుకు దూసుకు పోతున్నారు. అయినా ఆటంకాలు, అవరోధాలు, లైంగిక వేధింపులు కొన సాగుతూనే ఉన్నాయి. మహిళల్లో కూడ మార్పు రావాలి. స్త్రీకి స్త్రీయే శత్రువన్న దానిని పటాపంచలు చేయాలి. వంశోద్ధారకులయిన పుత్రులను కనలేదని, కట్నకానుకలు తాము కోరినంత తేలేదని బాధించటం, వేధించటం, చంపటం మానుకోవాలి. ఆడబిడ్డల లాంఛ నాలు సరిగా ముట్టలేదని మూతులు ముడుచుకుని ఎత్తిపొడవటం చేయకూడదు. తోటి స్త్రీలను అవహేళనగా, తక్కువగా, నీచంగా మాట్లాడటం మానివేయాలి. తప్పులను సరిదిద్దటం కొఱకైతే అర్థమ య్యేలా వివరించి చెప్పాలి. ప్రతిదానికి విమర్శించటం కూడా మంచిదికాదు. అసూయ ముందుపుట్టిన తర్వాత ఆడది పుట్టిందన్న సామెతను సార్థకం చేయకూడదు. అందచందాలలో, చదువు సంధ్యల్లో, ఆటపాటల్లో తన కంటె ఉన్నతంగా ఉన్నవారిని చూచి బాధపడే ఆత్మన్యూనతా భావం నుంచి బయటపడాలి. విద్యావం తులయిన యువతులు, మహిళలు సమస్యల్లో చిక్కుకుని బాధపడే స్త్రీలకు చేయూతనివ్వాలి. అంతేకాదు విద్యావంతులు, ధనాభారము లేనివారు, ఆ రెండూ లేనివారిని ఆదుకోవటానికి ముందుకు రావాలి. అశ్లీల చిత్రాలను, ప్రకటనలను, రాతలను ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో, మనోనిబ్బరంతో ఎదు ర్కోవాలి. ప్రతిఘటించాలి. సినిమాలలోను, బుల్లితెరపై, వ్యాపార ప్రకటనలకు అశ్లీలత కలిగిన ప్రదర్శనను చేయమని నిరాకరించాలి. అలా చేయగలిగిననాడే స్త్రీ తన వ్యక్తిత్వానికి వన్నెతేగలదు. నిలదొక్కుకోగలదు.

**– వేములపల్లి సత్యవతి**

# అభివృద్ధికి చిరునామా బొప్పాజీవాడి

నిజామాబాద్ జిల్లా కేంద్రం నుండి 55 కి.మీ. దూరంలో గల గాంధారి మండలంలో అదో చిన్నగ్రామం బొప్పాజీవాడ. బుర్గుల్ పంచాయతీ పరిధిలో గల ఈ గ్రామంలో సుమారు 36 కుటుంబాలు ఇక్కడే నివసిస్తాయి. ఈ యొక్క గ్రామం మారుమూల ప్రాంతంలో ఉ ఒడడం వలన గ్రామంలో అభివృద్ధి పనులు పురాతన వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమి సాగు చేయడం వలన పూర్తిగా గ్రామం వర్షాధారంపై ఆధారపడడం వలన వ్యవసాయ దిగుబడులు గ్రామానికి త్రాగునీరు సౌకర్యాలు లేనందువలన దుర్భలమైన జీవనాన్ని గ్రామస్థులు కొనసాగిస్తున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఈ గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడానికి 2012 సం॥రంలో రిలెయన్సు (Relience) ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణ రైతు సంఘం' గ్రామంలో ఏర్పాటు చేసుకొని ఆ యొక్క గ్రామంలో గల సమస్యలను అందరి సమన్వయంతో 'రిలయన్స్'వారి తోడ్పటుతో రైతుల జీవన విధానంలో పూర్తిగా మార్పు వచ్చింది. ఐక్యమత్యంతో వ్యవసాయంలో మార్పు తీసుకువచ్చారు.

**ఈ యొక్క గ్రామంలో చెరువులో పూడికతీత 2012లోనే జరిగింది**

గ్రామ సంఘం ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగా మట్టి తరలించడంతో రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గింది. గతంలో గ్రామంలో వివిధ పంటల కోసం ఒక సీజన్‌లో 3000 వరకు ఎరువు వాడితే ప్రస్తుతం ఒక లారీ ఎరువును వాడుతున్నారంటే చెరువు మట్టి యొక్క ప్రయోజనాన్ని ఎంతగా పొందరో అర్థం చేసుకోవచ్చు.

**త్రాగునీటి కోసం బావి నిర్మాణం**

గ్రామంలో త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఉండడం వలన ఈ సమయంలోనే రిలయన్స్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో రైతులు శ్రమదానంతో గ్రామ సమీపంలో గల వర్షాధారమైన చెరువులో బావి నిర్మాణం చేపట్టారు. మొత్తం రూ. 4,70,000 ఖర్చుతో సంఘం రైతులు 250 పనిదినాలు శ్రమించి 4,02,285 లీటర్ల సామర్థ్యం గల నీటి బావిని నిర్మించారు. బావి నిర్మాణం పూర్తి చేయడంతో గ్రామం వరకు నీటి గొట్టలతో త్రాగునీటిని మళ్లించుకుంటున్నారు. అంతేకాకుండా త్వరలోనే ఆర్.ఓ ప్లాంటు ఏర్పాటు చేసి మంచినీటిని ఇంటింటికి శుద్ధజలాన్ని అందించేలా జరుగుతుంది.

**కూరగాయల వనల సాగు**

పోషక వనాలను ఏర్పాటు చేసి పలు రకాల కూరగాయలను పండిస్తున్నారు. దీనితో సంఘం సభ్యులు వారంలో వేరు వేరు రకాల కూరగాయలతో ఆహారం తీసుకునే సౌలభ్యం ఏర్పడింది. పోషక వనల్లో సేంద్రియ ఎరువుల వాడకం, చెరువు మట్టి వినియోగించడంతో శు భ్రమైన కూరగాయలు లభించడంతో పాటు వాటి అమ్మకాల ద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్నారు. హరితహారంలో భాగంగా గ్రామానికి వెళ్లే దారిలో ఇంటి ఆవరణలో మొక్కలను నాటి వాటి సంరక్షణను గ్రామ కమిటీ బాధ్యత వహిస్తుంది.

**బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు**

గ్రామంలో 20 కుటుంబాలు బయోగ్యాస్ ప్లాంట్లు నిర్మించుకున్నారు. మిగిలిన కుటుంబాల వారు కూడా నిర్మించుకుంటున్నారు. వీటి ఏర్పాటుకు ఉపాధి, నెడ్ క్యాప్ వారు నిధులు సమకూర్చారు. లబ్ధిదారుడి వాటాకు సంబంధించి ఫౌండేషన్ వారు డబ్బును సమకూర్చడంతో అన్ని కుటుంబాలు ముందుకు వచ్చి బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని జిల్లాలోనే ఆదర్శంగా నిలువనున్నారు.

**గ్రామ సంఘం నిధి**

రిలయన్స్ సంస్థ వారు రైతుకు ఖర్చు చేసిన నిధులకు గాను రైతు 10% సొమ్మును గ్రామ సంఘంలో పొదుపు చేయాలి. దీనితో పాటు సంఘంలోని ప్రతి సభ్యుడు రూ.50 నెలవారిగా పొదుపు చేయాలి. ఇలా పొదుపు చేసిన మొత్తాన్ని గ్రామ సంఘం నిధిగా ఏర్పాటు చేసి దాని ద్వారా గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు వేగంగా చేపడుతారు.

గ్రామ రైతు సంఘంలో ప్రస్తుతం రూ.1,50,000 ఉండగా, మరో రూ.60,000 ఉత్పత్తిదారుల సంఘంలో భాగస్వామ్యం పెట్టుబడి పెట్టారు. మరియు సంఘం నిధి నుంచి రూ.70,000 ఖర్చుతో సంఘానికి తాత్కాలిక భవన నిర్మాణానికి మరియు ఆర్వో ప్లాంట్లు నిర్మాణానికి కొంత మొత్తంలో ఖర్చు చేశారు.

**గ్రామజ్యోతిలో భాగంగా**

గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం సహాయంతో అందిస్తున్న 12,000 (పన్నెండు వేల రూ॥) మరుగుదొడ్ల నిర్మాణాన్ని 100% నిర్మించుకోవడానికి గ్రామ సంఘంలో గల మిగులు నిధులతో గ్రామంలో పూర్తిగా మరుగుదొడ్లను నిర్మించి వాడుకునే అవగాహన కల్పించడం మరియు నీటి వృధాను అరికట్టి పర్యావరణ పరిశుభ్రతకు, మరియు గ్రామాభివృద్ధికి, గ్రామంలోని ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతున్నారు. మరియు గ్రామంలో అందరికి విద్యలో భాగంగా సాక్షరభారత్ సెంటర్లను మరియు బడి మానివేసిన పిల్లల గురించి ప్రత్యేక శ్రద్ధ వహించి నూతన పాఠశాల భవన నిర్మాణానికి

**సమగ్ర సమాచారం**

| | | |
|---|---|---|
| గ్రామం | : | బొప్పాజీవాడి |
| రైతు సంఘం పేరు | : | శ్రీ కృష్ణగ్రామరైతు సంఘం |
| ప్రారంభం | : | 18-04-2012 |
| భాగస్వామ్య రైతు కుటుంబాలు | : | 28 |
| భాగస్వామ్య సభ్యులు | : | 56 |
| వ్యవసాయం | : | 131 హెక్టార్లు |

| | | |
|---|---|---|
| తవ్వించిన ఇంకుడు గుంతలు | : | 04 |
| బయోగ్యాస్ యూనిట్లు | : | 20 |
| పండించే పంటలు | : | సోయా, పెసర, మినుము, కంది, మొక్కజొన్న, జొన్న |
| చెరువు మట్టి తరలింపు | : | 4500 మెట్రిక్ టన్నులు |
| పోషక వనాలు | : | 28 |
| రిలయన్స్ ఫౌండేషన్ చేసిన ఖర్చు | : | 48,15,725 రూ. |

గ్రామాలు వంద శాతం అభివృద్ధి సాధించాలి

గ్రామాలు అన్ని రంగాల్లో వందశాతం అభివృద్ధి సాధిస్తే నిర్మల్ పురస్కారాలను అందజేస్తామని గ్రామజ్యోతి జిల్లా శిక్షణ మేనేజర్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం బీర్కూర్‌లో నిర్వహిస్తున్న గ్రామజ్యోతి శిక్షణ తరగతుల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలోని గంగాదేవిపల్లి గ్రామంగా తెలంగాణలోని అన్ని గ్రామాలను తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో సీఎం కేసీఆర్ గ్రామజ్యోతి పథకాన్ని ప్రవేశపెట్టి కమిటీ సభ్యులకు ఏడు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 718 పంచాయతీలలో మొదటి విడతలో 19 మండలాలు, రెండో విడతలో ప్రస్తుతం 17 మండలాల్లో 1052 మంది గ్రామజ్యోతి కమిటీ ఛైర్మన్లు, కన్వీనర్లకు త్రాగునీరు, ఆరోగ్యం, విద్య, పేదరిక నిర్మూలన, సహజ వనరులు, వ్యవసాయం మౌలిక వసతులు అంశాలపై 40 మంది టిఓటీలచే శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామం అన్ని రంగాల్లో వంద శాతం అభివృద్ధి సాధిస్తేనే బాగుంటుందన్నారు. గ్రామాలన్నింటిని పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

**డి.అశోక్, జిల్లా శిక్షణా మేనేజర్, నిజామాబాద్**

# ముస్సోరి ఐ.ఏ.ఎస్. అకాడమీలో ప్రసంగించిన మహిళా సర్పంచ్



**ఆ**మె మన తెలుగు ప్రాంతాల్లోని ఓ మారుమూల పల్లెకు సర్పంచి. చదివింది మూడో తరగతే. కాని శిక్షణ ఐఏఎస్‌లకు గ్రామీణాభివృద్ధిని వివరించేంతగా ఎదిగారు ! ఇందుకోసమే ఇటీవల ఉత్తరఖండ్‌లోని ముస్సోరి ఐఏఎస్ అకాడమీకి వెళ్లివచ్చారు. ఇంతకీ ఆమె ఏం సాధించారు? తెలంగాణలోని సిద్ధిపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామం అది. రెండు సమస్యలు అక్కడ చాలా తీవ్రంగా ఉండేవి. ఒకటి... భూజల మట్టం చాలా తక్కువగా ఉండటం. రెండు ప్రజలు ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు రాకుండా బహిర్భూమికే పరిమితం కావడం. కుంబాల లక్ష్మీయాదమ్మ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యాక ఆ రెండు విషయాలపై దృష్టి పెట్టారు. ముందుగా బహిర్భూమి అలవాటు వల్ల వచ్చే తీవ్ర అనారోగ్యాలూ, వ్యక్తిగత మరుగుదొడ్డితో వచ్చే లాభాలపై విస్తృత ప్రచారం మొదలుపెట్టారు. కొన్ని నెలల్లోనే ఇబ్రహీంపూర్‌ని వందశాతం మరుగుదొడ్లున్న గ్రామంగా నిలిపారు! గ్రామానికి నిర్మల్ గ్రామ పురస్కారాన్నీ సాధించిపెట్టారు. నిరుడు జిల్లా అధికారులతో కలిసి మహారాష్ట్రలోని తుంబుర్ని గ్రామానికి వెళ్లిన ఆమె... అక్కడి జలసంరక్షణ విధానాలని పరిశీలించారు. గ్రామంలో ప్రయోగాత్మకంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి పిలుపునిచ్చారు. ఇందులోనూ వందశాతం నిర్మాణం పూర్తి చేయడంతో దేశవ్యాప్తంగా ఈ గ్రామానికి గుర్తింపొచ్చింది. ఈ విజయాల కారణంగానే ఆమెకు ముస్సోరిలోని ఐఏఎస్ అకాడమీ నుంచి పిలుపొచ్చింది.

ఏం మాట్లాడారంటే...

శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారుల కోసం 'అధికార వికేంద్రీకరణ-జయాపజయాలు' అంశంపై నిర్వహించిన సదస్సు అది. అక్కడ ఇబ్రహీంపూర్‌లో తాము సాధించిన విజయాలనీ, ఎదుర్కొన్న సవాళ్లనీ ఆమె వివరించారు. వాళ్లడిగిన ఎన్నో ప్రశ్నలకీ జవాబిచ్చారు. 'పంచాయతీలకి నిధులు చాలా తక్కువగా ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న తీరు వివరించా. గ్రామా పాలనలో ఎదురవుతున్న ఇబ్బందులూ పంచుకున్నా. ఇతరత్రా విషయాలనూ వారితో పంచుకున్నా. ఇతరత్రా విషయాలనూ వారితో పంచుకున్నా. ఒక్క గ్రామమే కాదు ఎక్కడైనా సరే సమిష్టి కృషితోనే విజయాలు సాధించవచ్చని చెప్పా'... అంటున్నారు లక్ష్మీ యాదమ్మ. అయితే, మొదట్లో... ఐఏఎస్‌ల సమక్షంలో తన గ్రామాభివృద్ధి గురించి మాట్లాడే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందం కలిగినా... ముందుగా కొద్దిగా భయమేసిందని ఆమె చెప్పారు. అంతదూరం వెళ్లాల్సి రావడంతోపాటు భాషా సమస్య కూడా తోడవడంతో ఏం చేయాలో తోచలేదట. అయితే, అధికారులు తామున్నామని అభయమివ్వడంతో వారి ప్రోత్సాహంతో అక్కడివరకు వెళ్లి అందరినీ మెప్పించేలా మాట్లాడగలిగినట్లు చెప్పారామె.

**- వార్తాంశం**

# స్త్రీ శక్తి



స్త్రీలు వేదాలు చదువరాదు నలుగురిలో స్వేచ్ఛగా తిరగరాదు. పరదల చాటున వుండాలి. ఇలా ఎన్నో ఆంక్షలు ఒకనాడు ఉండేవి.

కానీ నేడు వారు స్పృషించని రంగంలేదు. అధిరోహించని శిఖరం లేదు. హిమాలయాలను సైతం అధిరోహించి మేమెవరికి తీసిపోమని నిరూపించుకొన్నారు. ఆకాశంలో మేము సగ భాగమంటున్నారు.

అమ్మమ్మ, నానమ్మగా, అమ్మగా సోదరిగా, భార్యగా పురుషులకు అన్ని తానై ఆదుకునే అనురాగ దేవతగా స్త్రీమూర్తి. కాని ఆ దేవతలకు ఆధునిక సమాజంలో విలువెంత? స్త్రీలు సమానంగా గౌరవించబడిన చోట దేవతలుంటారని, స్వేచ్ఛగా అర్ధరాత్రి బయటికి వెళ్ళి క్షేమంగా తిరిగి వచ్చిన నాడే అది నిజమైన స్వాతంత్ర్య వ్యవస్థ అని పెద్దలు సెలవిచ్చిన సంగతి మనందరికీ తెలుసు. కానీ ఆ పెద్దల ఆలోచనల కనుగుణంగా నేటి సమాజం వుందా అని మనం ప్రశ్నించుకోవాల్సిన అవసరం వుంది.

అయితే స్త్రీలపై హత్యలు, మానబంగాలు, వరకట్న చావులు, గర్భస్థ ఆడ శిశు హత్యలు మొదలగు హింసలు ఎందుకు జరుగుతున్నాయి. మనం పురుష అధిక్యత వ్యవస్థలో వున్నాం కనుకనా? కాకపోతే మరేమిటి? ఒప్పుకోవడానికి అహం అడ్డొస్తుంది. మలినమైన మనసు తెరలను తొలగించి ఒక్కసారి ఆలోచించండి! ఇప్పటికైనా కల్మషం లేని మనసుతో దాపరికం లేని హృదయంతో ఆలోచించండి ఇంకా ఒప్పుకోవడానికి ఏదైనా అడ్డొస్తే అంతరాత్మను అడగండి ఎందుకంటే అంతరాత్మ ఎప్పుడు నిజమే చెబుతుంది.

స్త్రీ పాత్ర లేని కావ్యం పరిపూర్ణం కాదు. స్త్రీ లేని కుటుంబం కుటుంబమే కాదు. ఇక స్త్రీ లేని ప్రపంచాన్ని అసలు ఊహించడమే మూర్ఖత్వం. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన స్త్రీలకు సుముచిత గౌరవం, స్థానం దక్కుతున్నాయా? అలా జరిగితే మహిళా కమిషన్లు, హక్కుల కమిటీలు, రిజర్వేషన్లు, పోరాటాలు మహిళా దినోత్సవాలు ఎందుకు? లోతుగా ఆలోచిస్తే స్త్రీలకు సముచిత గౌరవం హక్కులు లభించడం లేదని ఒప్పుకోకతప్పదు.

నిరాదారణకు లోనైన వారు అన్యాయానికి గురవుతున్న వారిలో ఐక్యత ఎక్కువగా వుండాలి. నేటి సమాజంలో స్త్రీలలో ఐక్యత వున్నదా? తల్లి, కూతుళ్ళ మధ్యన వున్న సంయమనం ఇద్దరు పరాయి స్త్రీల మధ్యన వుంటున్నదా? బంధుత్వం కోణం నుండి కాక ఒక స్త్రీ వేరొక స్త్రీకి సహాయం చేస్తున్నదా? అండగా నిస్సహాయ స్త్రీ కించబడుతురశ్రీన్నదా?

అయితే ముప్పయి జట్లు కలిసి వుంటాయి కాని మూడు సిగలు కలిసి వుండలేవు. అన్న సామెత ఎందుకొచ్చింది. ఇవి పురుషస్వామ్యలోకం కనుక వచ్చిందనుకుంటే వదిలేయండి కాదు. ఇందులో కొంత వాస్తవం వుందనుకుంటే ఆలోచించండి! అపవాదును నివారించడానికి ప్రయత్నించండి. ఐక్యంగా ముందుకు సాగండి! అనుకున్నది సాధించండి.

పురుషులు కూడా చేతనైనంత సహాయమందించి ప్రోత్సహించి స్త్రీలను సమానంగా చూడాలి. బండికి కట్టిన జోడెద్దుల వలె సంసారనావను సాగనివ్వాలి. అప్పుడే సమన్వయం జరుగుతుంది. సమానత్వం సమకూరుతుంది. సమస్యలు అంతరిస్తాయి. ప్రగతిలో ప్రయాణించే ప్రపంచమేర్పడుతుంది.

– కుసుమ మాధురి
సెంటర్ హెడ్ , సిడబ్ల్యుసిడి, టిసిపార్డ్.

# సమాజంలో స్త్రీకి మహోన్నత స్థానం

'స్త్రీ' అనే పదానికి సకరా, తుకార, రకాలు గలవు. సకారం సత్త్వగుణానికి ప్రతీక. తుకారము తమోగుణమునకు, రకారము రజోగుణమునకు ప్రతీకలు. అనగా స్త్రీ త్రిగుణాత్మకమగు ప్రకృతికి ప్రతీక. సర్వమానవాళి పుట్టుటకు వృద్ధి చెంది వికాసం నొందుటకు వినాశనమునకు స్త్రీయే కారణం. కాబట్టే స్త్రీ వికాసం, ఆనందం కలిగించే సత్త్వగుణ సమన్వితురాలయి వర్థిల్లాలి. అప్పుడామె పరమాత్మ దర్శనం పొంది ఇతరులకు పరమాత్మ దర్శనం కలిగింప గలుగుతుంది' (స్త్రీ ధర్మాపుట 56) అంటారు శ్రీమతి విశాలక్షి.

ఆ పరమేశ్వరుడే స్త్రీ ప్రాముఖ్యతను గుర్తించి ఆమెకు సృష్టికార్యంలో ఉన్నతమైన బాధ్యతను అప్పగించాడు. అందువలన వైదిక సమాజంలో స్త్రీ స్థానం మహోన్నతంగా ఉండేదని వేదాలు తెలుపుతున్నాయి. ఆ కాలంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే. కావుననే నాటి సమాజం స్త్రీకి ఉన్నత స్థానానిచ్చి గౌరవించిన తీరు మనకు తెలియజేస్తుంది. స్త్రీ బ్రహ్మ చతుర్వేజ్ఞ, ఋత్విజురాలు, గృహస్తరూప యజ్ఞంలో స్త్రీ బ్రహ్మ కావలెను.

**'స్త్రీ హి బ్రహ్మ బభూవిథ'**

సృష్టికర్తయైన భగవానుడు తన తదనంతరం సృష్టి కార్యాన్ని నిర్వహించే బాధ్యతను స్త్రీకి అప్పగించటం ద్వారా తన తర్వాత స్థానం స్త్రీకి ఇచ్చి గౌరవించాడు.

**'పురంధిర్ యోషా'**

ఒక ఆదర్శ దేశంలో స్త్రీ పాత్ర బహుముఖ ప్రజ్ఞావంతురాలు. 'అహం కేతురహం మూర్ధాహముగ్రా వివాచన్నీ' క్షత్రియాసి యజ్ఞయాసి అదితి రసి ఉభయత:శీర్షి'

అంతేకాక స్త్రీ నిరంతర చైతన్యతరంగం వంటిది. అందుకే ఋగ్వేదంలో 'చిదసి మనాసి ధీరసి దక్షినాసి క్షత్రియాసి యజ్ఞయాసి అధితి రసి ఉభయత: శీర్షి'

స్త్రీ చేతనమయి, మననశీల, బుద్ధిమతి, దక్షురాలు; క్షత్రియురాలు ; యజ్ఞాధికారి, అవినాశి, లజబ్యు దయని; శ్రేయసశీల ఆమె వాణి, విద్యుత్తు, స్త్రీని వేదం జాతీయపతాకంతో సమానంగా పోల్చి మహోన్నత స్థానాన్నిచ్చింది. వివిధ శాస్త్ర చన్నలు చేసేదిగా వర్ణించింది.

**'యజ్ఞ దధే సరస్వతీ'**

సాంగోపాంగంగా వేదాలను అధ్యయనం చేసిన స్త్రీ వేదమంత్రాలతో యజ్ఞకారాన్ని నిర్వహిస్తోంది. అదే విధంగా ఋషులు, ఆచార్యులు మానవ సమాజంలో స్త్రీ పాత్ర విశిష్టతను తెలియజేశారు.

**'ఋషయో మంత్రద్రష్టార:**

సమాధి అవస్థలో వేద మంత్రార్థాలను గ్రహించిన ఋషుల



వలె అనేక మంది స్త్రీ ఋషికాలుగా కూడా ఉన్నారు. ఋగ్వేదంలోని దశమ మండలంలో అనేక సూక్తాలను వీరు దర్శించారు. అత్రి మహర్షి కూతురు అపాల, కక్షవంతుని కుమార్తె కాక్షిపతి ఘోష, అదిలి, దాక్షాయినీ, ఇంద్రాణీ, ఊర్వశీ, వాగాభృణీ, విశ్వవారా, లోపాముద్రా, మున్నగు స్త్రీలెందరో వేద మంత్రార్థాలను దర్శించారు. గార్గి, మైత్రేయి వంటి స్త్రీలు పురుషులతో సమానంగా సభలలో శాస్త్రార్థాలు చేసిన బ్రహ్మవాదినులు.

**'ద్వివిధా: స్త్రియం:బ్రహ్మ వాదివ్య: సద్యోవధ్వశ్చ**

ప్రాచీనవైదిక యుగంలో బ్రహ్మవాదినులు, వధువులు అని స్త్రీలు రెండు రకాలుగా ఉండేవారని మహర్షి హారీతుడు పేర్కొన్నాడు. బ్రహ్మవాదినులు ఉపనయనాదులు చేసుకుని గురుకులాలలో వేదాధ్యయనం చేసి స్త్రీల గురుకులాలు నడిపేవారు. వేద ప్రచారం చేసేవారు. రెండవవారు వధువులు-ఉపనయనం చేసుకొని తరువాత వివాహం చేసుకొని పురుషార్థాలను సాధించేవారు.

**'న శూద్ర సమా: స్త్రీయ: నహి శూద్రయోనౌ బ్రహ్మణ క్షత్రియ వైశ్యా: జాయంతే!'**

స్త్రీలలో శూద్రలుండరు, ఎందుకంటే శూద్రులకు బ్రహ్మణ క్షత్రియ వైశ్యులు జన్మించరు. స్త్రీలకు కూడా యజ్ఞోపవీత ధారణ సంస్కారంగా ఉండేది. 'బ్రహ్మసూత్రేణ పవిత్రీకృత కాయామ్' బ్రహ్మసూత్రం అంటే యజ్ఞోపవీత ధారణతో శరీరం పవిత్రమైనది. కన్యలకు వేదాధ్యనం చేసే అధికారం ఉంది.

**'బ్రహ్మచర్యేణ కన్యా యువానం కిందతే పతిమ్'**

**'ఇమం మంత్రం పత్నీ పఠేత్'**

'స్త్రీ హి బ్రహ్మ బభూవిథ' అనే వాక్యాలు ప్రాచీన కాలంలో స్త్రీలు వేదాధ్యయనం చేస్తుండేవారని తెలియజేస్తున్నాయి. స్వామి దయానంద సరస్వతి సత్యార్థ ప్రకాశంలో 'నారీ సత్కారమనే' శీర్షికన మనుస్మృతిలోని శ్లోకాలను రాశారు.

# అంతరిక్షంలో భారత మహిళలు





**ఆకాశంలో ఉన్న నక్షత్రాలను చూస్తుంటే మనం భూమి నుండి కాదు సౌర కుటుంబం నుండి వచ్చామేమో అనిపిస్తుంది**

**అం**తరిక్షంలో ప్రవేశించిన మొట్ట మొదట భారతీయ మహిళ కల్పనా చావ్లా. ఈమె 1962లో హర్యానా రాష్ట్రంలోని కర్నాల్ అనే గ్రామంలో జన్మించారు. చిన్నప్పుడు చదువులో సాధారణ విద్యార్థిని గానే ఉండేది. విమానాలంటే విపరీతమైన మోజు ఉండేది. గగనతలంలో పక్షిలా ఎగరాలనే కలలు కనేది. అదే కోరిక ఆమె పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదివేలా చేసింది. ఈ విభాగంలో ఆమె ఏకైక మహిళా విద్యార్థినిగా వుండి అన్ని పరీక్షల్లో ప్రథమస్థానం సాధించింది. తర్వాత 1988లో అమెరికా వెళ్లి అక్కడి కొలరాడో విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పూర్తి చేశారు. ఆ తర్వాత 1994లో నాసాలో వ్యోమగామిగా చేరి తన కలలను సాకారం చేసుకొన్నారు. 1997 నవంబర్‌లో మొదటిసారిగా తన అంతరిక్ష యాత్ర STS 87 అనే నౌకలో 16 రోజులపాటు 10.4 మిలియన్ కి.మి ప్రమాణం చేసి 252 ఆర్బిట్‌లలో 80కి పైగా పరిశోధనలు చేసి తొలి అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించారు.

రెండో అంతరిక్ష యాత్ర 2003 జనవరి 16లో 107 నౌకలో మరో ఆరుగురితో కలిసి ప్రయాణం చేశారు. అక్కడ పరిశోధనలు చేసి 2003 ఫిబ్రవరి 1 న తిరుగు ప్రయాణమయ్యారు కానీ దురదృష్టవశాత్తు ఇంకా కొద్ది నిమిషాల్లో భూమి పైకి దిగుతుందనగా వారు ప్రయాణిస్తున్న నౌక ప్రమాదానికి గురయ్యి అందరూ మరణించారు. ఈ వార్తతో ప్రపంచమంతా షాక్‌కి గురయ్యారు.

అప్పటి భారత ప్రధాని శ్రీ. వాజ్‌పేయి గారు ఒక భారత ఉపగ్రహానికి కల్పన –1 అని పేరు పెట్టారు. ఇప్పటికీ హర్యానా ప్రభుత్వం ఆమె పేరిట చదువులో ప్రతిభ కనపరిచిన బాలికలకు నగదు ప్రోత్సహకాలు అందచేస్తున్నారు.

తన చిన్ననాటి కోరికలను నిజం చేసుకొని ఆమె ఉన్నత శిఖరాలు అందుకునే క్రమంలో చిన్నతనంలోనే అందరాని లోకాలకు వెళ్లిపోవడం చాలా శోచనీయం.

**అంతరిక్షం నా ఆటస్థలం : సునితా విలియమ్స్**

**సు**నితా ఎల్. విలియమ్స్ 1965 సెప్టెంబర్ 19 లో జన్మించింది. అమెరికాలో పుట్టి పెరిగినా, చిన్నతనం నుండి ఆమెకు గాంధీజీ మరియు మదర్ థెరిస్సా లాంటి గొప్ప వ్యక్తుల గురించి,భారత దేశ సంప్రదాయాల గురించి కూడా ఆమె తల్లితండ్రులు బోధించారు. చిన్నతనం నుండి చదువులో చురుకుగా వుంటు ఉన్నత చదువులు చదివి 1987 అమెరికన్ నావికాదళంలో చేరింది. 1995లో వర్జీనియాలో పైలట్‌గా చేరింది. 3000 గంటలు పైగా 30 ఎయిర్ క్రాఫ్టలకు పైలట్‌గా పని చేసింది. ఈ క్రమంలో నాసా వారు 1998లో ఆమెను వ్యోమగామి శాస్త్రవేత్తగా ఎంపిక చేశారు. 2000 సంవత్సరంలో తొలిసారిగా అంతరిక్ష యాత్ర చేపట్టి ఆ తరువాత ఎన్నో యాత్రలను పూర్తిచేసుకుంది. 322 రోజులు అంతరిక్షంలో గడిపిన రెండో మహిళా వ్యోమగామిగా చరిత్ర కెక్కింది. అమెరికా ఎండ్యూరెన్స్ లిస్ట్‌లో 6 వస్థానంలో ఉంది. ఆమె అంతరిక్షంలో ఉన్నప్పుడు ఎవరు ఎక్కువగా గుర్తుకు వస్తారని అడిగితే తన పెంపుడు కుక్క బైలితో బీచ్‌లో గడిపిన రోజులని చెప్తుంది. ఇలా అంటే తన భర్తకు కొద్దిగా కోపం వస్తుందని అతను తనకు అన్ని విషయాల్లో చాలా సహకరిస్తాడని తెలిపింది. అంతరిక్షంలో నుండి చూస్తే భూమి ఎంతో అందంగా నీలి రంగు సముద్రాలతో మారుతున్న రంగు రంగుల కదిలికలతో చాలా అద్భుతంగా ఉంటుందని చెప్పింది అవి తన జీవితంలో మధురమైన క్షణాలుగా పేర్కొంది. అంతరిక్షంలో ఎన్ని రోజులు గడిపినా ఎప్పుడూ విసుగురాలేదని తనతోపాటు భగవద్గీత, వినాయక ప్రతిమను తీసుకెళ్ళానని తెలిపింది. తనకు ఆధ్యాత్మిక భావనలు ఎక్కువని భారత సంప్రాదాయాలంటే మక్కువని తెలిపింది. అంతరిక్షంలో గోళ్ళు, వెంట్రుకలు తొందరగా పెరుగుతాయాని తన ముఖం పై ముడతలు పోయాయని చెప్పింది. సునితకు హిమాలయాల్లో పర్వతారోహణ మరియు దక్షిణ భారత యాత్రలంటే ఇష్టం నాసా నుండి రిటైరయ్యాక సైన్స్ టీచర్‌గా స్థిర పడతానని చెప్పింది. సునితా విలియమ్స్ ఇంకా ఎన్నో అంతరిక్ష యాత్రలు శాస్త్రీయ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తూ మొదటి స్థానంలోకి వెళ్లాలని ఆశిద్దాం.

**కె.విద్యుల్లత, ట్రైనింగ్ ఆఫీసర్ సి.డబ్ల్యు.ఎస్., టిసిపార్డ్**



# బడ్జెట్‌లో గ్రామీణ, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం

సంప్రదాయ బద్ధంగా భారతదేశ సాధారణ బడ్జెట్‌ను ఆర్థికమంత్రి అరుణ్‌జెట్లీ ఫిబ్రవరి 29 తేదీ ఉదయం 11 గంటలకు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ విలువ 19.78 లక్షల కోట్లు. ఇందులో ప్రణాళికా వ్యయం 5.5 లక్షల కోట్లు. ప్రణాళికేతర వ్యయం 14.28 లక్షల కోట్లు. ఏడవ వేతన సంఘ సిఫార్సులను, ఒకే ర్యాంకు ఒకే పెన్షన్ విధానాన్ని అమలు పరచనున్నందున కేంద్ర ప్రభుత్వం ఖర్చు భారీగా పెరుగనుంది. ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నట్లు ప్రభుత్వ ధనం ప్రజల ధనం. దీన్ని ప్రజలే పన్నుల రూపంలో చెల్లిస్తారు అందుకే బడ్జెట్ ప్రజలకు మేలు చేసేదిగా ఉండాలి. భారత సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు బడ్జెట్‌లో తమకు కావలసిన రాయితీలు, లాభాలు రావాలనుకుంటారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను తీర్చడానికి ఆర్థిక మంత్రి దగ్గర మంత్రదండం ఉండదు. ఈనాడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటుంది. అమెరికా, జపాన్, చైనా, యూరోపియన్ దేశాలు సైతం ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దీని ప్రభావం అనివార్యంగా భారత ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది. ఈ క్లిష్ట సమయంలో బడ్జెట్‌ను తయారు చేయడం కత్తి మీద సాము చేయడం లాంటిది.

భారతదేశం సాంప్రదాయకంగా వ్యవసాయక దేశం, ఈనాటికి సుమారు డెబ్బై శాతం మంది వ్యవసాయ, వ్యవసాయనుబంధ పరిశ్రమలపై ఆధారపడి తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వరుస కరువులతో భారతీయ రైతు అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటు కొన్ని సందర్భాలలో ఆత్మహత్యలకు కూడా పాలుపడుతున్నాడు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతను ప్రభుత్వం ఆదుకోవాలి. వ్యవసాయరంగ అభివృద్ధికి అవసరమైన చర్యలు గైకొనాలి.

2016-17వ కేంద్ర వార్షిక బడ్జెట్‌లో రైతు అభివృద్ధికి, వ్యవసాయ రంగానికి కొంతమేర ప్రాముఖ్యం కల్పించారు. రైతుల ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉండడం వలన దానిని 2022లోపు మెరుగు పరచనున్నట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. వ్యవసాయానికి మూలం సాగునీరు వరుసగా రెండు సంవత్సరాలు కరువు రావడంతో పంటలు పండలేదు. భారతదేశంలో చాలా గ్రామాలలో సరియైన సాగునీటి సౌకర్యం లేదు. రైతులు వ్యవసాయం కోసం బోరింగ్‌లపై ఆధారపడుతున్నారు. భూగర్భ జలాలు అంతరించిపోతున్నాయి. భూగర్భ జలాల అభివృద్ధి కోసం చెరువులను, చెక్‌డ్యామ్‌లను సంరక్షించాలి. 2016-17 వార్షిక బడ్జెట్‌లో అంతరిస్తున్న

భూగర్భజలాల అభివృద్ధి కోసం అరవై వేల కోట్లు రూపాయలను కేటాయించారు. సాగునీటి అభివృద్ధి కోసం నాబార్డు కృషి చేస్తోంది. ఇందుకోసం నాబార్డుకు 20 వేల కోట్లు రూపాయలు కేటాయించారు. ఇంతేకాక సాగునీటి సౌకర్యం కల్పించడం కోసం మరో పదిహేడు వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ఇది సాకారాత్మక నిర్ణయం. అన్ని వ్యవసాయ భూములలో అన్ని పంటలు పండవు. ఏ భూమిలో ఏ పంట పండుతుందో తెలుసుకోవడానికి భూసార పరీక్షలను నిర్వహించాలి. భూసారంలోని లోట్లను తొలగించాలి. భూసారాన్ని అభివృద్ధి చేయాలి. 2016-17 వార్షిక బడ్జెట్‌లో భూసార అభివృద్ధి కోసం 268 కోట్ల రూపాయలు కేటాయించారు. అతివృష్టి, అనావృష్టి, చీడపురుగుల బాధ వంటి సమస్యలతో రైతులు పంటను నష్టపోతుంటారు. ఇటువంటి సమయంలో వారికి బీమా సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతుల బీమాకోసం ఈ సంవత్సరం బడ్జెట్‌లో 5500 కోట్ల రూపాయలు కేటాయించారు. భారతీయ రైతుకు సంవత్సరం పొడుగునా పని ఉండదు. ఈ కారణంగా ఎక్కువ మంది రైతులు వ్యవసాయంతోపాటు అనుబంధంగా పాడి ఆవులను, బర్లను పోషిస్తారు. పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో 850 కోట్ల రూపాయలు కేటాయించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగమవుతున్నాయని, ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయాలన్న అభిప్రాయం ఉంది. చిన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఈ పథకం ఎంతో కొంత మేలు చేసింది. 2016-17 వార్షిక బడ్జెట్‌లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు కోసం 38,500 కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రస్తుతం దేశంలోని అన్ని ప్రాంతాలలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొని ఉన్నందు వలన ఈ కేటాయింపులను ఇంకా పెంచాల్సి ఉండాల్సింది. ఈ రోజుకు దేశంలోని అనేక గ్రామాలలో రైతులకు అవసరమైన రుణ సౌకర్యం లేదు. ఇంకా చాలా మంది రైతులు గ్రామీణ ప్రాంతాలలోని వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాలలో చిక్కుకొని కష్టపడుతున్నారు. ప్రభుత్వం సరియైన సమయంలో రైతులకు అప్పు లభించేటట్లు చర్యలు గైకొనాలి. ఈ సంవత్సరం రైతులు కిచ్చే రుణాల లక్ష్యాన్ని తొమ్మిది లక్షల కోట్లుగా నిర్ణయించారు. బడ్జెట్‌లో మనం ఈనాడు పప్పుధాన్యాల కొరతను ఎదుర్కొంటున్నాము. పప్పు




ధాన్యాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పప్పుధాన్యాల పంటను ప్రోత్సహించడం కోసం బడ్జెట్‌లో 500 కోట్ల రూపాయలను కేటాయించారు. మన ఆరోగ్యానికి అర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు తోడ్పడతాయి. చాలా మంది అర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తుల పట్ల మక్కువను చూపుతున్నారు. ఐదు లక్షల ఎకరాలలో అర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. గ్రామీణులు ఇంకా దేశంలోని అనేక మారుమూల గ్రామాలలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిజమైన భారతదేశం గ్రామాలలోనే ఉందన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణాభివృద్ధి కోసం 2.97 లక్షల కోట్లు కేటాయించారు. మనదేశంలో ఇంకా కొన్ని గ్రామాలలో విద్యుదీకరణ జరుగలేదు. 2018 మే ఒకటో తేదీ నాటికి అన్ని గ్రామాలను విద్యుదీకరణ చేస్తారని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇది జరగాలని జరుగుతుందని ఆశిద్దాం. ఇంకా అనేక గ్రామాలలో సరియైన రోడ్లు సౌకర్యం లేక గ్రామీణులు, రైతులు కష్టపడుతున్నారు. ఈ సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో గ్రామీణ రోడ్ల నిర్మాణం కోసం 19 వేల కోట్ల రూపాయలు వెచ్చించనున్నారు.

భారతదేశాభివృద్ధికి పారిశ్రామికాభివృద్ధి ఎంతో ముఖ్యమో గ్రామీణ, వ్యవసాయరంగ అభివృద్ధి కూడా అంతే ముఖ్యం. దురదుష్టవశాత్తు గ్రామాలలో కనీస వసతులు కరువై, వ్యవసాయం భారమై గ్రామీణులు నగరాల బాట పట్టి, నగరాల సమస్యలను పెంచడమే కాక వారు సమస్యల పాలవుతున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలి.

**డా॥పి.మోహన్‌రావు ,రెడ్డి డిగ్రీ కళాశాల, సికింద్రాబాద్**

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ (టీఎస్ఏ) ఆధ్వర్యంలో సచివాలయంలో ముందస్తు వేడుకలు నిర్వహించి వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా స్మితా సబర్వాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు కూడా ఉన్నతస్థాయి చదువులు అభ్యసించేలా చూడవలసిన బాధ్యత అందరిపై వున్నదని అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను అందజేశారు. రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి అనితా రాజేంద్ర మాట్లాడుతూ రక్షణ రంగంలోనూ మహిళలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారంటు తెలుగు యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మాదిరెడ్డి అండమ్మ మాట్లాడుతూ రాణి రుద్రమ్మ వంటి వీర వనితల గురించి తెలిపారు.

సీఎం కార్యాలయం ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్, టీవీ యాంకర్లు రమ్యక్రిష్ణ, ఎస్. స్వేచ్ఛ, సెక్రటేరియట్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు నేతి మంగమ్మ, కార్యదర్శి ఎం. సుజాత, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. సరస్వతి ఈసీ సభ్యులు ఎం. పావని, బీ. మంజులారెడ్డి, పి. జ్యోతి విజయ నళిని, ఎం. జయలలిత తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు వెలుగొందాలి

**కొక్కెర కృష్ణయ్య, కాక సారయ్య సెలబ్రిటీలు కాదు. పాలకులు అంతకన్నా కాదు రెండేళ్ల వారిని ఎవరూ పట్టించుకోరు. కానీ వారి ఆజ్ఞకోసం ఎదురుచూస్తారు. మనుషులు దేవతలుగా మారడం ప్రపంచంలో మీరెక్కడైనా చూశారా? అసలు మనుషులు దేవతలుగా మారడం ఏమిటా? అని అశ్చర్యపోనక్కర్లేదు..**

నిజంగా వాళ్లు దేవతలే. ఆదివాసీ ఆరాధ్యదైవాలతో వారు సంభాషిస్తారు. ప్రకృతిలోకి పరకాయ ప్రవేశం చేసి ప్రపంచ ప్రతినిధులుగా విశ్వజనావళి శ్రేయస్సు కోసం దైవంతో మాట్లాడుతారు. ఈ లోకాన్ని చల్లంగా చూడమని వేడుకుంటారు.రెండేళ్ల అతి సాధారణ మనుషులుగా జీవనాన్ని కొనసాగిస్తూ నాలుగు రోజులు మహాశక్తి స్వరూపులుగా మారిపోతారు. అవును నిజమే. మీరు మేడారం వస్తే తెలుస్తుంది. దైవాలను నడిపించే దేవతలుగా ఆదివాసీలనే కాదు సమస్త జీవకోటిని కాపాడమని ప్రణమిల్లుతారు. తల్లీ మిమ్ములను చేరుకునే వరం మాకిచ్చావు. మా జాతిని కాపాడమని ప్రాథేయపడతారు. వాళ్లు చెప్పినట్లే దేవతలు వింటారు. దేవతలు చెప్పినట్లే వాళ్లు నడుచుకుంటారు. లోకాన్ని నడిపంచమని వేడుకుంటారు. ఇది మేడారం సందర్భం. పరమ పవిత్రంగా ప్రకృతికి లోకం మోకరిల్లేలా చేస్తారు.

చిలుకలగుట్ట నుంచి సమక్కను గద్దెమీదికి తీసుకొచ్చేది కొక్కెర కృష్ణయ్య ఐతే కన్నుపల్లి నుంచి సారలమ్మను మేడారం తోడ్కొని వచ్చేది కాక సార్య. దైవ భాష తెలిసిన మనుషులు. ఇంతకీ మేడారంలో ఏముంది? ఏ శక్తి ప్రపంచం అంతా మేడారం వైపు అడుగులు వేసేలా చేస్తుంది. అష్టాదశ శక్తిపీఠాల కంటే మేడారానికి బలమైన శక్తి వుంది. అంటారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వామీ స్వరూపా నందేంద్ర సరస్వతీ. మేడారం సమ్మక్క–సారలమ్మలను కొలిచేందుకు ప్రతి రెండేళ్ళకొకసారి మనుషులు చీమల పుట్టల్లోంచి పోటెత్తినట్లు, ఉసిల్లదండు ఎగజిమ్మినట్లు జనమంతా చీమలై మేడారం బారులు తీస్తారు. రెండేళ్ల కొకసారి మనుషులు అసంఖ్యకంగా తమ తమ భోగాలను మరచి, భాగ్యాలను విడిచి దండకారణ్యపు దారులకు దండం పెట్టేందుకు తహ తహలాడుతారు.

మేడారం జాతర నిర్వహణలో కాల క్రమంలో అనేక మార్పులు



వచ్చాయి. గత సర్కారు చేసిన ఏర్పాట్లకు, తెలంగాణ తొలి సర్కార్ చేసిన ఏర్పాట్లుకు మధ్య బోలెడంత వ్యత్యాసం కళ్ళకు కట్టింది. పూర్వకాలంలో జాతరకు వెళ్లినవాళ్ళు ఇంటికి వచ్చేదాకా ఇబ్బందిగా ఉండేది. జాతర సమయంలో ఆధునిక హంగులు అనేకం మేడారంలో తిష్టవేశాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ విస్తరణ వల్ల మనిషి ఇంట్లో ఉన్నా జాతరలో ఉన్నట్లే... జాతరలో ఉన్నా ఇంట్లో ఉన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. సర్కార్ చేసే ఏర్పాట్లకు తోడు సమస్త వస్తు ప్రపంచం వినియోగం వున్న చోట వినియోగం ఎంత మాత్రం కూడదని భావించి సకల వస్తు సమూహాల మార్కెట్లు మేడారంలో డంప్ అయ్యాయి. 2002 జాతర సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ తొలిసారిగా పాదుకొల్పింది. అప్పుడు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఒకే ఒక్క మార్‌ఫోన్ సేవలు వుండేవి. 2008 జాతర నాటికి బిఎస్ఎన్ఎల్ 30–40 ఫోన్ల నుంచి ఇప్పుడు మేడారాన్ని మోడర్న్ కమ్యూనికేషన్ హబ్‌గా మార్చింది. సకల సెల్ కంపెనీలు మేడారంలో హల్‌చల్ చేస్తున్నాయి. కోకకోలా వంటి కంపెనీల జనరల్ మేనేజర్లు సైతం జాతరకు వారం పది రోజుల ముందే వచ్చి లారీల కొద్దీ సరుకును డంప్ చేశారు. లక్షలాది మంది భక్తులు మేడారానికి పోటెత్తిన నేపథ్యంలో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అన్ని కంపెనీలు మేడారం జాతరను ఒక గొప్ప ప్రచార కేంద్రంగా వినియోగిస్తుంది.

భక్తకోటి సౌకర్యాలు కల్పించడంలో సర్కారు, సర్కారేతర సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు మేడారానికి మోకరిల్లుతున్నాయి. జాతర సందర్భంగా ఆదివాసీలు తమ సంస్కృతి పరిరక్షణపై అనేక డిమాండ్లను ప్రభుత్వం ముందు ప్రపంచం ముందు వుంచుతుంది. తమకు మాత్రమే ప్రత్యేకమైన సంస్కృతి, ఆచార వ్యవహారాలను మెల్లమెల్లగా మారుస్తూ వస్తున్నారనేది వారి ప్రధాన ఆరోపణ. దేవుడికి భక్తుడికి మధ్య ఎటువంటి దళారీ వ్యవస్థ ఇక్కడ లేదు. తనకు కావలసిన కోరికలను, భక్తుడు నేరుగా తల్లి తో చెప్పుకుంటారు. అర్చనలు, శఠగోపాలు తమకు లేవు కానీ తమ సంస్కృతిపై శఠగోపం మాత్రం పెట్టొద్దని కోయలు వేడుకుంటున్నారు. తమకు మాత్రమే ప్రత్యేకమైన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించేందుకు తాము పోరాడాల్సి వస్తుందని వారు మథనపడుతున్నారు. ఇన్నాళ్లు సమైక్య రాష్ట్ర సర్కార్‌తో తామ ఆలోచనా విధానాలకు పెద్దగా గౌరవం వుండేది కాదని ఇప్పుడు మాత్రం మన రాష్ట్రంలో మనదైన పాలనలో తమ సంస్కృతికి తిరిగి పాదుకొల్పే ఆశలు చిగురిస్తున్నాయని వారి కామెంట్ కాని అదే సమయంలో తమ తల్లులిద్దరూ కొలువుదీరే గద్దెలను పసుపుతో అలంకరించుకునేదని, అది మెల్లమెల్లగా మార్పు చేస్తూ పసుపు రంగు పెయింట్ వేయడం గతంలో చేస్తే ఈ సారి ఏకంగా సుందరీకరణ పేరుమీద మొత్తం గెద్దల ప్రాంగణంలో ఏకంగా గ్రానైట్ రాయి వేశారని, ఇప్పటికే సమక్క గద్దె వద్ద వున్న జువ్విచెట్టు పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన చెందుతున్నారు. గతంలో నిజాం సర్కార్ జమానాలో కోయ భాష సంస్కృతి కోసం ఏటూరునాగారం కేంద్రంగా కోయభాషలో విద్యా బోధన చేసిన చరిత్ర వరంగల్‌కు వుందని అదివాసీ సంఘాలు అలనాటి రోజుల్ని గుర్తు చేసుకుంటున్నారు. ఈసారి జాతరకు వచ్చే భక్తులకు వన ప్రసాదం కింద మొక్కలను పంపిణీ చేయాలని కొంతమేర ప్రయత్నించినారు.

జాతరప్పుడు మాత్రమే తమ డిమాండ్లు వింటారు కానీ వాటిని ఆ తరువాత పట్టించుకోరనే ఫిర్యాదుకు తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఒక నిర్ణయం పట్ల ఆదివాసీల్లో కొంత ఆశ చిగురిస్తోంది. ముఖ్యమంత్రి కేసిఆర్ ఇటీవల వరంగల్ పర్యటించిన సందర్భంగా వరంగల్‌ను ఒక ఎడ్యుకేషన్‌హబ్‌గా మారుస్తామని ప్రకటించడం. అందులో ముఖ్యంగా గిరిజన విశ్వవిద్యాలయాన్ని వరంగల్‌లోనే నెలకొల్పుతామని ప్రకటించడం బహుశా! ఆసియాలోనే అతిపెద్ద జాతరగా ప్రఖ్యాతి గాంచిన మేడారం జాతరకు, ఆదివాసీ, ఆదిమ గిరిజన తెగలకే కాకుండా ఆ తెగలకు సెంటర్ పాయింట్ వరంగల్ అని భావించే ఆ విశ్వవిద్యాలయాన్ని ఇక్కడ నెలకొల్పుతామని ఆయన ప్రకటించి, ఆదిలాబాద్ జిల్లాలో రవీంద్ర కుమార్ శర్మ అనే ఒక కొలాం పాఠశాల టీచర్ తన పరిధిలో తనకు తోచిన మేరకు ఆ జిల్లాలోని ఆదివాసీ, గిరిజన సంస్కృతిని కొంతమేరకు కాపాడేందుకు ఒక కళాశ్రమాన్ని నెలకొల్పి కొనసాగిస్తున్నారు. దేశంలో అత్యధికంగా ఆదిమ గిరిజన తెగలు వుండే ఈశాన్య రాష్ట్రాల్లో కూడా లేని విధంగా భోపాల్‌లో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియం నెలకొల్పి వారి అడుగంటి పోతున్న వారి సంస్కృతిని ప్రచారం చేయడమే కాకుండా పరిరక్షణ చేస్తున్న దాఖలాలున్నాయి. ఆ స్ఫూర్తితో కోయల సంస్కృతే కాదు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు వెలుగొందాలని సమక్క–తల్లికి మొక్కుదాం. చల్లంగా చూడాలని కొక్కెర కృష్ణయ్య, కాక సారయ్యలు దేవతలతో మన పక్షాన వేడుకోవాలని కోరుకుంటాం...!

– నూర శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు



# తల్లిపాల ప్రాముఖ్యత

**ఈ క్రింది విషయాలపై అవగాహన అవసరము**

- ముర్రుపాలు / తల్లి పాల ప్రాముఖ్యత మరియు లాభాలు
- పౌష్టికాహారం
- ఆరోగ్యం - బాలింత / నవజాత శిశువు సంరక్షణ
- వ్యక్తిగత పరిశుభ్రత
- ప్రమాద లక్షణాలు
- ఇమ్మ్యునైజేషన్

**ముర్రుపాలు / తల్లి పాల ప్రాముఖ్యత :**

ప్రసవించిన 1 గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల దేశంలో 2,50,000 శిశు మరణాలను అరికట్టవచ్చును. ముర్రుపాలు పసుపు రంగులో ఉంటాయి. బంగారం కంటే విలువైనవి. బిడ్డ పుట్టిన మూడు రోజుల్లో వచ్చే పాలన ముర్రుపాలు అంటారు.

**ముర్రుపాలు వలన బిడ్డకు కలిగే లాభాలు :**

- ముర్రుపాలలో విటమిన్ 'ఎ', 'సి', 'డి', 'ఇ', 'కె', ప్రోటీన్స్, మినరల్స్, క్రొవ్వులు మరియు చక్కర పదార్థాలు బిడ్డకు కావలసిన సమతుల్యతలో పుష్కలంగా ఉంటాయి.
- బిడ్డకు మొట్టమొదటి వ్యాధి నిరోధక శక్తిని ముర్రుపాల ద్వారా అందించగలము.
- బిడ్డలో రోగ నిరోధక శక్తిని పెంచే, ఎదుగుదలకు దోహదం చేయు పౌష్టిక పదార్థాలు ముర్రుపాలలో 90 కంటే ఎక్కువగా ఉన్నాయి.
- వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉండటం వలన నీళ్ల విరేచనాలు మరియు ఇతర వ్యాధులు రాకుండా కాపాడుతాయి.
- ముర్రుపాలు శిశువు ప్రేగులను శుభ్రం చేసే ప్రభావం కలిగి ఉంటాయి. ప్రేగుల్లోని బిలిరుబిన్ విసర్జింపచేయడం ద్వారా బిడ్డకు కామెర్ల తీవ్రతను తగ్గిస్తుంది.
- బిడ్డ మెదడు అభివృద్ధి చెందుతుంది. ప్రతిభను పెంచుతుంది.
- ముర్రుపాలు త్రాగిన బిడ్డలో గుండె జబ్బులు, క్యాన్సర్, బి.పి., తీవ్రశ్వాసకోశ వ్యాధులు, ఎలర్జీ మొదలగు వ్యాధుల్ని ఎదుర్కోగల రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. ఇది బిడ్డ జీవితాన్ని పెంచుతుంది.

**తల్లిపాల వలన బిడ్డ పొందే లాభాలు :**

- శిశువు పెరుగుదలకి, జ్ఞానేంద్రియాలు (చూపు, వాసన, వినికిడి, రుచి, స్పర్శ) ఉత్ప్రేరించడానికి ఉపయోగపడతాయి.
- బిడ్డలో భావపూరిత భద్రతాభావాన్ని మరియు ప్రేమ, ఆప్యాయతలతో కూడిన బంధాన్ని పెంపొందింప చేస్తుంది. ఇది బిడ్డ మానసిక అభివృద్ధిపై జీవితాంతం ప్రభావాన్ని కలిగిస్తుంది. ఈ పిల్లలు చదువులో బాగా రాణిస్తారు. జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొంటారు.
- బిడ్డకు కావలసిన ఇనుము, కాల్షియం తల్లి పాల ద్వారా

అందుతుంది. కనుక రక్తహీనత బిడ్డకు రాదు.

- తల్లిపాలు సులభంగా జీర్ణమవుతాయి. బిడ్డకు మలబద్ధకం, కడుపునొప్పి రాదు.

### పాలిచ్చుటవలన తల్లికి కలిగే లాభాలు

- ప్రసవించిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టడం వలన ప్రసవానంతర రక్తస్రావం అరికట్టవచ్చు. దాని వలన రక్తహీనతను తగ్గించవచ్చు.
- తల్లి పాలివ్వడం ఆలస్యమైతే తల్లికి రొమ్ములలో పాలు గడ్డ కట్టవచ్చును.
- డయాబెటిక్ తల్లులు బిడ్డకు తల్లిపాలు ఇచ్చుట వలన ఇన్సులిన్ తీసుకోవలసిన అవసరం తగ్గిస్తుంది.
- తల్లి పాలివ్వడం వలన తల్లికి రొమ్ము, ఓవరీస్ క్యాన్సర్‌లు మరియు అస్టియో పోరోసిస్ (ఎముకలు పట్టుత్వం కోల్పోవడం) లాంటి జబ్బులు రాకుండా కాపాడుతుంది తల్లిలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- గర్భిణీగా ఉన్నప్పుడు పెరిగిన బరువును పాలివ్వడం ద్వారా కోల్పోగలుగుతుంది.
- బిడ్డకు, బిడ్డకు మధ్యన ఎడం ఉండేలా సహాయపడుతుంది.

### గర్భిణీ / బాలింతల పౌష్టికాహారం:

- పాలిచ్చే తల్లికి అధికంగా శ్రమించే స్త్రీల కంటే కూడా 550 కిలో కాలరీలు ఎక్కువ శక్తి మరియు ఇతర పోషకాలు అవసరం. కాబట్టి బాలింత స్త్రీ ఎక్కువ ఆహారం తీసుకోవాలి.
- సరైన పౌష్టికాహారం తీసుకోవడం, ముఖ్యంగా ఆకుకూరలు, పప్పులు, రాగులు, బెల్లం, వేరుశనగలు, చిక్కుళ్ళు, మాంసం, గ్రుడ్లు, పాలు, మొలకెత్తిన గింజలు, బొప్పాయి, నారింజ, సీతాఫలం, అరటి వంటి పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- మంచినీళ్ళు, ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.
- డాక్టర్ సలహా లేకుండా గర్భిణీగాని, బాలింతగాని ఎటువంటి మందులు వాడరాదు మరియు తల్లిపాలు ఇవ్వడం మానరాదు.

### బిడ్డకు పౌష్టికాహారం:

- మొదటి ఆరు నెలలు తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ పౌషకాహారం, తల్లిపాలు నుంచి కావలసినంత మాంసకృత్తులు, క్రొవ్వు, విటమిన్లు, కాల్షియం, ఇనుము ఇతర ఖనిజాలు లభిస్తాయి.
- బిడ్డకు 6 నెలల నిండే దాకా తల్లిపాలు తప్ప ఇతర పదార్థాలు ఏమీ పట్టనవసరం లేదు.
- 6 నెలలు నిండిన బిడ్డకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం తప్పని సరిగా అవసరం.
- అదనపు ఆహారంలో జావలు, గుజ్జుగా చేసిన పండ్లు, ఉడికించిన ఆకుకూరలు, ఇడ్లి, ఉప్మా, పాలలో నానబెట్టిన రొట్టె, కిచిడి, పాయసం, ఉడకబెట్టి గుడ్డులో తెల్లసొన భాగం, ఉడకబెట్టిన పప్పు నెయ్యి చక్కర మిశ్రమము మొదలగునవి ఇవ్వాలి.
- 6 నెలలోపు బిడ్డ ప్రతినెల 600-800 గ్రాములు, 7 నెలల నుండి 1 సం॥లోపు బిడ్డ ప్రతినెల 300-400 గ్రాముల బరువు పెరగాలి.
- 7-9 నెలల బిడ్డకు సగం కప్పు ఆహారం (3) సార్లు 10-12 నెలల బిడ్డకు సగం కప్పు ఆహారం (5)సార్లు, తల్లిపాలు కొనసాగిస్తూ ఇవ్వాలి.
- సమయానికి తగు మోతాదులో యిచ్చే ఆహారం వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది మరియు పోషకాహార లోపం వలన కలిగే వ్యాధులు రావు.
- ప్రొద్దున్నే ఏడు గంటలలోపు 10 ని॥లు బిడ్డకు సూర్యరశ్మి తగిలేటట్టు చూడాలి. దాని వలన బిడ్డకు కావలసిన విటమిన్ 'డి' అందుతుంది.
- పాలిచ్చునప్పుడు ఒకవైపు రొమ్ము నుండి బిడ్డకు పూర్తిగా పట్టిన తర్వాతే రెండవ రొమ్ము నుండి పట్టాలి. దీనివలన అన్ని రకాల పోషక పదార్థాలు బిడ్డకు అందుతాయి.

### తల్లి ఆరోగ్యము

- ప్రసవం జరిగిన తర్వాత 4 గంటలలోపు మొదటిసారి, 2 రోజులలోపు రెండవసారి, 6 వారాలలోపు మూడవసారి ఆరోగ్య పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలి.
- 10 రోజుల పూర్తి విశ్రాంతి తర్వాత 6 వారాల వరకు మంచి విశ్రాంతి అవసరము.
- ఇన్‌ఫెక్షన్స్ రాకుండా శుభ్రత పాటిస్తూ ఉండాలి.
- 100 ఐ.ఎఫ్.ఎ. మాత్రలతో పాటు కాల్షియం లభించే మాత్రలు తీసుకోవాలి.
- తల్లిపాలు ఇచ్చే సమయంలో వైద్యసలహా లేకుండా ఎలాంటి మందులు వాడకూడదు.
- పొగాకు, కల్లు, సారాయి తీసుకోకూడదు.
- తల్లి అనారోగ్యంగా వున్నా, బిడ్డ అనారోగ్యంగా వున్నా శిశువుకు పాలివ్వవచ్చును.
- డాక్టరు చెప్పినప్పుడు మాత్రమే తల్లిపాలు ఇవ్వడం మానాలి.

### బిడ్డ ఆరోగ్యం

- పుట్టినప్పుడు బిడ్డ బరువు కనీసం 2.5 కిలోల కంటే ఎక్కువ ఉండాలి.
- పుట్టిన బిడ్డకు స్నానం చేయించరాదు. శుభ్రమైన పొడిబట్టతో తుడవాలి.
- మందమైన బట్టతో చుట్టి వెచ్చదనము కలిగించాలి.
- పుట్టిన వెంటనే బిడ్డ బిగ్గరగ ఏడ్చినచో ఆరోగ్యవంతమైన బిడ్డగా పరిగణించాలి.
- 24 గంటలలో మూత్ర విసర్జన, 40 గంటలలోపు ముదురు ఆకుపచ్చ రంగులో మలవిసర్జన చేయాలి.
- బొడ్డకు ఏమీ పూయకూడదు. శుభ్రంగా పొడిగా ఉంచాలి.
- మొదటి 6 నెలలు కేవలం తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు వ్యాధులు రాకుండా కాపాడవచ్చును.
- ఆముదం త్రాగించరాదు. చెవుల్లో, ముక్కుల్లో నూనె వేయరాదు. ఇవి బిడ్డలో వినికిడి శక్తి లోపించడానికి దోహదపడతాయి.
- డబ్బాపాలు, పాల సీసాలు, పాల పీకలు వాడకూడదు.

- పాలిచ్చిన తర్వాత బిడ్డను భుజంపైకి ఎత్తుకొని, పాలతో పాటు మింగిన గాలిని త్రేన్పు రూపంలో బయటకు వచ్చేలా వీపు మీద తట్టాలి.
- బిడ్డ పుట్టిన వెంటనే కొందరు తల్లులు ముర్రుపాలు పట్టకుండా గ్లూకోజ్ నీరు, చక్కర నీరు, తేనె లాంటివి త్రాగిస్తారు. ఇవి ప్రమాదకరం వీటిని త్రాగించరాదు.
- మత్తుపానీయాలు (నల్లమందు, సారా, కల్లు) త్రాగించడం ద్వారా శిశువులు ఎముకల పటుత్వం కోల్పోతారు. అంతేకాక వారిలో మానసిక, శారీరక లోపాలు ఏర్పడతాయి.

**పరిశుభ్రత**

- రొమ్ములను, జననాంగాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంట్లో కాన్పు అయితే శుభ్రంగా వున్న ప్రదేశం, శుభ్రమైన బ్లేడు, శుభ్రమైన బట్టలు, శుభ్రమైన దారం, శుభ్రమైన చేతులు (ప్రసవం చేసే వారి) ముఖ్యం.

**బిడ్డ**

- బాటిల్ పాలను సాధ్యమైనంత వరకు నివారించాలి.
- తప్పనిసరి పరిస్థితుల్లో సీసా పాలు బిడ్డకు పడుతున్నట్లయితే పాలపీకను, పాలసీసాను శుభ్రంగా ఉంచాలి. మసిలే నీళ్ళలో ప్రతి దినము ఒకటి లేదా రెండు సార్లు 10 నిముషాలు ఉడికించి శు భ్రంగా చేయాలి.
- బిడ్డ ఉన్న ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉండాలి.
- బిడ్డ ఆహారం తయారు చేసినప్పుడు, తినిపించేపుడు, చేతులను పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పైవేవీ పాటించకపోతే రోగక్రిములు శరీరంలోకి ప్రవేశించి రోగాలను కలిగిస్తాయి.

**తల్లిలో కనిపించే ప్రమాద లక్షణాలు**

- ప్రసవానికి ముందు ఉమ్మనీరు పడిపోవడం.
- ఎక్కువసేపు పురిటి నొప్పులు రావడం.
- ప్రసవం తర్వాత అధిక రక్తస్రావం అవడం.
- ప్రసవం తర్వాత జ్వరం, ఫిట్స్, చలి, పొత్తి కడుపులో నొప్పి, యోని నుండి దుర్వాసనతో కూడిన ద్రవం రావడం.
- రొమ్ములో ఒక భాగం వాచి, వేడిగా, నొప్పిగా ఉండి జ్వరం రావడం.
- కాన్పు సమయంలో తగిన శుభ్రతలు పాటించకపోవడం వలన, ధనుర్వాతం వచ్చే అవకాశం ఉంది.

**బిడ్డలో కనిపించే ప్రమాద లక్షణాలు:**

- పుట్టిన వెంటనే బిడ్డ శ్వాస తీసుకోకపోవడం, ఏడవలేకపోవడం.
- శరీరం బిగిసిపోయినట్లు ఉండటం, పాలు త్రాగలేకపోవడం, ఏడుస్తూ ఉండటం.
- బిడ్డ కళ్ళు ఎర్రబడి, వాచి, చీము చేరడం.
- బొడ్డు చుట్టూ ఎర్రగా ఉండి చీము చేరడం.
- బిడ్డకు దగ్గు, జ్వరం ఉండి వేగంగా ఊపిరి పీల్చుకోవడం ఛాతి లోపలికి పోయి ప్రక్కలు ఎగరవేయడం.
- బిడ్డ శరీరం పసుపుపచ్చగా ఉండటం, నీలం రంగులో ఉండటం ఫిట్స్ వస్తూండటం.
- పుట్టినప్పుడు బిడ్డ బరువు తక్కువగా అంటే 1.5 కిలోల కంటే తక్కువగా ఉంటే ప్రమాదం.

పై నుండి ఏ లక్షణమైన కనిపించిన వెంటనే డాక్టరును సంప్రదించవలెను.

**ప్రతి బిడ్డ జననాన్ని నమోదు చేయండి. మీ గ్రామ కార్యదర్శి నుండి జనన నమోదు పత్రాన్ని పొందండి.** ●



## టిసిపార్డు నందు స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ

మనిషి మనస్సు నందు బహిర్భూమికి వెళ్ళకూడదు, మరుగుదొడ్డిని ఉపయోగించవలెనని భావన వస్తే తప్పకుండా ఆ కుటుంబం మరుగుదొడ్డిని నిర్మించుకొంటారని, ఆ భావనను ప్రజలలోకి తీసుకొనివెళ్ళవలసిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఆర్‌డబ్ల్యుఎస్ఎస్, చీఫ్ ఇంజనీరు మరియు ఎస్‌బిఎం(జి)పిడి, ఎ.రాములు నాయక్ అన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజసంస్థ (టిసిపార్డు) నందు నాలుగు రోజుల 'స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ కార్యక్రమంను ప్రారంభించి ప్రసంగించారు. మన పొరుగునున్న బంగ్లాదేశ్ చిన్న దేశమైన పూర్తి స్థాయిలో బహిరంగ విసర్జన చేయడం నిలిపివేసిందని, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ఉపయోగంలోకి తెచ్చి ఎన్నో అంతర్జాతీయ అవార్డులను కూడా అందుకొన్నదని అన్నారు. అదే రీతిలో భారతదేశంలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మరుగుదొడ్ల వాడకం మనిషి నిత్య అవసరంగా మారింది. అందువలన ప్రతి ఒక్కరు లెట్రినిన్ నిర్మించుకొని దేశం నుండి బహిరంగ మలవిసర్జన లేకుండా ప్రయత్నం చేయాలని అన్నారు.

ఈ నాలుగు రోజుల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుండి గ్రామ పంచాయతీ అధికారులు, స్వచ్ఛందసంస్థ అధికారులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరు గ్రామాభివృద్ధిలో బహిర్భూమిపై ఫీల్డు స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి చేపట్టిన ఈ స్వచ్ఛ భారత్ మిషన్‌ను విజయవంతం చేయుటకు ప్రతి ఒక్కరు సహకరించవలసిన అవసరం ఉంది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని టిసిపార్డు సంస్థ సెంటర్ ఫర్ వాటర్ & శానిటేషన్ నిర్వహించింది.



# పిల్లల మనుగడ, ఎదుగుదలకు సూచనలు

**గర్భవతుల సంరక్షణపై అవగాహన**

**మొలకకు విత్తనానికి ఉన్న సంబంధమే తల్లికి బిడ్డకు ఉంది. బలమైన చెట్టుకు బలమైన విత్తనం వస్తుంది.**

**ఏ విషయాలపై అవగాహన అవసరము?**

- **ఆరోగ్యం**
- **పౌష్టికాహారం**
- **జాగ్రత్తలు**
- **సాధారణంగా కనబడే ప్రమాద లక్షణాలు**
- **కాన్పు సంసిద్ధత**
- **వ్యక్తిగత పరిశుభ్రత**
- **ముర్రుపాల ప్రాముఖ్యత**

**ఆరోగ్యము**

- గర్భం దాల్చగానే అంగన్‌వాడీలో నమోదు చేయించుకోవాలి.
- ఎత్తు, బరువు నమోదు చేయించుకోవాలి.
- మూత్రం, రక్తపోటు, రక్త పరీక్షలు చేయించుకోవాలి.
- కనీసం 5 సార్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.
- రెండు (టి.టి.) ఇంజక్షన్లు ప్రాణాంతకమైన ధనుర్వాత నివారణకు తీసుకోవాలి.
- ఐఎఫ్ఏ మాత్రలు (ఎర్రగోళీలు) రక్తహీనత నివారణకు తీసుకోవాలి.

**పౌష్టికాహారం**

- ఆహారము ఎక్కువ పరిమాణంలో తీసుకోవాలి.
- ఇనుము, మాంసకృత్తులు ఎక్కువగా వుండే ఆకుకూరలు, చిక్కుళ్ళ, బెల్లం, వేరుశనగలు, పప్పులు, ధాన్యాలు, ఖర్జూర పళ్ళు తీసుకోవాలి.
- ప్రాంతీయంగా దొరికే పళ్ళు తినాలి.
- పాలు, పెరుగు, గ్రుడ్ల తీసుకోవాలి.
- అయోడైజ్డ్ ఉప్పునే వాడాలి.
- పళ్ళరసాలు, నీరు బాగా తీసుకోవాలి.
- కొద్ది మోతాదులో ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలి.
- అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి.

**జాగ్రత్తలు**

- ఆఖరి మూడు నెలల్లో రోజూ రెండు గంటలు మధ్యాహ్నం, 8 గంటలు రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకోవాలి. దీనికి కుటుంబ సభ్యులు, ఆమె భర్త కూడా సహకరించాలి.
- ఆమె మానసిక వత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి.
- గర్భం ధరించిన కాలంలో, ముఖ్యంగా మొదటి, చివరి నెలల్లో బరువు పనులు చేయరాదు. దూర ప్రయాణాలు చేయరాదు.
- వాంతులవుతుంటే తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి.
- కల్లు, సారాయి. పొగాకు తీసుకోకూడదు.

**సాధారణంగా కనపడే ప్రమాద లక్షణాలు**

- తల్లి బరువు పెరగకపోవడం
- ( ఆరోగ్యంగా ఉన్న స్త్రీ కడుపుతో ఉన్నప్పుడు 10-12 కేజీల బరువు పెరగాలి)
- కంటి లోపలి రెప్పలు పాలిపోయినట్లుండడం
- (కంటి రెప్పలు లోపల గులాబి రంగులో ఉండాలి)
- ముఖం, కాళ్ళు, చేతులు ఉబ్బినట్లుగా ఉండటం
- రక్తస్రావము అవడం
- విపరీతమైన తలనొప్పి ఉండడం/తల తిరగడం (ఇది రక్తపోటు లక్షణం)
- ఎక్కువగా వాంతులవడం / నీరసంగా ఉండటం
- గర్భస్థ శిశువు కదలికలు తక్కువగా ఉండటం

**పై లక్షణాలు కనపడితే, వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి**

**కాన్పు సంసిద్ధత**

- పరిశుభ్రమైన నూలు బట్టలు శుభ్రంగా ఉతికించి సిద్ధంగా ఉంచుకోవాలి.
- గది శుభ్రముగా ఉండేలా చూసుకోవాలి.
- డెలివరి కిట్టు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.
- కాన్పు సమయంలో అవగాహన ఉన్న వారిని తోడుగా ఉంచుకోవాలి.
- దగ్గరలోని ఆసుపత్రితో సంబంధం పెంచుకోవాలి.
- కొంత డబ్బును ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలి.
- రవాణా ఏర్పాటు చేసుకోవాలి.

**వ్యక్తిగత పరిశుభ్రత - ముర్రుపాల ప్రాముఖ్యత**

- శారీరక శుభ్రత పాటించాలి, జననాంగాలు శుభ్రంగా ఉంచుకోవాలి.
- బిడ్డపాలు త్రాగడానికి వీలుగా రొమ్ము మొనలను మర్దన చేయాలి.
- పుట్టిన గంట లోపల బిడ్డకు ముర్రుపాలు తప్పక త్రాగించాలి.

**ముర్రుపాలు త్రాగించటం వలన బిడ్డలో విటమిన్ 'ఎ', ప్రోటీన్స్, పిండిపదార్థాలు మరియు రోగ నిరోధక శక్తిని బిడ్డ శరీరానికి అందించగలుగుతాము.**

**గర్భిణీ స్త్రీ మంచి ఆహారం తినకుంటే**

- కాన్పు కష్టం అవుతుంది.
- నెలలు నిండకుండా పురుడు రావచ్చు.
- తల్లి ప్రాణానికి, బిడ్డ ప్రాణానికి ముప్పు.
- తల్లి బలహీనంగా ఉంటే పుట్టిన బిడ్డలు బలహీనంగా ఉంటారు.
- బలహీనంగా పుట్టిన బిడ్డలకు రోగాలు ఎక్కువగా వస్తాయి.

బలహీనంగా ఉన్న బిడ్డలో తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు, తక్కువగా వుండి, చదువులో వెనుకబడతారు. నైపుణ్యం చూపించలేక ఉద్యోగ అవకాశాలను కోల్పోతారు, ఆదాయం లేక పేదరికంలో ఉండిపోతారు.

- మాంసకృత్తులు –ఎక్కువగా ఉండే పదార్థాలు
- పప్పులు, బఠాణీలు, చిక్కుళ్ళు, వేరుశనగ, సోయాబీన్, కాయగూరలు, ఆకుకూరలు మొదలగునవి.
- విటమిన్‌లు – ఖనిజ లవణాలు ఉండే పదార్థాలు
- ఆకుకూరలు, కాయగూరలు, పసుపు పచ్చని పండ్లు మొదలగునవి.
- 18 సం॥లు వయస్సు దాటిన తరువాతే యువతి శారీరకంగా, మానసికంగా తల్లి కాగల స్థితిలో ఉంటుంది. 18 సం॥ల లోపే గర్భం ధరిస్తే పుట్టే బిడ్డ 60 శాతం చనిపోయే అవకాశం ఉన్నది. తల్లికి కూడా ప్రాణాపాయం.
- మన రాష్ట్రంలో – గ్రామాల్లో 64%, పట్టణాలలో 58% మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు.
- మాతృ మరణాలు, శిశు మరణాలు, చిన్న ఆకారంతో పుట్టడానికి (34% పొడవు తక్కువ, 37% తక్కువ బరువు) ఇదే కారణం.

వీటిని ఐఎఫ్ఏ మాత్రలు, ఇనుము వున్న ఆహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చును. ●

# కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి ఎ.కే.గోయల్‌తో టిసిపార్డ్ కమీషనర్ సమావేశం



టిసిపార్డు కమీషనర్ అనిత రామచంద్రన్ ఐఏఎస్ కేంద్ర ప్రభుత్వ పంచాయితీరాజ్ శాఖ అడిషనల్ కార్యదర్శి ఎ.కె.గోయల్ ఐఏఎస్‌ను 10.3.16న జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ సంస్థ, హైదరాబాద్ నందు కలుసుకొని తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పనిచేయు తీరును గూర్చి వివరించారు. అదే విధంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) అమలు గూర్చి వివరించారు. తెలంగాణ రాష్ట్రంకు ఇటీవల (ఎంజిఎన్ఆర్ఇజిఎస్)ను అమలు చేయుటతో నాలుగు జాతీయ అవార్డులను గెలుచుకొంది. మరో నాలుగు వ్యక్తిగత అవార్డులను కూడా గెలుచుకొందని వివరించారు. ఈ సమావేశములో పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమీషనర్ శ్రీ పి.రామారావు తదితరులు పాల్గొన్నారు. ●



# గృహహింస నుండి మహిళలకు చట్టపరమైన రక్షణ

వివక్షతతో కూడిన ఆచారాలు, పద్ధతులు, అభిప్రాయాల వలన సమాజంలోనే కాకుండా ఇంటోల కూడా స్త్రీ, పురుష సంబంధాలలో అసమానతలు ఏర్పడి, గృహ హింసకు దారి తీస్తున్నాయి. అటువంటి స్త్రీలకు ఉపశమనం కల్పించే దిశగా, పై రక్షణ చట్టం ఏర్పడింది.

**మహిళలపై హింస - మానవ హక్కుల ఉల్లంఘన**
**స్త్రీలను గౌరవిద్దాం - సమాజ అభివృద్ధికి తోడ్పడదాం**

**గృహహింస అనగా**

- శారీరక
- మానసిక (మాటల ద్వారా ఉద్వేగపరచడం)
- ఆర్థిక
- లైంగిక హింసలు
- ఇంకనూ బెదిరించడం, భయపెట్టడం, దౌర్జన్యానికి పాల్పడడం, ఆరోగ్యాన్ని కుంటుపరిచే చర్యలన్నీ గృహహింసకు సంబంధించినవే.

**చట్టం పరిధి**

- ఈ చట్టం ప్రకారం బాధితురాలు, ప్రతివాది మధ్య సంబంధం భార్యభర్తల సంబంధమే కానవసరంలేదు. పుట్టక ద్వారా, పెళ్ళి ద్వారా, దత్తత ద్వారా కలిసి వుంటున్న వారు అయినా, ఒకే ఇంటిలో ప్రస్తుతం కానీ, గతంలో కాని కలిసి నివసిస్తూ ఉన్న స్త్రీ పురుషులు ఈ చట్టం పరిధిలోకి వస్తారు.

**సమాచారం ఎవరు ఇవ్వాలి**

- బాధితురాలి సమాచారం ఆమె కాని, ఆమె తరుపున ఎవరైన హింస జరుగుతోంది లేక జరగబోతుంది అని కాని రక్షణ అధికారికి ఇవ్వవచ్చు.

**చట్టం అమలు పరిచే యంత్రాంగం**

- రక్షణ అధికారి
- న్యాయసేవల అధికారి
- సేవలు అందించే సంస్థలు
- ఆశ్రయం అందించే సంస్థలు
- పోలీసు అధికారి

**రక్షణ అధికారి బాధ్యతలు**

- చట్టపరమైన సహాయం, ఉచిత న్యాయసేవలు, ఆర్థిక సహాయం, పిల్లల సంరక్షణ, ఆశ్రయం అందించే సంస్థలు, వైద్య సహాయం గురించి సమాచారం బాధితురాలికి అందజేయాలి.
- జరిగిన హింసను "గృహ ఘటన నివేదిక" రూపంలో మెజిస్ట్రేట్ కోర్టుకు అందించి దాని నకలును బాధితురాలికి అందచేయాలి.
- బాధితురాలు కోరినచో "ప్రస్తుతం నివసిస్తున్న ఇంటిలోనే ఉండే హక్కును" పరిరక్షించడం.

**న్యాయసేవల అధికారి**

- మెజిస్ట్రేటు దరఖాస్తు కోర్టుకు అందిన మూడు రోజుల్లో మొదటి వాదన వినాలి.
- కేసు విచరణ తేదీ తెలిపే నోటీసును రక్షణ అధికారి ద్వారా ప్రతివాదికి, అతను ఇంటిలో లేని పక్షంలో కుటుంబంలోని ఇతర సభ్యులకు అందజేయాలి.
- 60 రోజులలో తుది తీర్పు వినపించాలి.
- గృహహింస గురించి ప్రాథమికంగా నమ్మిన తరువాత, మెజిస్ట్రేట్ రక్షణ ఆదేశాలు జారీ చేయాలి. ఈ ఆదేశాలలో ఆర్థిక, ఆరోగ్య పరమైన నష్టాల భర్తీ, పిల్లల పోషణ, ఇతర ఖర్చులు, ఏక మొత్తంగా లేక నెలనెలా చెల్లించుట మొదలగు అంశాలలో ఉండవచ్చు. ఇంకనూ తాత్కాలిక నివాసం రక్షణ నిలయాలలో ఇచ్చుచూ బాధితురాలితో సంబంధాలు కొనసాగించకుండా ఉత్తర్వులు ఇవ్వవచ్చు. ఆర్థిక లావాదేవీలు నిలుపుదల చేయు ఉత్తర్వులు ఇవ్వవచ్చు.
- పై ఉత్తర్వులు ఉల్లంఘిస్తే ఏడాది జైలు శిక్ష గాని రూ.20,000 జరిమానా గాని రెండింటిని గాని విధించవచ్చు.

**సేవలు అందించే సంస్థలు**

- సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం 1860 క్రింద గాని, కంపెనీ రిజిస్ట్రేషన్ చట్టం 1956 క్రింద గాని రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్త్రీల సమస్యలపై సేవలందించే సంస్థలన్నీ - ఈ చట్టం క్రింద సేవలందించే సంస్థలుగా గుర్తింపు పొందవచ్చు.
- ఈ సంస్థలు బాధితురాలికి, పిల్లలకు, ఆశ్రయము మరియు వైద్య సదుపాయము మరియు కౌన్సిలింగ్ సేవలు అందజేయాలి.
- కౌన్సిలర్ల ఎంపిక వాది ప్రతివాదులు ఇద్దరూ అంగీకరిస్తేనే జరుగుతుంది.

**ఆశ్రయం అందించే సంస్థలు**

- జిల్లాలోని ప్రభుత్వ మరియు గుర్తింపబడిన స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ఆశ్రయ సదుపాయం బాధితురాలి కోరికపై లేక కోర్టు ఆదేశాల మేరకు కల్పించడం.

**పోలీసు అధికారి**

- కోర్టు ఇచ్చిన రక్షణ ఉత్తర్వులు ఉల్లంఘించినచో అది చట్టరీత్యా నేరం. సదరు ఫిర్యాదు రక్షణ అధికారి ద్వారా గాని, బాధితురాలి ద్వారా గాని, లేక మెజిస్ట్రేటు ఆదేశాల ద్వారా గాని చేరినప్పుడు కేసును చట్టంలో సెక్షన్ 31 క్రింద లేక 498ఎ భారత శిక్షాస్మృతి 1860 క్రింద లోబడి చర్య తీసుకోవాలి.



# గ్రామీణ పారిశుద్ధ్యంలో 'మ్యాజిక్ పిట్'

**డ్రైనేజీ ఫ్రీ గ్రామాలుగా మార్పు**
**దోమల నివారణకూ అవకాశం**
**ఉపాధి హామీ నిధులతో పెద్దఎత్తున పిట్‌ల నిర్మాణం**

మురికి నీరు ఎక్కడపడితే అక్కడపారడం.... రోడ్లన్నీ బురదగుంటలుగా ఉండటం... రహదారులు, వీధులు మురుగు నీటితో కంపు కొట్టటం... ఈ సీన్లు ప్రతి గ్రామంలో నిత్యం కనిపిస్తాయి. గత పాలకులు నిర్లక్ష్యం వహించడంతో వేల గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. రాష్ట్రంలో ఇలాంటి దృశ్యాలు కనిపించకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వంతో ప్రభుత్వం దృఢసంకల్పంతో ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరు తన ఇంటి వద్ద మ్యాజిక్ పిట్‌లను నిర్మించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా పిట్‌ల నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.తారక రామారావు అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు కార్యాచరణను అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.95.32 కోట్లు విలువైన 2,33,689 పిట్‌లను మంజూరు చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 87,972, ఆ తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో 41,046, మెదక్ జిల్లాలో 37,085 అతి తక్కువగా రంగారెడ్డి జిల్లాలో 2,240 నిర్మిస్తున్నారు. ప్రతి గ్రామంలో మురుగు నీరు రోడ్లపైకి రావడంతో ప్రజలందరి ఆరోగ్యాలపై ప్రభావం చూపుతున్నది. ప్రతి ఇంట్లో బట్టలు ఉతకడం, వంట గిన్నెలు, స్నానాలు ఇలా అనేక రకాలుగా వాడే నీరు రోడ్లపైకి పోవాల్సిందే. మ్యాజిక్ పిట్‌ల ద్వారా ప్రతి ఇంటిలో మురుగునీరు రోడ్లపైకి రాకుండా ఈ పిట్‌లోకి వెళ్లే విధంగా చేస్తారు. దీని కోసం ప్రతి లబ్దిదారుడికి రూ.4 వేల మొత్తాన్ని ఉపాధి హామీ ద్వారా అందిస్తారు. ఈ నిర్మాణం చేసిన గ్రామాల్లో రోడ్లపైకి నీరు రాదు. దీనితో దోమలు, ఇతర సమస్యలు రావని తేల్చారు. సిద్దిపేట నియోజకవర్గం ఇబ్రహీంపూర్‌లో ఈ విధానం ప్రయోగాత్మకంగా అమలు చేసి విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ఇండ్లతో పాటు గ్రామాల్లో వాడల్లో ఉండే నల్లాల వద్ద వృధా నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుంటుంది. వీటి దగ్గర కమ్యూనిటీ మ్యాజిక్ పిట్‌లను నిర్మిస్తున్నారు. వీటి కోసం ఒక్కోదానికి రూ.8వేలు మంజూరు చేస్తున్నారు. మురుగు నీరు భూమిలోకి ఇంకడం ద్వారా ప్రతి సంవత్సరం రెండు కోట్ల లీటర్ల నీరు భూమిలోకి వెళ్తుందని లెక్కల్లో తేలింది. వీటి నిర్మాణానికి ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకురావాలని అధికారులు కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటి నిర్మాణానికి పెద్దగా వ్యయం, సమయం తీసుకోకున్నా... ప్రతి ఒక్కరిలో మ్యాజిక్ పిట్‌లను నిర్మించుకోవాలనే సంకల్పం రావడం ముఖ్యమంటున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా పెద్దఎత్తున వీటి నిర్మాణాల ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా అనేక విధాలుగా మేలు చేకూరే అవకాశం ఉంది. డ్రైనేజీ నిర్మాణాల కోసం కోట్ల రూపాయలు వెచ్చించే బదులు ఎవరి ఇంట్లోని మురుగు నీటిని వారి ఇంట్లోనే ఇంకే విధంగా చేస్తే అనేక విధాలుగా ఉపయోగంగా ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

**సిరిసిల్ల ఆదర్శం...**

సిరిసిల్ల నియోజకవర్గాన్ని డ్రైనేజీ ఫ్రీ గ్రామాలుగా మార్చడానికి స్థానిక ఎమ్మెల్యే, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.తారకరామారావు కృతనిశ్చయంతో ఉన్నారు. ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా ఉండే విధంగా సిరిసిల్ల నియోజకవర్గంలో వీటి నిర్మాణాలను చేపడతున్నారు. రాబోయే రోజుల్లో ఇతర జిల్లాల ప్రతినిధులు అక్కడికి వచ్చి వాటి ఫలితాలను చూసి స్ఫూర్తి పొందే విధంగా చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో 46,143 మ్యాజిక్ పిట్‌ల నిర్మాణానికి మంజూరు ఇచ్చారు. సిరిసిల్ల మండలంలో 11,191, గంభీరావుపేటలో 11,595, ఎల్లారెడ్డిపేటలో 14,023, ముస్తాబాద్‌లో 9,334లకు మంజూరు



ఇచ్చారు. వీటి నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలోనే నియోజకవర్గాన్ని డ్రైనేజీ ఫ్రీ నియోజకవర్గంగా ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. సిరిసిల్ల నియోజకవర్గం ఇప్పటికే మరుగుదొడ్ల నిర్మాణంలో వంద శాతం పూర్తి చేసి ఆదర్శంగా నిలిచింది.

మ్యాజిక్ పిట్ నిర్మాణం ఇలా...

నాలుగు అడుగుల లోతు, నాలుగు అడుగుల వెడల్పుతో గుంత తీయాలి. ఇందులో కింది భాగంలో సగం అడుగు ఎత్తు వరకు పెద్ద సైజ్ కంకర రాళ్లతో నింపాలి. ఆ తరువాత మరో సగం అడుగు భాగాన్ని చిన్న సైజ్ గుళకరాళ్లతో నింపాలి. మూడు అడుగుల ఎత్తు, వెడల్పుతో సిమెంట్‌తో తయారు చేసిన ట్యాంక్‌ను అమర్చాలి. దానికి చిన్న చిన్న రంధ్రాలు చేయాల్సి ఉంటుంది. ఈ ట్యాంకు చుట్టూ చిన్న సైజ్ గుళకరాళ్లను వేయాల్సి ఉంటుంది.

**జిల్లాల వారీగా నిర్మాణాలు చేపట్టిన మ్యాజిక్ పిట్‌ల వివరాలు...**

| జిల్లా | మ్యాజిక్‌పిట్‌లు |
|---|---|
| ఆదిలాబాద్ | 22,602 |
| కరీంనగర్ | 87,972 |
| ఖమ్మం | 7,575 |
| మహబూబ్‌నగర్ | 41,046 |
| మెదక్ | 37,085 |
| నల్గొండ | 8,060 |
| నిజామాబాద్ | 9,869 |
| రంగారెడ్డి | 2,240 |
| వరంగల్ | 17,240 |
| **మొత్తం** | **2,33,689** |

●

# సఫాయి కర్మచారీల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

సఫాయి కర్మచారీల సమగ్ర అభివృద్ధిలో ప్రభుత్వశాఖలన్నీ భాగస్వామ్యం కావాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్మచారీల ఆర్థిక, సామాజిక, విద్యపరమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారీలు సమాజంలో అట్టడుగున వున్నారని, వారిని ప్రగతి పథంలో నడిపించేందుకు అధికారులు సహకరించాలన్నారు. ముఖ్యంగా కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగా సఫాయి కర్మచారీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేసి భారతి హోలికేరి మాట్లాడుతూ 1950లో జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వులననుసరించి జిల్లాలో కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసినట్లు చెప్పారు. దరఖాస్తుదారులు అవసరమైన పత్రాలు జత చేస్తే వెంటనే జారీ చేస్తామన్నారు. అంబేద్కర్ సఫాయి కర్మచారి మహిళా సంఘానికి బీవోటి కింద టియిలెట్లు నిర్మించి, నిర్వహించేందుకు ఆదేశపత్రాన్ని విజయ్‌కుమార్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏజేసి అశోక్‌కుమార్, ఆర్డీవోలు నిఖిల, రఘురాంశర్మ, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్ హన్మంత్‌నాయక్, బీసి సంక్షేమ శాఖ అధికారి దేవీదాస్, కమిషన్ సభ్యుడు విజయ్, తహసిల్దార్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

●



# వస్తుసేవలు వినియోగం

ప్రతి మానవుడు నిత్య జీవితంలో ఏదోఒక రకమైన వస్తుసేవలను వినియోగిస్తుంటాడు. వస్తుసేవలను వినియోగించకుండా మానవ జీవితాన్ని కొనసాగించడం ఏ మాత్రం సాధ్యం కాదు ఈ సమాజంలో ప్రతి మానవుడు ఒక వినియోగదారుడే. కాని నేడు వినియోగదారులు వస్తుసేవలు కొనుగోలు వాటిని ఎంపిక చేసుకునే విషయంలో అనేక మోసాలకు దోపిడికి గురి అవుతున్నారు. నేటి సమాజంలో వ్యాపారస్థులు, వర్తకుల మితిమీరిన లాభాపేక్ష వల్ల అనుచిత, అసత్య, అవాస్తవ వ్యాపార ప్రకటనలను ప్రసార మద్యమాల ద్వారా ప్రసారం చేసి వినియోగదారుల ఎంపిక నిర్ణయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు.

నేటి ఆధునిక సమాజంలో కల్తి రాజ్యమేలుతుంది. ఉదా:-కు టీ పొడిలో రంపపు పొట్టు, పాలల్లో యురియా, గంజినీల్లు, మిరియాలలో పొప్పడి కాయ గింజలు, కందిపప్పులో కేసరి గింజలు, కాపి పొడిలో చింత గింజల పొడి, పశుల కళేభరాలతో తయారుచేసిన నూనె, ఈ విధంగా ప్రతి తినే ఆహారంలో కల్తియే జరుగుతుంది. దీనికి తోడు నకిలి వస్తువుల ఉత్పత్తి గణనీయంగా పెరిగిపోయింది. ప్రస్తుత వ్యాపార మార్కెట్‌లో 70% మేర కల్తి జరుగుతుందని అంచనాలు వెల్లడిస్తున్నాయి. వినియోగదారుల హక్కులను ప్రయోజనాలను కాపాడటానికి, వినియోగదారులు ఎదర్కొంటున్న మోసాలను అరికట్టడం కోసం 1986వ సంవత్సరంలో భారత ప్రభుత్వం వినియోగదారుల పరిరక్షణ చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం జమ్ముకాశ్మీర్ రాష్ట్రం మినహా భారతదేశం అంతటా విస్తరిస్తుంది.

**వినియోగదారుని హక్కులు:**

- వినియోగదారుల రక్షణ చట్టం 1986 ప్రకారం ప్రతి వినియోగదారుడికి భారత ప్రభుత్వం 8 హక్కులను ప్రసాదించింది. అవి:
- ఎంపిక చేసుకునే హక్కు
- ప్రాథమిక అవసరాలను పొందే హక్కు
- ఆరోగ్యకరమైన పరిసరాలను పొందే హక్కు
- విద్యను పొందే హక్కు
- సమాచారం పొందే హక్కు
- భద్రతా హక్కు
- విన్నపం చేసుకునే హక్కు
- నష్ట పరిహారం పొందే హక్కు

**వినియోగదారుల రక్షణ చట్ట స్వరూపం**

వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం కేంద్రస్థాయిలో జాతీయ స్థాయిలో వినియోగదారుల కమీషన్, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర వినియోగదారుల కమీషన్ జిల్లా స్థాయిలో జిల్లా ఫోరంలను ఏర్పాటు చేశారు.



**జిల్లా ఫోరం - నిర్మాణం:-**

ఒక జిల్లా జడ్జిగా పని చేస్తున్న వ్యక్తి లేదా జిల్లా జడ్జిగా పని చేయడానికి అర్హతలు కలిగిన వ్యక్తి జిల్లా ఫోరం అధ్యక్షుడిగా నియమింపబడతాడు. ప్రతి జిల్లా స్థాయిలో ఒక జిల్లా ఫోరం వుంటుంది. 20 లక్షల రూ. కంటే తక్కువ గల వినియోగదారుల వివాదాలను జిల్లా ఫోరం పరిష్కరిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ ఫోరంలో పరిధిలో కేసు కల్గియుంటే ఏ జిల్లా ఫోరంలోనైనా పిర్యాదు చేయవచ్చు.

**రాష్ట్ర వినియోగదారుల కమిషన్:**

ప్రతి రాష్ట్రానికి ఒక వినియోగదారుల కమిషన్ వుంటుంది. హైకోర్టు జడ్జి లేదా మాజీ జడ్జి లేదా జడ్జి అర్హత గల వ్యక్తి అధ్యక్షుడిగా నియమింపబడతాడు. రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో 20 లక్షల నుండి కోటి రూ. విలువ గల కేసులను పరిష్కరిస్తుంది.

జిల్లా ఫోరం తీర్పు వల్ల న్యాయం జరగని పక్షంలో, రాష్ట్ర స్థాయిలో వినియోగదారుల కమిషన్‌లో రాష్ట్ర స్థాయిలో న్యాయం జరగని పక్షంలో జాతీయ స్థాయి వినియోగదారుల కమీషన్ పిర్యాదు 30 రోజులలో అప్పీలు చేసుకోవచ్చు.

**జాతీయ వినియోగదారుల కమిషన్:**

సుప్రీం కోర్టు జడ్జి లేదా మాజీ జడ్జి స్థాయి వ్యక్తి అధ్యక్షుడిగా కొనసాగుతాడు. న్యాయ వాణిజ్య శాస్త్రాలలో ప్రావీణ్యం పొందిన 4గురు సభ్యులు వుంటారు వీరిలో ఒక మహిళ వుంటారు. కోటి రూ॥లకు మించిన వివాదాలను పరిష్కరిస్తుంది.

వినియోగదారుడు తాను నష్టానికి, మోసానికి గురి అయ్యానని భావించినప్పుడు జిల్లా, రాష్ట్ర, కేంద్ర వినియోగదారుల కమిషన్‌లో లక్ష రూపాయల వివాద పరిష్కారానికి 100 రూపాయలు చొప్పున ఫీజును చెల్లించాలి.

**వినియోగదారుల వివాదాలు- పరిష్కారాలు**

ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపణలు ఋజువు అయినప్పుడు ప్రతివాదాని ఫోరం వస్తు లోపాలను తొలగించమనవచ్చు. లేదా లోపం కల్గిన వస్తువులకు బదులుగా కొత్త వస్తువులను ఇవ్వమని ఆదేశించవచ్చు. వినియోగదారుడికి అయిన ఖర్చులను చెల్లించమని, లేదా ఫిర్యాదుదారుడికి కల్గిన నష్టపరిహారంను చెల్లించమని ఫోరం మరియు కమిషన్లు ఆదేశాలు జారీ చేయవచ్చు.

**వినియోగదారులు-జాగ్రత్తలు: -**

**మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై ప్రభుత్వం కొన్ని ప్రమాణాలు రూపొందించింది.**

1. వినియోగ వస్తువులపై ముద్రించబడి ఐఎస్ఐ, 9001:2001 సర్టిఫైడ్ మరియు కొన్ని ప్రత్రికా బ్రాండ్‌లు ముద్రలను మనం గమనించాలి.

2. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగ వస్తువులపై అగ్‌మార్క్, ఎఫ్‌పిఓ, వెజ్, నాన్‌వెజ్ లాంటి గుర్తులను పరిశీలించి కొనుగోలు చేయాలి.

3. కొన్ని గుర్తింపు పొందిన కంపెనీలు జారీచేసే గ్యారెంటీ, వారెంటీ, కార్డులతో పాటు రసీదును పొంది భవిష్యత్‌లో ఏదైనా నష్టం సంభవించినప్పుడు ఉపయోగించుకోవచ్చు.

4. వస్తువులపై ఉండే గరిష్ట చెల్లింపు ధర (ఎంఆర్‌పి) పరిమాణం, కాలం చెల్లింపు తేది (ఎక్స్‌పైరీ డేట్) గమనించాలి.

5. ఆరోగ్య సంబంధిత, ఫార్మసి మందులు, మొదలగు వాటిపై సూచించిన ప్రమాణాలను చదివి పాటించాలి.

6. ఆర్‌బిఐ, ఐఆర్‌డిఎ, పేరుతో కొన్ని మోసపూరిత కంపెనీలు ప్రకటించిన లాటరీలు, ఆఫర్‌లను చూసి మోసపోవద్దు జాగ్రత్త వహించాలి.

7. ఆన్‌లైన్ కొనగోలు చెల్లింపు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు మన స్వంత అకౌంట్ నెంబర్, పిన్ నెంబర్ విషయంలో జాగ్రత్త పాటించాలి.

8. తూనిక రాళ్ళపై ప్రభుత్వ అధికార ముద్రలు గమనించాలి.

వినియోగదారుల హక్కులను, ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఆయా చట్టాలపై అవగాహన లోపం వల్ల నేటికి వినియోగదారులు నకిలీ వస్తువులతో మోసపోతునే ఉన్నారు. ఈ పరిస్థితులో నుండి వినియోగదారులు బయటపడాలంటే కచ్చితంగా అందరిలో వినియోగదారుల హక్కుల పట్ల చైతన్యం తీసుకురావాలి.

జాతీయ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు - డి.కె. జైన్

కేంద్ర వినియోగదారుల సేవల శాఖామాత్యులు - రాంవిలాస్ పాశ్వాన్

తెలంగాణ రాష్ట్ర వినియెగదారుల శాఖమాత్యులు - శ్రీ ఈటెల రాజేందర్

వినియోగదారుల వివాదాల పరిష్కార ఉచిత ఫోన్ నెం. 1800114000

(మార్చి 15- ప్రపంచ వినియోగదారుల దినోత్సవం)

**దొడ్డి కుమార్**

**జూకల్, రంగారెడ్డి జిల్లా.**




# బేటీ బచావో.. దేశ్ బనావో!

వైద్యరంగం అభివృద్ధి చెందిన నేటి కాలంలో కూడా అయిదేళ్ల వయసు లోపు మరణించే పిల్లలు ఎక్కువ అవుతుండడానికి ప్రధానంగా పుట్టగానే శ్వాస పీల్చుకోలేక ఏడవకపోవడం, పుట్టుకతో లోపాలు, ఇన్‌ఫెక్షన్లు, వీటిలో చాలా వరకు గర్భంలో ఉన్నప్పుడే సరిచేయవచ్చు. గుండెకు రంధ్రం లాంటి అనేక నిర్మాణాత్మక లోపాలను గర్భంలో ఉన్నప్పుడే ఆపరేషన్ చేసి బాగుచేయవచ్చు. గ్రహణ మొర్రి లాంటి సమస్యలను గర్భంలో ఉన్నప్పుడే కనిపెట్టవచ్చు. నిజానికి మేనరికపు పెళ్లిళ్లను నివారించడం ద్వారానే ఎక్కువ శాతం పిల్లలను కాపాడవచ్చంటారు డాక్టర్ హిమబిందు సింగ్. థాలసీమియా, సికిల్‌సెల్ అనీమియా లాంటి జబ్బులతో పుట్టకుండా ప్రీమారిటల్ కౌన్సెలింగ్ ఉపయోగపడుతుంది. శిశు మరణాలకు, ఇన్‌ఫెక్షన్లకు ప్రధాన కారణం తల్లిపాలు ఇవ్వలేకపోవడమే. చాలా మంది పాలు పడలేదని చెబుతుంటారు. నిజానికి అలాంటిదేమీ ఉండదు. దీనికి మానసిక సంసిద్ధత లేకపోవడమే ప్రధాన కారణం. తల్లిపాలను రెండేళ్ల వయసు వరకు ఇవ్వాలి. వ్యాధినిరోధక శక్తిని పెంచే తల్లిపాలు స్థూలకాయం, క్యాన్సర్ లాంటి సమస్యలను కూడా నివారిస్తాయని అధ్యయనాలు తెలుపుతున్నాయి. క్షీర గ్రంథుల నుంచి తయారయ్యే పాలు ప్రొలాక్టిన్, ఆక్సిటోసిస్ హార్మోన్ల ప్రేరణ వల్ల ఉత్పత్తి అవుతాయి. ఇందుకు మానసిక ప్రేరణ అవసరం. తల్లులకు గర్భంతో ఉన్నప్పుడే ఈ విషయంలో కౌన్సెలింగ్ ఇవ్వాలి.

కౌమర్యంలో ఉండే ప్రధాన సమస్య లైంగిక మార్పుల గురించి తెలియకపోవడం. శారీరక, మానసిక మార్పులను తల్లిదండ్రులు అర్థం చేసుకుని పిల్లలకు కూడా వాళ్ల స్థాయిలో చెప్పాలి. అందం గురించి ఆలోచించడాన్ని నేరంగా మాట్లాడకుండా మెచ్చుకోవాలి. మంచి పనిచేసినప్పుడు వెన్నుతట్టి మెచ్చుకోలు ఇవ్వాలి. శారీరక మార్పుల గురించి తల్లిదండ్రులు మొహమాటపడకుండా వివరించాలి. శృంగారం గురించి మాట్లాడడానికి సిగ్గు పడకూడదు.

మహిళల్లో అవగాహన కొరవడితే పిల్లల ఆరోగ్యం ప్రశ్నార్థకమే అవుతుందన్నారు డాక్టర్ హిమబిందు సింగ్. హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్, పీడియాట్రిక్ ప్రొఫెసర్ అయిన ఆమె ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ మహిళా విభాగానికి నేతృత్వం వహిస్తున్నారు. కెరీర్‌పరంగానే కాకుండా ఆరోగ్యం విషయంలో కూడా మహిళలు వివక్షకు గురికావొద్దనే లక్ష్యంతోనే ఈ మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారామె.

ఆడపిల్లలను గర్భంలోనే చంపేయడం, పోషకాహారం, తొందరగా పెళ్లిళ్లు చేయడం, కౌమార్యంలో అవసరమైన టీకాల లాంటి ఆడపిల్లలకు సంబంధించిన అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు డాక్టర్ హిమబిందు. ప్రధాన మంత్రి మోడీ ఇచ్చిన 'బేటీ బచావో, బేటీ పడావో' పిలుపుకి 'దేశ్‌బనావో' అని చేర్చాం. ఆడపిల్లలు ఆరోగ్యంగా పెరిగితేనే దేశాన్ని ఆరోగ్యంగా తయారు చేయవచ్చని అంటారామె. ●



# గ్రామ పంచాయతీ అధికారాలు మరియు విధులు

సాధారణముగా ప్రతి ప్రభుత్వానికి విధులు మరియు అధికారాలు ఉంటాయి. అలాగే గ్రామపంచాయతీలకు కూడా కొన్ని అధికారాలు, విధులు ఇవ్వబడినవి. పంచాయతీరాజ్ చట్టము – 1994 నందలి సెక్షను 45 నుండి 59 వరకు గ్రామపంచాయతీ నిర్వహించవలసియున్న విధులు మరియు సంబంధించిన ఆస్థుల విషయాలు నిర్ధేశించబడియున్నవి. సెక్షను 60 నుండి 79 వరకు గ్రామపంచాయతీ ఆర్థిక విషయాలకు సంబంధించిన అధికారాలు, 80 నుండి 125 వరకు ప్రజా భద్రత సౌకర్యము మరియు ఆరోగ్యము గురించి చేయవలసిన పనులు, సెక్షను 126 నుండి 142 వరకు గ్రామపంచాయతీకి చెందిన ఇతర విషయాలను పేర్కొనడము జరిగినది.

సెక్షను 45 లో ఖచ్చితంగా నిర్వహించవలసిన విధులు, సెక్షను 46 నందు గ్రామ పంచాయతీ నందలి వనరుల లభ్యతను బట్టి ఐచ్చికంగా నిర్వహించవలసిన విధులతో పాటు చట్టంలోని షెడ్యూల్ 1లో నిర్వచించిన అంశాలు కూడా గ్రామపంచాయతీ నిర్వహించవలసియున్నది.

**సెక్షన్ 45 ప్రకారం తప్పనిసరిగా నిర్వహించవలసిన విధులు : (చార్టు - I)**

1. గ్రామపంచాయతీ తన అధికార పరిధిలో గల భవనాలు, రోడ్లు, వంతెనలు, కట్టలు, దారులు మొ॥ వాటి నిర్మాణం, నిర్వహణ చేయుట.
2. బహిరంగ స్థలాల్లో, వీధులలో, బజారుల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయుట.
3. మురుగు నీరు, వర్షపునీరు పోవుటకు కాలువలు నిర్మించి తగు విధంగా నిర్వహించడం.
4. గ్రామ పంచాయతీలో ఉన్న బజార్లలోను, వీధులలోను చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు, పొదలు మొదలైన వాటిని తొలగిలించుట.
5. ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు – నిర్వహణ.
6. స్మశాన వాటికల ఏర్పాటు – పోషణ, దిక్కులేని శవాలను ఖననము చేయుట, జంతువుల కళేబరాలను పూడ్చుట.
7. అంటువ్యాధుల నివారణ – కలరా, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు గైకొనుట
8. మంచినీటి బావులు, చెరువులు ఏర్పాటు – పోషణ, ప్రజలకు త్రాగునీరు సరఫరా.
9. కంపోస్టు, ఎరువుల తయారీ.
10. జనన, మరణముల నమోదు.
11. బందెల దొడ్లు ఏర్పాటు – నిర్వహణ.
12. గ్రామస్థాయిలో ఆర్థిక వనరుల సమీకరణ
13. ఈ చట్టంతోపాటు, ఇతర శాసనాల ద్వారా తప్పనిసరిగా నిర్వహించవలెనని ప్రభుత్వం భావించిన అన్ని ఇతర విషయములు.

**సెక్షను – 46 ప్రకారం ఐచ్ఛిక విధులు : (చార్టు – II)**

గ్రామపంచాయతీకి ఉన్న ఆర్థిక వనరుల లభ్యతను బట్టి ఈ క్రింది విధులను నిర్వహించవలసియుంటుంది.

1. ప్రయాణికులకు ధర్మశాలలు, విశ్రాంతి గృహములు నిర్మాణము, నిర్వహణ
2. రోడ్ల ప్రక్కన ఇతర పబ్లిక్ స్థలాలలో చెట్లు నాటించుట, వాటిని పరిరక్షించుట
3. ప్రీ ప్రైమరీ విద్య, ప్రాథమిక విద్య, ఆరోగ్యం మరియు కుటీర పరిశ్రమలు, అభివృద్ధి
4. వైద్యశాలల స్థాపన, నిర్వహణ,
5. రేడియోలు, ఆట స్థలములు, వ్యాయామ శాలల స్థాపన, నిర్వహణ
6. పార్కులు వేయుట, నిర్వహించుట.
7. గ్రంథాలయాలు, పఠన మందిరముల నిర్వహణ, స్థాపన
8. వికలాంగులు, నిరాధారులు, వ్యాధిగ్రస్తులకు సహాయ కార్యక్రమాలు,
9. వ్యవసాయ అభివృద్ధి కొరకు ప్రదర్శనలు నిర్వహణ,
10. మేలి రకపు వ్యవసాయ పద్ధతులు,
11. సహకార సంఘాలకు చేయూత, పెంపొందించుట
12. గిడ్డంగులు, ధాన్యాగారాల స్థాపన, నిర్వహణ
13. పశువుల కొట్టములు స్థాపన - నిర్వహణ.
14. గ్రామ నివేశ స్థలాల విస్తరణ
15. పశుసమృద్ధి, వైద్య సహాయం
16. సంతలు, జాతరలు, ఉత్సవాల నియంత్రణ
17. సామాజికాభివృద్ధి కొరకు స్వచ్ఛంద సేవల ఏర్పాటు
18. ప్రసూతి, శిశు సంక్షేమ కేంద్రాల స్థాపన, నిర్వహణ
19. రక్షణ ఏర్పాటు
20. విపత్తుల సమయంలో సహాయక చర్యలు
21. విచ్చలవిడిగా తిరిగే ఊరకుక్కలను నాశనం చేయుట
22. నిరుద్యోగ గణాంకాల తయారీ
23. పబ్లిక్ మార్కెట్లు తెరచుట, నిర్వహించుట
24. పబ్లిక్ కబేళాలు తెరచుట, నిర్వహించుట
25. కమతాల ఏకీకరణ, భూసంస్కరణ చర్యలు
26. అస్పృశ్యత, అవినీతి, మత్తు పదార్థాల సేవనం నిర్మూలన సాంఘీక సామరస్యమును పెంపొందించుట.
27. గ్రామ ప్రజల నైతిక, సాంఘీక, భౌతిక సంక్షేమం పెంపొందించుట.

పై తప్పనిసరి, ఐచ్ఛిక విధులతో పాటు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం నందలి షెడ్యూలు - I (సెక్షన్ 45,161,192) క్రింద 29 అంశాలు అనగా రాజ్యాంగం నందలి 11 వ షెడ్యూలులో తెలుపబడిన వాటిని కూడా నిర్వర్తించవలసి యున్నది.

**గ్రామపంచాయతీ నిర్వహించవలసిన ఇతర విధులు**

1. వివిధ రకాలైన పన్నులు విధించడం, వసూలు చేయడం
2. అనుమతులు లేని ప్రకటనలు తొలగించడం (సె.67)
3. లైసన్సు లేని పందులను, కుక్కలను నిర్మూలించడం (సె.92)
4. దురాక్రమణలను తొలగించడం (సె.98)
5. రోడ్లపై ఆటంకాలు, గుంటలు త్రవ్వడం, నిషేధించడం (సె.101)
6. అనుమతి లేకుండా పబ్లిక్ రోడ్ల పై చెట్లను నాటుట లేక కొట్టి వేయుట (సె.102)
7. పబ్లిక్ రోడ్లపై విక్రయం నిషేధించడం (సె.111)
8. ప్రైవేటు మార్కెట్లుకు లైసెన్సు యివ్వడం (సె.105)
9. ఇండ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం (సె.121)
10. ఆవిరి, విద్యుత్ వంటి ఏ శక్తితోనైనా పనిచేసే యంత్రాల వలన కలిగెడి న్యూసెన్సు తొలగించడానికి సంభవించునట్టి న్యూసెన్సు పై నిషేధం విధించే అధికారం (సె.122) లైసెన్సు యివ్వడం.

**కార్యాచరణ కమిటీలు:**

వ్యవసాయం, ప్రజారోగ్యము, నీటి సరఫరా, పారిశుద్ధ్యము, మరియు కుటుంబ నియంత్రణ, విద్య మరియు సమాచార మార్గాల కొరకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాని, పూర్తిగా అమలులో లేని కారణం చేత ఆ కమిటీలను రద్దుచేయుచూ జి.ఒ.యం.యస్.నెం. 174.పం॥రా॥ రూరల్ డెవలప్‌మెంట్ (పి.టి.యన్.-4) తేది.04-06-2003లో ఈ దిగువ కమిటీలు పంచాయతీ రాజ్ చట్టంలోని సె.40 ప్రకారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

1. సహజవనరుల నిర్వహణ కమిటీ (వ్యవసాయం, తోటలు,పాడి,చేపలు, నీటి సంరక్షణ వంటి సంబంధిత అంశాలు ఈ కమిటీలో ఉంటాయి).
2. మానవ వనరులు అభివృద్ధి,కార్యాచరణకమిటీ (విద్య,ఆరోగ్యం,మహిళసంక్షేమం సంబంధిత అంశాలు ఈ కమిటీలో ఉంటాయి).
3. ఉపాధికల్పన,స్వయం సహాయక సంఘాల కార్యాచరణ కమిటీ
4. ఆర్థిక ప్రణాళిక, కార్యాచరణ కమిటీ
5. పనులు, మౌలిక సదుపాయాలు, కార్యాచరణ కమిటీ

**1. సహజ వనరుల కార్యాచరణ కమిటీ**

- ఈ కమిటీ వ్యవసాయం, తోటల పెంపకం, పాడి, చేపలు, నీటి సంరక్షణ వంటి అంశాలుగురించి పరిశీలన జరిపి వాటి అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలి.
- భూ ఉపరితల, భూగర్భ జల సంరక్షణకు చర్యలు తీసికోవడం, ఉపయోగ కరమైన నీరు వ్యర్థంగా పోకుండా అరికట్టడం.
- నీటి పథకాల నిర్వహణ, మంచి నీటి పథకాలు, నీటి సరఫరా, గ్రామస్తుల ఉపయోగం.
- చెరువులందు పూడిక తీయడం.
- చెక్ డ్యాంలు, నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు ఏర్పాట్లు,
- భూగర్భ జలాలు అంతరించిపోకుండా సలహాలు,
- చెరువు భూములను ఆక్రమణలు లేకుండా చూడడం.
- వన సంరక్షణ, ప్రకృతి సమతుల్యత కాపాడడం.
- సామాజిక భూములలో పచ్చికబయళ్ళను కాపాడడం.
- కంపోస్టు ఎరువులను తయారు చేయడం.
- ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయడం.

**2. మానవ వనరుల కార్యాచరణ కమిటీ**

- చదువు వల్ల ఉపయోగాలను ప్రచారం చేయడం.
- అక్షర కేంద్రాలను ఏర్పాటు / నిర్వహణ చేయడం.
- 5 నుండి 14 సం॥ ఈడుఉన్న పిల్లలు బడికి వెళ్ళునట్లు చేయడం.
- రోగ నిరోధక టీకాలు, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత వంటివాటిని ప్రజలు పాటించేలా చేయడం.
- ఆసుపత్రులందు ప్రసవాలు జరుగునట్లు చూడడం.
- గ్రామ స్థాయిలో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయడం.
- యువజన, సహకార సంఘాల కార్యక్రమాలను ప్రోత్సహించడం.
- గ్రంథాలయాలు, పఠనాలయాల ఏర్పాటు.
- ప్రజలు మత్తు మందులకు బానిసలు కాకుండా చూడడం.
- మహిళలకు ప్రాథమిక హక్కులు గురించి పరిజ్ఞానాన్ని కల్పించడం.
- వైద్య, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం.
- గ్రామంలోని మూఢాచారాలను నిర్మూలించడం.

**3. ఉపాధి కల్పన, స్వయం సహాయక బృందాల కార్యాచరణ కమిటీ**

- నిరుద్యోగులు, వారి ఉపాధి అవసరాలను సేకరించి సమన్వయపరచడం, సహకరించడం.
- గ్రామంలో కూలీల జాబితాలను నిర్వహించడం.
- వేతనంతో కూడిన ఉపాధి అందు బాటు / స్వయం ఉపాధి కార్యక్రమాలు / పథకాలు, చిన్న వ్యాపారాల గుర్తింపు / యువత చేపట్టదగిన స్వయం ఉపాధి అవకాశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం.
- యువకులలో మార్కెట్ నైపుణ్యాలు, చిన్న చిన్న వ్యాపార సామర్థ్యాలు పెంచే విధంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం.
- గ్రామీణ వృత్తులవారు ఆధునికమైన పనిముట్లను వినియోగించులాగున అవగాహన కల్పించడం.
- గ్రామంలో కూలీలకు కనీస వేతనం అమలు జరపడం.
- గ్రామీణ చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం.

**4. ఆర్థిక ప్రణాళికా కార్యాచరణ కమిటీ**

- పన్ను విధించదగిన, పన్ను లేని వనరులను మదింపు చేసి పన్ను విధింపు, వసూలు చేయడం.
- గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయడం.
- గ్రామంలోని అన్నీ ఆదాయాలు గ్రామ పంచాయతీకి రావడానికి అన్ని చర్యలు గైకొనడం.
- ప్రజలు ధన, వస్తు, శ్రమ రూపంలో విరాళాలు ఇవ్వటం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేలా చూడడం.
- గ్రామ పంచాయతీకి సంబంధించిన రాబడులు, ఖర్చులు సరిచూచి వార్షిక బడ్జెట్ అంచనాల తయారులో సహకరించడం.
- లెక్కలు, రిజిష్టర్లు నిరంతరం సక్రమంగా నిర్వహించునట్లు చర్యలు తీసుకొవడం.
- ఆడిట్ సకాలంలో పూర్తిచేయుటకు సహకరించడం.
- గ్రామంలో అమలవుతున్న వివిధ పథకాలు, పనులు పర్యవేక్షించడం, మూల్యాంకనం చేయడం.

**5. పనులు, మౌలిక వసతుల కార్యాచరణ కమిటీ**

- గ్రామంలో ఉన్న భౌతిక వసతులు, ప్రకృతి వనరులు, ఆర్థిక శక్తికి సంబంధించిన గ్రామ సమాచారం సేకరించడం.
- పంచాయతి భవనం, ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాలు, మార్కెట్ కాంప్లెక్స్, లింక్ రోడ్లు, చెక్ డ్యాంలు, నీటి పథకాలు, వంటి అవసరాల జాబితా తయారు చేయడం, గ్రామ సభలో ప్రాధాన్యతలు నిర్ణయించి అవసరమైన పెట్టుబడి అంచనాలు తయారు చేయడం, స్థానిక వనరులను సమీకరించడం, గ్రామానికి లభించే గ్రాంటులతో అనుసంధానించుకోవడం.
- స్థానిక అభివృద్ధికి అనుగుణంగా ప్రజల అవసరాలను గుర్తించడంలోనూ, ప్రాధాన్యతలు నిర్ణయించుకోవడంలోనూ సహాయపడడం
- సౌకర్యాలు / వసతుల అభివృద్ధి కొరకు గ్రామపంచాయతీ బడ్జెట్‌ను దృష్టియందుంచుకొని ప్రణాళికలు తయారు చేయడం.
- గ్రామస్థాయి అమలయ్యే వివిధ శాఖల ప్రణాళికల మధ్య సమన్వయాన్ని సాధించడం.

**కార్యాచరణ కమిటీలు – సభ్యుల ఎంపిక నియమ నిబంధనలు :**

గ్రామపంచాయతీ కార్యాచరణ కమిటీ సభ్యులను పంచాయితీ తీర్మానం ద్వారా నియమిస్తారు. నియామక విషయంగా క్రింది నియమ నిబంధనలను పాటించాలి.

- ప్రతి కమిటీలో కనీసం 7 మంది గరిష్టం 21 మంది సభ్యులు ఉండాలి.
- ప్రతి కమిటీలో సర్పంచ్ కమిటీ ఛైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనరుగా ప్రతి కమిటీలో ఉంటారు.
- సర్పంచ్ తప్ప మిగతా సభ్యులు ఎవ్వరూ ఒకటికంటే ఎక్కువ కమిటీలలో సభ్యులుగా ఉండరాదు.
- వీలైనంత వరకు అందరు వార్డు మెంబర్లు అన్నీ కమిటీలలో సమానంగా ఉండాలి.
- ఒకటికంటే ఎక్కువ గ్రామ పంచాయతీలకు ఒకే యం.పి.టి.సి. ఉన్నచో ఆతడు అన్ని పంచాయతీలలోని అన్ని కమిటీలలో సభ్యులుగా ఉంటారు. ఒక గ్రామంలో ఒక యం.పి.టి.సి. ఉన్నచో ఆ సభ్యుడు అన్నీ కమిటీల్లో సభ్యుడుగా ఉంటాడు. ఒకరికంటే ఎక్కువ మంది ఉన్నప్పుడు ఆ యం.పి.టి.సి. కోరికమేరకు కమిటీలో సభ్యులుగా ఉంటారు.
- స్వచ్ఛంద సేవా సంస్థల వారు కమిటీలో సభ్యులుగా ఉంటారు.
- గ్రామంలోని చురుకుగా ఉన్న స్వయం సహాయక బృందాల నుండి ఇద్దరు నాయకులు కో – ఆప్ట్ సభ్యులుగా ఉంటారు.
- ప్రతి కార్యాచరణ కమిటీలో ఆ కమిటీకి సంబంధించిన అంశాలందు నిపుణులైన ఇద్దరు వ్యక్తులను నియమించుకోవచ్చు.
- ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులను నిపుణులుగా పేర్కొంటూ కమిటీ సభ్యులుగా నియమించరాదు.
- గ్రామస్థాయిలో ఉద్యోగం చేసే అంగన్‌వాడీ / ఆరోగ్య కార్యకర్తలు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణాధికారులు, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మొదలగు వారిని అవసరాన్ని బట్టి గ్రామపంచాయతీ నిర్ణయం మేరకు కార్యాచరణ కమిటీ సభ్యులుగా నియమించుకోవచ్చును.
- ప్రస్తుతమున్న వన సంరక్షణ సమితి / పాఠశాల విద్యా కమిటీ / తల్లుల కమిటీ / గ్రామ సమాఖ్య / వాటర్ షెడ్ కమిటీ / నీటి వినియోగదారుల సంఘం మొ॥ వాటి అధ్యక్షులు సంబంధిత కమిటీలలో సభ్యులుగా ఉంటారు.

**కార్యాచరణ కమిటీ భాధ్యతలు:**

కార్యచరణ కమిటీలందు చేసిన తీర్మానాలు గ్రామసభ ఆమోదం పొందాలి. ఆయా కమిటీల తీర్మానాలను ఆమోదించడం, సవరించడం, తిరస్కరించడం, తిరిగి వ్రాయడం వంటి అధికారాలు గ్రామ సభకు ఉంటాయి. కార్యాచరణ కమిటీలు క్రింది బాధ్యతలను కలిగి ఉంటాయి.

1. కమిటీలు కనీసం నెలకోకసారయినా సర్పంచ్ అధ్యక్షతన సమావేశాలు నిర్వహించాలి.
2. గ్రామానికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించడము.
3. అవసరమయిన వనరుల సమీకరణ.
4. అభివృద్ధి కార్యక్రమాల అమలు వ్యూహాలను పర్యవేక్షించడము.
5. గ్రామపంచాయితీ విధులను నిర్వహించడంలో దోహదపడడం.
6. ఆయా కమిటీలు ప్రతిపాదించిన అంశాలను, ఒక సం॥రం లేదా 5 సంవత్సరములు గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారుచేయడం, అమలుకు చర్య తీసుకోవడం. (వార్షిక మరియు దీర్ఘకాలిక ప్రణాళికలు)

– సిడిపిఎ/టిసిపార్డ్

## గ్రామపంచాయతీల పరిపాలనలో

# వివిధ స్థాయిల్లోని అధికారుల ముఖ్య విధులు



పంచాయతీ పరిధిలో పరిపాలన సంబంధమైన వ్యవహారాలు, ఆర్థిక పరమైన వ్యవహారాలు జరుగుతాయన్న విషయం మనకు తెలుసు. అయితే ఈ వ్యవహారాలన్నీ పంచాయతీరాజ్ చట్టము, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించడంలో ప్రజాప్రతినిధులకు అధికారులు సహాయకులుగా ఉండి, పరిపాలన సాఫీగా, సక్రమంగా జరగేలా కృషి చేయడానికి పంచాయతీరాజ్ శాఖలోని అధికారులకు గ్రామపంచాయతీ పరిపాలన విషయంగా కొన్ని అధికారాలను, విధులను, బాధ్యతలను ఇవ్వడమైనది.

| క్ర.స | అధికారి హోదా | గ్రామ పంచాయితీ పరిపాలనా పరంగా అధికారాలు |
|---|---|---|
| 01 | పంచాయితీ కార్యదర్శి | పంచాయితీ పరిపాలనలో పాలకవర్గమునకు ముఖ్య అంశాలు తెలుపుతూ పంచాయితీ అభివృద్ధికి పాటుపడుట పంచాయితీ తీర్మానాలను అమలుపర్చుట. |
| 02 | విస్తరణ | పంచాయితీ పరిపాలనలో అవసరమైన సలహాలు అందజేయుట, అధికారి (పం.రా.పంచాయితీ ప్రతిపాదనలు డివిజనల్ పంచాయితీ అధికారిగారికి మరియు (గ్రా.అభివృద్ధి) పంపించుట.పంచాయితీలో జరుగు వేలము పాటలకు హాజరవడం, గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించడం, తగు సలహాలు అందించడం, తనిఖీలు నిర్వహించి రిపోర్టును గ్రామపంచాయతీకి అందించడం. పై అధికారుల ఉత్తర్వుల మేరకు విచారణలను నిర్వహించడం, పన్నుల వసూళ్ళను సమీక్షించడం, ఇతర కార్యక్రమాలన్నీ చట్టనిబంధనలకు లోబడి జరిగేలా చూడడం, పంచాయితీ వార్షిక బడ్జెట్ తయారీలో సహకరించడం మొదలగునవి. |
| 03 | మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి | పంచాయితీ కార్యదర్శులపై పరిపాలనాపరమైన నియంత్రణ పంచాయతీ కార్యకలాపాలు, గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై సమీక్ష. గ్రామపంచాయతీకి జిల్లా ప్రజాపరిషత్‌కు అనుసంధాన కర్త |
| 04 | డివిజనల్ పంచాయితీ అధికారి | పంచాయితీ వార్షిక బడ్జెట్ తులనాత్మక పరిశీలన, సంవత్సరానికి రూ. 10000/- వరకు కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బంది నియామక ముద్రకు అనుమతి ఇచ్చుట; రూ.3 లక్షల విలువ గల పనులకు పరిపాలనా అనుమతి ఇచ్చుట;పంచాయితీ కార్యదర్శి పంపించిన అడిట్ సమాధానాలు సమీక్షించి, తన సూచనలతో జిల్లా అడిట్ అధికారిగారికి పంపించుట;పంచాయితీ ఆర్థికాభివృద్ధికి తగు చర్యలు |

| | | |
|---|---|---|
| | | చేపట్టుట, పంచాయితీ పరిపాలనలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి తగు చర్యల నివేదికను జిల్లా పంచాయితీ అధికారిగారికి పంపించుట; చెట్ల క్ౖరను, ఫలసాయము తప్ప (మినహా) ఇతర వేలముల మద్ధతు ధర నిర్ణయించుట; చట్ట ప్రకారము గ్రామ సభ సమావేశము నిర్వహించని సర్పంచ్‌లపై అనర్హత గురించిన సమాచారము ఇచ్చుట; |
| 05 | జిల్లా పంచాయితీ అధికారి | జిల్లాలోని గ్రామ పంచాయితీలలో మరియు పంచాయితీ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై పరిపాలన నియంత్రణ కలిగియుండుట; మేజరు పంచాయితీలలో రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేయుట; పంచాయితీల పరిపాలనలో వచ్చు ఆరోపణలపై విచారణ చేసి తగు చర్యలు గైకొని కలెక్టరు గారికి నివేదిక పంపడం; మేజరు గ్రామపంచాయితీలోని ఆడిట్ రిపోర్టులకు, పంచాయితీ కార్యదర్శిగారు సమర్పించిన సమాధానాలను సమీక్షించి తగు చర్యకై జిల్లా అడిట్ అధికారిగార్కి పంపించుట సంవత్సరానికి రూ. 50000 వరకు కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బందిని నియమించుటకు అనుమతి ఇచ్చుట;ఉన్న సిబ్బందిని 30% నియామకాల పునరుద్దరించుటకు అధికారము; చెట్ల ఫల సాయమును మరియు క్ౖరను వేలము వేయుటకు మద్ధతు ధర నిర్ణయించుట; |
| 06 | జిల్లా కలెక్టరు | గ్రామపంచాయితీలోని సిబ్బంది మరియు సర్పంచ్‌లపై పరిపాలన నియంత్రణ; రూ. 3 లక్షల పైబడిన పన్నులకు పరిపాలన అనుమతినిచ్చుట; అత్యవసర పరిస్థితులలో ప్రజా భద్రతకు అవసరము అనిపించినచో ఏదైన పనిని చేయుటకుగాను ఆదేశించడం; చట్ట వ్యతిరేకముగా చేయబడిన తీర్మానాలను రద్దు చేయుట. |
| 07 | పంచాయితీరాజ్ కమీషనర్ | రాష్ట్రంలో పంచాయితీరాజ్ వ్యవస్థలన్నింటిపైన పరిపాలన నియంత్రణ; అవిశ్వాస తీర్మాణము నెగ్గిన తర్వాత ఉపసర్పంచ్‌ను తొలగించు ఉత్తర్వులు జారీచేయుట; ఆర్ధిక శాఖ నుండి వచ్చు నిధులన్ని జిల్లాల వారిగా పంపిణీ జరిగేలా చూచుట; |

ఈ విధంగా తయారు చేసిన బడ్జెట్‌కు లోబడి గ్రామపంచాయతీ వ్యయాలు ఉండాలి. ముఖ్యంగా

- బడ్జెటులో లేని పద్దుల పై ఖర్చు చేయరాదు. అలా చేసినచో ఆ మొత్తానికి ఆడిట్ అభ్యంతరం వచ్చే అవకాశం కలదు.
- సంవత్సరములో జరుగు ఖర్చులను బడ్జెటులోని కేటాయింపులకు మించి ఖర్చుచేయరాదు.
- ఏదేని పద్దులో కేటాయింపు కంటే ఎక్కువ ఖర్చు చేయుట అవసరమని భావించినపుడు ఆదనపు కేటాయింపుల కొరకు అవసరమైన మొత్తానికి గ్రామపంచాయతీ ఆమోదముతో డివిజినల్ పంచాయతీ అధికారి నుండి ముందస్తు ఆమోదము పొందవలెను.
- ప్రభుత్వము వారు విడుదల చేయు ప్రత్యేక కార్యక్రమాల అమలు కొరకు విడుదల చేయు నిధులను వాటి నియమాల ప్రకారము ఖర్చు చేయవలసి యుంటుంది.

**గ్రామపంచాయతీ స్థాయిలో ప్రధానమైన వ్యయాలు - నియమ నిబంధనలు:**

**గ్రామపంచాయతీ- చేయదగిన వ్యయాలు:**

గ్రామపంచాయతీకి జమ అయ్యే ఆదాయాలన్నింటిని పంచాయతీ సాధారణ నిధి అని అంటారు. ఈ నిధిని ఖర్చు చేసే అధికారం పూర్తిగా గ్రామపంచాయతీదే. అయితే విస్తృత ప్రయోజనాల దృష్ట్యా చట్టంలో పొందుపరచిన నియమాలకు లోబడి ఖర్చు చేయవలసియుంటుంది. జి.ఓ.యం.ఎస్.నెం. 156, పం॥రా & గ్రా॥అ (నియమాలు) శాఖ, తేదీ:03.05.2000 ననుసరించి గ్రామపంచాయతీ వ్యయాలు చేయాలి.

1. గ్రామపంచాయతీ ఒక ప్రాంతంలో నీటి సరఫరా ఏర్పాటు నిమిత్తం విధించిన నీటి పన్ను రాబడులను అదే ప్రాంతంలో నీటి సరఫరా అమలు, నిర్వహణ కొరకు వినియోగించాలి.
2. గ్రామపంచాయతీ విధించిన లైటింగ్ రుసుము, డ్రైనేజి రుసుములను వీధి దీపాల ఏర్పాటుకు, మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు ఖర్చు చేయాలి.
3. వ్యవసాయ భూములపై విధించబడిన ప్రత్యేకపన్ను రాబడులను ఈ క్రింది ప్రయోజనాల కొరకు కేటాయించవచ్చు.

- నీటి సరఫరా లేక డ్రైనేజి పనుల నిర్మాణం, నిర్వహణ మరియు విస్తరణ
- గ్యాస్ లేక సౌరశక్తి మరియు విద్యుత్ ద్వారా లైటింగ్
- రోడ్డు, బ్రిడ్జి, కల్వర్టుల నిర్మాణం.
- సాంస్కృతిక, విద్య, వైద్యం, ఇతర ప్రయోజనాలకై భవన నిర్మాణాలు
- పశువుల వల్ల లేదా దొంగతనాల వలన జరిగిన పంట నష్టం చెల్లింపు

గ్రామపపంచాయతీ ఆయా పనులను చేయబోయే ముందు

గ్రామపంచాయతీ అవసరాలను, ఆవశ్యకాలను దృష్టిలో పెట్టుకొని ప్రాధాన్యతా క్రమంలో నిధులను ఖర్చు చేయవలసి యుంటుంది. ఈ ఖర్చు కూడా బడ్జెట్ నియమాలకు అనుగుణంగానే ఉండాలి.

**1. సిబ్బంది జీతభత్యాలు (30%) :**

ప్రభుత్వము చెల్లించుచున్న జీతభత్యాల గ్రాంటు పరిధిలో లేని తాత్కాలిక సిబ్బందికి వేతనాలు గ్రామపంచాయతీ సాధారణ నిధులనుండి చెల్లించవలసి యుంటుంది. అయితే ఆ ఉద్యోగి నిబంధనల మేరకు అధికారము కలిగిన అధికారి చేత నియమించబడి ఉండాలి. పార్టు టైము ఉద్యోగులు, దినసరి వేతన సిబ్బంది, కాంట్రాక్టు పద్ధతి పై నియమింపబడిన ఇతర ఉద్యోగులు మొదలగు వారి వేతనములు ఈ పద్దు నుండి చెల్లించ బడతాయి. కావున పంచాయతీ ఆదాయములను అనుసరించి కాంట్రాక్టు ఉద్యోగుల జీతములను చెల్లించుటకు నిర్ణీత అధికారిగారి అనుమతి పొందవలసి ఉంటుంది. మొత్తము ఆదాయములో కార్యలయ సిబ్బంది, పారిశుధ్యపు సిబ్బంది, వీధి దీపాల సిబ్బంది జీతములు 30% కంటె ఎక్కువ ఖర్చు చేయరాదు.

**2. పారిశుధ్యము (15%):**

గ్రామపంచాయతీలో వున్న బజార్లలోను, వీధులలోను చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు, పొదలు మొదలయిన వాటిని తొలగించి పరిశుభ్రముగా ఉంచటము, వాడుకలో లేని బావులను, అపరిశుభ్రముగా ఉన్న కుంటలను, మడుగులను పూడ్చించి పారిశుధ్యము కల్పించటము. ప్రజా మరుగు దొడ్లను శుభ్రపర్చుటకు ఏర్పాట్లు చేయడము, స్మశానాలు, ఖనన,ధహన వాటికలను ఏర్పాటు చేసి వాటిని నిర్వహించడము, ఎవరు పట్టించుకోని జంతు కళేబరాలను, అనాధ శవాలను సంస్కరింప చేయుటము, మలేరియా వంట అంటు వ్యాధులు రాకుండా చూడడము, వచ్చిన వ్యాధులకు చికిత్స చేయించడము వంటి అంశాలకు సంబంధించి గ్రామపంచాయతీ చర్యలు తీసుకోవాలి. ప్రజా ఆరోగ్యం అత్యవసర సర్వీసుగా భావించవలసి ఉన్నందున పారిశుధ్య సిబ్బందికి జీతభత్యములను సకాలములో సక్రమముగా చెల్లించాలి. వారికి చెల్లించిన జీతాలను ఒక రిజిష్టరులో నమోదు చేసి పరిశీలనకు గాను ఆడిట్ వారికి సమర్పించవలసియుంటుంది.

**3. వీధి దీపాలు (15%):**

గ్రామములోని వీధులన్నింటికీ వీధి దీపాలు ఏర్పాటు చేసి వాటిని నిర్వహించుట. గ్రామపంచాయతీ ప్రథమ కర్తవ్యము. గ్రామపంచాయతీ సాధారణ నిధిలో 15% కంటే ఎక్కువ వీధిదీపాల కొరకు ఖర్చు చేయరాదు. గ్రామములోని గల వీధి దీపాలు గల విద్యుత్ స్తంభాలు వివరాలు ఒక రిజిష్టరులో నమోదు చేయాలి. వీధిదీపాల విడి భాగాలను కొనుగోలు కొరకు జిల్లా కొనుగోలు కమిటీ ఆమోదించిన రేట్లకు మరియు ఆమోదించిన సంస్థల నుండి కొనుగోలు చేయవలెను. లేనిచో సంవత్సరమునకు అవసరమగు విడి పరికరములను అంచనా వేసి, వాటిని టెండరు నోటీసును బహిరంగముగా ప్రకటించి లేదా స్థానికముగా ప్రచురితమవుతున్న పత్రికలలో ప్రకటించి తక్కువ ధరకు నాణ్యమైన ఐ.ఎస్.ఐ మార్కు గల పరికరాలను కొనుగోలు చేయవలెను. కొనుగోలు చేసిన వస్తువులను స్టాకు రిజిష్టరులో నమోదు చేసి వాటిని వాడిన తేదీ, తీసుకున్న వారి పేరు మరియు తీసుకున్న వారి సంతకమును కూడా ఆ రిజిష్టరులో నమోదు చేయవలెను. అనివార్య పరిస్థితులలో కేటాయించబడిన మొత్తము కంటే అదనముగా 5% ఖర్చు చేయుటకు ప్రభుత్వము మెమో.నెం.30594/2001 పి.ఆర్ & ఆర్.డి. తేది.28-07-2001 ద్వారా అనుమతి ఇచ్చారు. అంతకంటె ఎక్కువ ఖర్చు చేయకూడదు.

**4. మంచి నీటి సరఫరా (15%):**

మనిషికి త్రాగు నీరు జీవనాధారము. కావున ఏ పరిపాలన సంస్థ అయినా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాల్సిన అవసరము ఎంతైనా ఉన్నది. గ్రామపంచాయతీ యొక్క ముఖ్య కర్తవ్యాలలో రక్షిత మంచి నీటి సరఫరా అతి ప్రధానమైనది. జి.వో.యం.యస్.నెం.69 తేది. 09-02-2000 ప్రకారము రక్షిత నీటి సరఫరా నిర్వహణకు గల కేటాయింపు 15%. అనివార్య పరిస్థితులలో బ్లీచింగు పౌడరు ఖరీదు చేయుటకు అదనముగా 5% ఖర్చు చేయుటకు ప్రభుత్వము మెమో.నెం.30594/2001 పి.ఆర్ & ఆర్.డి. తేది.28-07-2001 ద్వారా అనుమతి ఇచ్చారు. అంతకంటే ఎక్కువ ఖర్చు చేయకూడదు.

**5. రోడ్లు & మురికి కాలువల నిర్మాణము & నిర్వహణ(20%):**

గ్రామపంచాయతీ ఆధీనములోని అన్ని రోడ్డు వంతెనలు, కల్వర్టులు, రోడ్ల నిర్మాణము, మరమ్మత్తులు చేయడం గ్రామపంచాయతీ ప్రధాన కర్తవ్యము. వీటి నిర్మాణ మరియు నిర్వహణకుగాను గ్రామపంచాయతీ సాధారణ నిధుల నుండి 20% నిధులను ఖర్చు చేయవచ్చును.

**6. ఇతర అంశాలు (5%):**

ఐచ్ఛిక విధులకు సంబంధించి గ్రామపంచాయతీకి అందుబాటులో ఉన్న నిధులను బట్టి ఆయా కార్యక్రమాలను చేపట్టి ప్రజల సాంఘీక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడవలెను.

ఈ క్రింది ఆగంతుక ఖర్చులు ఈ పద్దు కింద ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడిన మొత్తము మాత్రమే ఖర్చు చేయవచ్చును. అయితే ముందుగా నిర్ణీత అధికారి నుండి అనుమతి ఉత్తర్వులు పొందాలి. అట్టి ఉత్తర్వులు లేని ఖర్చులు ఆడిట్ వారు అభ్యంతరము తెలిపినచో అది సర్‌చార్జీకి దారితీయును.

- కార్యాలయమునకు కావల్సిన స్టేషనరీ, రిజిష్టర్లు, ఫారాలు మొ॥వి సంవత్సరానికి కావల్సిన వాటినన్నిటిని ఒకేసారి అంచనా వేసి గ్రామపంచాయతీ ఆమోదము పొంది నియమాల మేరకు కొనుగోలు చేయాలి. అంతేకాక టెలిఫోన్, తపాల ఖర్చులు, ప్రయాణ భత్యాలు, గ్రామ ఉత్సవాలు, జాతీయ పండుగలు, వి.ఐ.పిల సందర్శనలు, చాటింపులు, కోర్టు ఖర్చులను (G.O.Ms.No.189 P.R.&R.D.dated 06-06-2000) నియమాల ప్రకారము వ్యవహరించాలి. ప్రభుత్వం సూచించిన ఇతర ఖర్చులను ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలి.

**లేఅవుట్లు, భవన నిర్మాణాల నియమాలు**

పంచాయతి రాజ్ చట్టము 1994 లోని సెక్షను 121

ప్రకారము గ్రామపంచాయతి అనుమతి లేకుండ, భూమిని భవన నిర్మాణమునకు ఉపయోగించుట గాని భవననిర్మాణము చేయుట, మార్పులు చేయుట గాని చేయరాదు. (G.O.Ms.No.67 P.R&RD (Pts)-IV) dep.dated 26-02-2002)

ముందుగా భూమి అభివృద్ధి చేయదలచుకున్న వ్యక్తులు గాని సంస్థలు గాని వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుటకు రెవెన్యూ డివిజనల్ అధికారి గారి నుండి తగిన రుసుము చెల్లించి అనుమతిని పొందవలెను. (Act 3 of 2006)

**భూమిని అభివృద్ధి (ప్లాట్లుగా) చేసి అమ్మ దలచుకున్న వ్యక్తులు గాని సంస్థలు గాని ధరఖాస్తు వెంట జతచేయ వలసినవి.**

- భూమి హద్దులు తెలియ జేయు పటము (Map)
- ప్లాట్ల విస్తీర్ణము తెలుపు పటము
- ఆ భూమిలో వేయ దలచుకున్న రోడ్ల వివరములు ఏర్పాటు చేయతలచుకున్న మౌళిక వసతులు తెలుపు హామీ పత్రము
- భూమి హక్కు కాగితములు, రిజిస్ట్రేషను శాఖ నుండి అస్వాధీనత పత్రము ((N.E.C)
- సర్వే మరియు భూమి రికార్డుల శాఖ సహాయ సంచాలకుల నుండి భూమి హద్దుల పత్రము.
- పరిశీలన మరియు ఇతర రుసుములు
- తగిన ధరావత్తు రుసుము

**లేఅవుటు అనుమతి కొరకు కావల్సినవి:**

- ప్రస్తుతము ఉన్న రోడ్డు వరకు చేరుకొనేందుకు కనీసం 10 మీటర్ల వెడల్పు గల రోడ్డు లే అవుటు స్థలము వరకు వుండాలి.
- లే అవుటు చేయబోయే స్థలము నివాస వినియోగమునకయితే 10 వెడల్పు గల రోడ్డు, నివాసేతర వినియోగమునకయితె 12 మీటర్ల వెడల్పు గల రోడ్డు
- మొత్తము భూమిలో 10% స్థలము ప్రజావసరాలకు కేటాయించాలి.
- నివాసము కొరకు వినియోగించె ప్లాట్ల విస్తీర్ణము 120 చ.మీ. కంటె తక్కువ ఉండ కూడదు. (G.O.Ms.No.406. P.R.&R.D.dated 28-12-2011)
- నివాసేతర ప్లాటు విస్తీర్ణము 300 చ.మీ. కంటె తక్కువ ఉ ండకూడదు.
- వాణిజ్యపరమైన వాటికి ప్లాటు కనీస విస్తీర్ణము 18 చ.మీ.
- జాతీయ రహదారులను ఆనుకొని యున్న లేఅవుట్లకు 10 మీటర్ల వెడల్పు గల సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి.
- నియమము 5 లోని నిబంధనలు పాటించాలి.
- లేఅవుట్ అనుమతి లేక నిరాకరణ దరఖాస్తు తేది నుండి 90 రోజులలోగా తెలియ జేయాలి లేకుంటె అనుమతి ఇచ్చినట్లు భావించబడును.
- లేఅవుట్ అనుమతి రెండు సంవత్సరాలు అమలులో యుండును. తర్వాత ఇంతకుముందు చెల్లించిన రుసుము మరియు చార్జీల లో మేజరు పంచాయతిలలో, మునిసిపాలిటిని నుకొని యున్న చిన్న పంచాయతిలలో, నగరాభివృద్ధి పరిధిలో గల పంచాయతిలలో ఇదివరకు చెల్లించి లేఅవుటు రుసుము మరియు ఇతర చార్జీల మొత్తములో 20% పునరుద్దరణ రుసుము, మిగతా చిన్న పంచాయతిలలో ఇదివరకు చెల్లించిన లేఅవుటు రుసుము మరియు ఇతర చార్జీల మొత్తములో 20% పునరుద్ధరణ రుసుమును చెల్లించిన తర్వాత అనుమతి కాలము ను పునరిద్ధరించ వచ్చును.
- పంచాయతి కార్యదర్శికి లేక జిల్లా పంచాయతి అధికారిగారికి గాని ఇచ్చిన అనుమతి నియమాలకు విరుద్ధముగా ఉందని తెలిసినప్పుడు అట్టి అనుమతి రద్దు చేయు అధికారము కలదు.
- అనుమతి తర్వాత ప్లానులో కాని నిర్మాణములో కాని మార్పులు అవసరమయితే మార్పులకనుగుణంగా సవరించిన ప్లాను పై అనుమతి పొందవలెను.
- లేఅవుటు విస్తీర్ణము 5 ఎకరాలకు తక్కువ యున్న యెడల జిల్లా పట్టణ & గ్రామీణ ప్రణాళిక విభాగము అధికారి, అంతకంటె ఎక్కువ యున్న యెడల ప్రాంతీయ పట్టణ& గ్రామీణ పణాళిక విభాగము సంచాలకుల పూర్వానుమతి తర్వాత గ్రామపంచాయతి జారి చేయవలెను.
- మేజరు పంచాయతిలలో మునిసిపాలిటిని ఆనుకొని యున్న చిన్న పంచాయతిలలో నగరాభివృద్ధి పరిధిలో గల పంచాయతిలలో చ.మీ. కు 1-00,చొ॥ రు.3,000-00 తక్కువ కాకుండ, మిగతా చిన్న పంచాయతిలలో చ.మీ.కు.0-25 పైసలు చొ॥ రు.1,000-00 తక్కువ కాకుండ లేఅవుట్ రుసుము వసూలు చేయాలి.
- తనిఖీ మరియు పరిశీలన కొరకు పట్టణ&గ్రామీణ ప్రణాళిక శాఖ కు ఎకరాకు రు.100-00 చొప్పున 1,000-00 లకు తక్కువ కాకుండ చెల్లించ వలెను.
- మేజరు పంచాయతిలలో, మున్సిపాలిటిని ఆనుకొని యున్న చిన్న పంచాయతీలలో నగరాభివృద్ధి పరిధిలో గల పంచాయలతీలలో చ.మీ.కు రు.2-00 చొప్పున రు.10,000-00 లకు తక్కువ కాకుండ,మిగతా చిన్న పంచాయలతీలలో చ.మీ. కు రు.1-00 చొ॥ కాని రు.5,000-00 లకు తక్కువ కాకుండ ధరావత్తు వసూలు చేయాలి.
- లేఅవుట్ నియమాల ఉల్లంఘన జరిగినట్లయితె మేజరు పంచాయతీలలో రు.1000-00 చిన్న పంచాయతీలైతె 500-00 జరిమాన విధించ వచ్చును. అదే ఉల్లంఘన నిరంతరము కొనసాగితె ఉల్లంఘన జరిగిన రోజునుండి, రాజీ జరిగే వరకు, మేజరు పంచాయతీలో రోజుకు 10-00 రూపాయలు చిన్న పంచాయతీలయితే రోజుకు రు. 5-00 జరిమానా విధించ వచ్చును.

– సిడిపిఎ/టిసిపార్డ్




# మహిళా సాధికారత - త్రాగునీరు, పారిశుధ్యం

**భా**రత జనాభాలో ఇంచుమించు సగం మంది స్త్రీలే. వీరిలో దాదాపు 40 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారు. సాధారణంగా మహిళాసాధికారతా నిర్వచనం పరిధిలోకి వచ్చే ముఖ్యమైన అంశాలుగా అధికారసాధన, వనరులపై నియంత్రణ, నాణ్యమైన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన నిర్ణయాత్మక సామర్థ్యాలు వాన్నాయి. మహిళా సాధికారతకు ప్రతీకగా భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఇటీవలి సంవత్సరాలలో పంచాయితీరాజ్ అధికార వ్యవస్థలో స్త్రీలకు ప్రాతినిధ్యం కల్పించడం జరిగింది.

కాని నిరక్షరాస్యత, సాంస్కృతిక లేదా సాంప్రదాయక కట్టుబాట్ల వంటి కారణాల వల్ల మహిళాసాధికారత లక్ష్యాలు సంతృప్తికరంగా నెరవేరటం లేదు. సంబంధిత మహిళాలలో తమ హక్కుల పైనా, తాము నిర్వహించగల పాత్ర పైన, దాని ప్రాముఖ్యత పైనా అవగాహన చాలా తక్కువగా వాంది.

మిలీనియమ్ అభివృద్ధి లక్ష్యాలలో త్రాగునీరు, పారిశుద్ధ్యాలకు అధిక ప్రాధాన్యత నివ్వడమైనది. ఎందుకంటే నీరే ప్రాణాధారము, జీవనాధారము. పైగా భూమిమీద ఉన్న నీటి వనరులలో త్రాగటానికి అనువైనది 1% కంటే తక్కువ. భవిష్యత్తులో పెరుగుతున్న అవసరాలతో పాటు సరైన విజ్ఞతా పూర్వక నీటి యాజమాన్యము లేకపోతే నీటి సమస్యలు తీవ్రమై, దేశాల మధ్య సమూహాల మధ్య స్పర్ధలకు, సంఘర్షణలకు దారి తీసే ప్రమాదముంది.

ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో, అధిక శాతం కుటుంబాలలో త్రాగు నీరు, పారిశుద్ధ్యానికి సంబంధించిన ఈ క్రింది విధులను మహిళలు, బాలికలే నిర్వహిస్తున్నారు.

1. నీటిని సేకరించి ఇంటికి తీసికొనిరావటం
2. గృహంలో త్రాగునీటిని సరైన పద్ధతిలో నిల్వ చేయటం
3. కుటుంబములోని అందరి అవసరాలు తీరే తట్టుగా నీటి నిర్వహణ చూసుకొనటం.
4. కుటుంబంలో ఆరోగ్యపోషణ, పిల్లల పెంపకం, పారిశుద్ధ్యాన్ని నిర్వహించటం.

భారత ప్రభుత్వపు జాతీయ సాంపిల్ సర్వే సంస్థ (NSSO) వారి 2013 నివేదిక ప్రకారము

- గ్రామీణ మహిళలు, బాలికలలో 54% రోజూ 200 మీటర్ల నుండి 5 కి.మీ వరకు నడచి తమ కుటుంబాల కోసం త్రాగు నీటిని

సేకరిస్తున్నారు.

- దీని కోసం ప్రతిరోజూ కనీసం 35 నిమిషాల కాలాన్ని వెచ్చిస్తున్నారు.
- అంటే మన గ్రామీణ ప్రాంతాలలో ప్రతి రెండో మహిళ సంవత్సరంలో కనీసం 210 గంటలు త్రాగునీటి సేకరణ కోసం వెచ్చిస్తున్నట్లే.

దీని దుష్ప్రభావం సంబంధిత కుటుంబాల మీదా, పరోక్షంగా సమాజం మీదా ఇలా ఉంటోంది.

- మహిళల్లో ఆరోగ్య సమస్యలు, పోకిరీలు లేదా అసాంఘిక వ్యక్తుల బెడద
- వారు పిల్లల పెంపకము లేదా ఇతర ఉత్పాదక పనులకు వెచ్చించగల సమయం తగ్గిపోవటం.
- బాలికలు చదువులో వెనుకబడటం లేదా బడి మానేయటం.
- సంవత్సరానికి రూ. 3000 కోట్ల ఆదాయ నష్టం.
- త్రాగునీటి నాణ్యత పై రాజీ పడవలసిన పరిస్థితి
- పారిశుద్ధ్య సమస్యలు – తద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలు

కాని విచారించవలసిన విషయమేమిటంటే ప్రత్యక్షంగా త్రాగునీటితో, పరోక్షంగా పారిశుద్ధ్యం, శుభ్రతలతో అంతగా ముడివడి ఉన్న మహిళలకు గ్రామీణ త్రాగునీటి వసతుల రూపకల్పనలో కాని అమలులో కాని ప్రమేయం చాలా చోట్ల లేకపోవటం.

ఈ విషయం ప్రాధాన్యత సంతరించుకోవలసిన అవసరం కేవలం లింగవివక్షను రూపుమాపటం కోసమో లేదా మహిళా సాధికారత కోసమో కాదు. అంతకంటే విస్తృతమైన పరిధితో జాతీయాభివృద్ధికి కావలసిన సోపానాలను మెరుగుపరుచుకోవటం లేదా పటిష్టపరచడంకోసము, భావితరాలకోసం కూడా.

ఇంకా వివరాల్లోకి వెళితే ముందుగా ఒక అంశాన్ని గుర్తుంచుకోవాలి. అదేమిటంటే ఏ దేశపు ఆర్థిక వికాసమైనా, పునర్నిర్మాణమైనా ఆధారపడే కీలకాంశాలలో ఆ దేశపు మానవ వనరుల శక్తి, సామర్థ్యాలు ముఖ్యమైనవనేది. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవిజ్ఞాన పత్రిక లాన్‌సెట్ (The Lancet) నివేదిక మాటల్లో చెప్పాలంటే "తమ ప్రజలు తగినంతగా పోషితులు కాకుండా దేశాలు దారిద్ర్యాన్ని అధిగమించలేవు. సాధించిన ఆర్థిక ప్రగతిని నిలబెట్టుకోలేవు".

ఇక్కడ

1. "మానవ వనరులు", "ప్రజలు" అనే పదాలు ఒక సమ్మిళిత భావంతో వాడబడినాయి – అంటే లింగ భేదానికతీతంగా.
2. మానవ వనరులంటే కేవలం ప్రస్తుత తరమే కాకుండా భావితరాలవారు కూడా

భావితరాల వారి మనుగడ, ఎదుగుదల శారీరక, మానసిక సామర్థ్యాలకు బీజాలు నేటి తల్లుల గర్భావస్థలోను ఆ తరువాత పిల్లలు మొదటి రెండు సంవత్సరాల జీవితంలో పడతాయని ప్రపంచవ్యాప్తంగా నిపుణులు ఏకాభిప్రాయంతో వున్నారు. (1000 day window) ఈ నేపథ్యంలోనే మాతా శిశుసంరక్షణా పథకాలు అమలవుతున్నాయి.

WHO, UNICEF, The Lancet, John Hopkins Medical School, PHFI, ఇత్యాది ప్రఖ్యాత సంస్థల అధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిశోధనలు, పరిశీలనల ఆధారంగా మాతా శిశు, సంరక్షణకు రూపొందించబడిన త్రిముఖ వ్యూహంలో మాతాశిశువులకు ఆరోగ్య సేవలు, పోషకాహారంతో బాటు త్రాగునీరు మరియు పారిశుద్ధ్యం (Wash) కూడా ఒక పార్శ్వంగా వుంది.

ప్రపంచ వ్యాప్త అనుభవాలు, పరిశీలనల ఆధారంగా సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో నీటి లభ్యత, దాని సక్రమ వినియోగముపై మహిళలకే మెరుగైన అవగాహన వుంటుందని, త్రాగునీరు పారిశుద్ధ్య అలవాట్లపై కుటుంబాలలో అవగాహన పెంచటంలో వారి పాత్ర ముఖ్యమైనదని దాన్ని బలపరచాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పైగా ఎక్కడెక్కడ త్రాగునీరు, పారిశుద్ధ్య వసతుల రూపకల్పన, అమలు, వినియోగాలలో మహిళలు చురుకైన పాత్ర వహించారో, అక్కడ ఆ వసతులు ఇతర ప్రాంతాలలోకన్నా ఎక్కువ జయప్రదంగా నడుస్తునాయని విశ్లేషించారు. అటువంటి కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం.

1. వదినార్ గ్రామం జాంనగర్ జిల్లా (గుజరాత్) :– తీవ్రమైన నీటి సమస్యతో సతమతమవుతుండిన ఈ గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య వైషమ్యాల కారణంగా సమస్య పరిష్కారంలో ఎటువంటి పురోగతి కనబడలేదు. పైగా ప్రభుత్వపథకాలకు గ్రామస్తుల ఆర్థిక వాటాను సేకరించటానికి ఎవరూ ఇష్టబడలేదు. ఈ తరుణంలో శాయరాబెన్ ఇతర మహిళలతో చేరి ఒక ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటుగావించి మొత్తము మహిళలతో కూడిన పానీ సమితి (గ్రామనీరు, పారిశుద్ధ్య కమిటీ) ని ఏర్పాటు చేయించుకొనింది. ఈ కమిటి పగలు రాత్రి ఇంటింటికీ వెళ్ళి అందరిని ఒప్పించి ప్రభుత్వ నీటి పథకానికి గ్రామస్తుల నుండి రావలసిన ఆర్థిక వాటాను సేకరించి పని ప్రారంభింప చేసింది. అంతేకాకుండా ఈ కమిటీ సభ్యులు వంతుల వారీగా నిర్మాణ పనులను పర్యవేక్షించి నిర్మాణాన్ని పూర్తి గావింపచేసి పథకము అమలలయేట్టు చూసింది. కమిటీ సభ్యులు తమ శిక్షణా శిబిరంలో నేర్చుకొన్న అంశాలు, విషయాలను వాడుకొని కృతకృత్యులయ్యారు.

2. ఛాయా గ్రామం, భావనగర్ జిల్లా (గుజరాత్) జేకూబెన్:– ఈ గ్రామంలో పానీ కమిటీ సభ్యురాలు జేకూబెన్ తరచూ గ్రామ నీటి పథకం నిర్మాణ స్థలాన్ని సందర్శించి జరుగుతున్న పనులపై నిఘావేస్తూండేది. ఒక రోజుపని లోపభూయిష్టముగా ఉందని, కాంట్రాక్టరు వాడుతోన్న నిర్మాణ వస్తువులు తగుమోతాదులో లేవని, పైగా నాణ్యత కూడా తక్కువగా ఉందని గమనించి కమిటీ ఇతర సభ్యులతో చేరి నిర్మాణ పనులను ఆపించింది. కాంట్రాక్టరు పనులు నిలిపివేస్తానని బెదరించగా పానీ సమితి ఆయన టెండరును రద్దు చేయించింది, పనులు పూర్తి చేసే భారాన్ని మొత్తము గ్రామస్తులు తమ పై వేసుకొని పథకం అమలు అయ్యేటట్టు చూసారు.

3. తిరుచిరాపల్లి జిల్లా మురికివాడలు:– ఈ జిల్లాలోని 8 మురికివాడల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా తయారవటంతో తీవ్రమైన పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయి. వ్యాధులు, వాటితోపాటు కుటుంబాల పై ఆర్థిక భారం కూడా ఎక్కువయ్యాయి. పురుషులు పట్టించుకోలేదు. చివరకు

మహిళలందరు సంఘటితంగా ఒక ప్రభుత్వేతర సంస్థ సహాయంతో మరుగుదొడ్ల నిర్మాణానికి, నీటి పథకానికి చొరవ తీసికొన్నారు. ఒక ప్రభుత్వేతర సంస్థ, ప్రభుత్వశాఖలు తమవంతు సహాయ సహకారాలనందించారు. పథకాలు అమలులోవచ్చాయి.

4.బండాగోర్లా గ్రామం (పాకిస్తాన్):- నసీమ్ బీబి:- ఈ గ్రామంలోని నీరు, పారిశుద్ధ్య సమస్యలతో విసిగి వేసారి నసీమ్ బీబి అనే మహిళ ఇతర మహిళలతో కలసి ఒక మహిళా సంఘాన్ని స్థాపించి ఒక ప్రభుత్వేతర సంస్థ సహాయాన్ని అర్థించింది. గ్రామస్తులచే తమవంతు వాటాగా 20% ఖర్చును సేకరింపజేసింది. మిగతా 80% ఖర్చును ఎన్జీవో భరించింది. గ్రామస్తులు నిర్మాణపనివారికి నిర్మాణ సమయంలో కూడు, నీడా ఇచ్చారు. ప్రభుత్వము కూడా తన వంతు సహకారాన్ని అందించింది. గ్రామంలో నీరు, పారిశుద్ధ్య సమస్యలు చాలా వరకు పరిష్కరింపబడినాయి.

కనుక ఈ క్రింది కారణాల వల్ల త్రాగునీరు, పారిశుద్ధ్య వసతుల ప్రణాళికల రూపకల్పన అమలు, నిర్వహణ, పర్యవేక్షణలలో మహిళలకు సముచిత పాత్ర ఉండాలనేది విశదమవుతోంది.

- నీటి సేకరణ, వాడకంలో మహిళల పాత్ర
- దాని వల్ల మహిళలకు సంభవిస్తోన్న కష్ట, నష్టాలు
- నీటి వనరులు, వినియోగం గురించి గ్రామీణ స్త్రీల సాంప్రదాయక అవగాహన, నైపుణ్యం
- జాతీయాభివృద్ధికి ముఖ్యమైన మాతాశిశు సంరక్షణా వ్యూహంలో నీరు, పారిశుద్ధ్య అంశాల ప్రాముఖ్యత
- అక్కడక్కడా స్త్రీల నిర్వహణలో నడుస్తున్న నీటి సంస్థల నిర్వహణ యొక్క తీరు.
- బహిరంగ మలవిసర్జన వల్ల మహిళలెదుర్కొంటున్న ఆరోగ్య, సాంఘిక సమస్యలు
- నీరు పారిశుద్ధ్య కార్యక్రమాలలో మహిళల భాగస్వామ్యము వల్ల సమాజానికి ఒనగూరే ప్రయోజనాలు (ప్రజారోగ్యంలో మెరుగుదల, మాతాశిశు సంరక్షణలో మెరుగుదల, గ్రామస్థాయిలో మెరుగైన త్రాగు నీటి వ్యవస్థ పై పర్యవేక్షణ, బాలికల విద్య, ఆరోగ్యాలలో మెరుగుదల, స్త్రీలు రాత్పాదక కార్యకలాపాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించగల పరిస్థితి, పరోక్షంగా గ్రామీణ కుటుంబాల జీవనోపాధిలోకొంత మెరుగుదల ఇత్యాదులు).




సారాంశము:- పైన చర్చించిన అంశాల నేపధ్యంలో గ్రామీణ మహిళల్లో అవగాహన పెంచి, నీరు పారిశుద్ధ్య కార్యకలాపాలలో వారి భాగస్వామ్యాన్ని పెంచే కృషి జరగాలి.

1. గ్రామజ్యోతి పథకం క్రింద గ్రామస్థాయి ప్రణాళికల రూపకల్పన మరియు అమలులో నీరు, పారిశుద్ధ్య కమిటీ మహిళా సభ్యులు (50%) చురుకైన పాత్ర వహించాలి. దాని కోసం ఇతరుల నుండి వారికి ప్రోత్సాహము లభించాలి.

2. స్వచ్ఛంద సంస్థలు, ఇతర ప్రజాసమూహ సంస్థలు కూడా తమ వంతు కృషి చేయాలి.

3. త్రాగునీటి వ్యవస్థ, నీటి నాణ్యత, పారిశుద్ధ్య అలవాట్లు ఇత్యాది అంశాల పై ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అవగాహన పెంచే కార్యక్రమలను ఇంకా పెంచాలి.


**ఏ.నాగేశ్వర రావు,**
సెంటర్ హెడ్,
సి.డబ్ల్యు.ఎస్ మరియు, సి.యం.ఇ.డి., టిసిపార్డ్



# పాపాయి పదిలం!

నవజాత శిశువులు, పిల్లల మరణాల రేటును తగ్గించడమే ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే మన రాష్ట్రం కూడా టీన్యాప్ పథకంతో నవజాత శిశు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈ నేపథ్యంలో 53 సంవత్సరాలుగా పిల్లల ఆరోగ్యం గురించి పనిచేస్తున్న ఐఏపీ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవలే పెడికాన్ 53వ సదస్సు జరిగింది. దీనిలో ప్రపంచవ్యాప్తంగా పేరెన్నికగన్న పీడియాట్రీషియన్లు పాల్గొని పలు అంశాలు చర్చించారు. వాటిలో కొన్ని....

అయిదేళ్లలోపు మరణిస్తున్న వారి సంఖ్యలో భారతదేశం ముందు వరుసలోనే ఉంది. దీన్ని తగ్గించడానికి ప్రధానంగా తల్లి ఆరోగ్యం, బిడ్డకు తల్లిపాలు పట్టడం, టీకాలను వేయించడం ప్రధాన మార్గాలు. డెలివరీకి ముందే హెచ్‌బివి, రుబెల్లా, టెటానస్ వ్యాక్సిన్లను తప్పనిసరిగా వేయించుకోవాలి. అంటే తల్లి అయ్యే వయసు వచ్చిన ప్రతి ఆడపిల్లకూ ఈ మూడు టీకాలు తప్పనిసరి అన్నమాట. ఈ టీకాలు వేయించిన మూడు నెలల వరకు గర్భం రాకుండా చూసుకుంటే చాలు. 17 ఏళ్ల లోపు గాని, 35 ఏళ్ళ తరువాత వయసులో గాని తల్లి కాకూడదు. ఈ మధ్యకాలమే ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టడానికి తగిన వయసు. తల్లికి పొగతాగే అలవాటే కాదు, ప్యాసివ్ స్మోకింగ్ కూడా కడుపులో ఉన్న బిడ్డ మీద ప్రభావం చూపుతుందని గ్రహించాలి. ఇకపోతే నెలలు నిండకుండానే పుట్టినా, తక్కువ బరువుతో పుట్టినా పిల్లలకు వెంటనే వైద్య చికిత్స అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. బిడ్డ తప్పనిసరిగా 40 వారాలు గర్భంలో ఉండాలి. 32 నుండి 37 వారాల్లో పుడితే ప్రీటర్మ్ అని అంటాం. ఇలాంటప్పుడు రక్తంలో చక్కెర తగ్గిపోవడం (హైపోగ్లైసీమియా), చర్మం పలుచగా ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత పడిపోవడం, పాలు జీర్ణం కావడంలో సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు ఎక్కువ కావడం లాంటి కారణాల వల్ల పసివారికి ప్రాణాపాయం ఉండవచ్చు. అందుకే డెలివరీకి ఎక్కడో ఒక చోట అని కాకుండా ఇనిస్టిట్యూషనల్ హాస్పిటల్ అంటే అబ్‌స్టెట్రీషియన్‌తో పాటు పిల్లల డాక్టర్ కూడా ఉండే హాస్పిటల్‌నే ఎంచుకోవాలి. పుట్టినప్పటి నుండి అవసరమైన అన్ని టీకాలను ఇవ్వడం మరవొద్దని సూచించారు ఇండియన్ పీడియాట్రిక్స్ అకాడమీ రిసెప్షన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రంగయ్య.

**పాయిజనింగ్... ప్రాణహాని**

పసివాళ్లకు ఏది కనిపించినా దాన్ని నోట్లో పెట్టుకోవడం అలవాటు. అలా ఏదిబడితే దాన్ని నోట్లో పెట్టుకోవడం వల్ల సాధారణ ఇన్‌ఫెక్షన్లు మాత్రమే కాకుండా కొన్నిసార్లు ప్రమాదకరమైన పరిస్థితులు కూడా తలెత్తుతాయి. పసివాళ్ల విషయంలో ఇలాంటి వస్తువులు ప్రమాదవశాత్తు హాని చేస్తే, పెద్ద పిల్లల విషయంలో మాత్రం ఆత్మహత్యకు ఉపయోగపడే వస్తువులు అవుతాయి. ఇంట్లో మనం సాధారణంగా వాడుకునే రకరకాల వస్తువులు, జబ్బులకు వాడే వివిధ రకాల మందులే బిడ్డల పాలిట విషపదార్థాలవుతాయన్నారు పాట్నాలోని కటిహార్ మెడికల్ కాలేజి ప్రొఫెసర్ డాక్టర్ ఉత్పల్ ఖాన్‌సింగ్. పిల్లలకు హానికరమైన సాధారణ వస్తువు కిరోసిన్. చిన్నారులు అది హానికరమని తెలియక ఆడుతూ వెళ్లి పట్టుకోవడం వల్ల అనుకోకుండా మీద పడి, నోట్లోకి వెళ్లడమో, లేదా అన్ని వస్తువుల్లాగే దాన్నీ నోట్లో పెట్టుకోవడమో జరుగుతుంది. తద్వారా పాపాయిలకు ప్రాణాంతకమవుతుంది. ఇలాంటప్పుడు పిల్లలు సరిగా ఊపిరి తీసుకోలేరు. శ్వాసలో ఇబ్బంది రావడమే కాకుండా శ్వాస రేటు పెరుగుతుంది. అంటే ఉచ్ఛ్వాస - నిశ్వాసలు చాలా వేగంగా జరుగుతాయి. జ్వరం కూడా వస్తుంది. శ్వాసలో కిరోసిన్ వాసన కూడా వస్తుంది. ఛాతి ఎక్స్‌రే తీయాలి. పొట్టను వాష్ చేయడం వల్ల ఉపయోగం ఉండదు. కార్టికోస్టిరాయిడ్స్ ఇవ్వకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో హాస్పిటల్ చేర్చి, చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. ఇంట్లో బొద్దింకల కోసం వాడేవి, చీమల మందు లాంటి కీటకనాశినులను ప్రమాదవశాత్తు తీసుకోవడం వల్ల 99 శాతం మరణిస్తారు. ఇలాంటప్పుడు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందేలా చూడాలి.

కర్పూరం తినేస్తే ఐవి ఫ్లూయిడ్స్ ఎక్కించాల్సి ఉంటుంది. వీళ్లకు ఫిట్స్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి యాంటి కన్వల్షన్ మందులు ఇవ్వాలి. అయితే దీని వల్ల ప్రాణాపాయం లేదు. అదే విధంగా నాప్తలీన్ గోలీలు కూడా హానికరమే. దీని వల్ల శ్వాసలో ఇబ్బంది కలుగుతుంది. పాము, తేలుకాటు వంటివి సంభవించినప్పుడు సాధారణంగా భయం వల్లనే చనిపోతుంటారు. ఏది ఏమైనా వీటన్నింటికీ ఇప్పుడు మంచి మందులున్నాయి. అయితే ఆందోళనతో ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలని సూచించారు డాక్టర్ ఉత్పల్‌ఖాన్‌సింగ్.

కౌమారంలో ఉండే పిల్లలకు ఎనర్జీ డ్రింక్స్ ఇవ్వడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారిపోయింది. ప్రకటనల మాయలో పడి చాలా మంది తల్లిదండ్రులు కూడా వీటిని ప్రోత్సహిస్తున్నారు. కాని వీటిలో ఎక్కువ శాతం ఉండేది కెఫీనే. కోకో వల్ల తీవ్రమైన అలర్జీలు కూడా రావొచ్చు. కాబట్టి వీటిని తీసుకోవడం అంత మంచిది కాదన్నారు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ షహీదుల్లా. ఇవి న్యూరో స్టిమ్యులేటర్లుగా పనిచేస్తాయి. కాబట్టి కొంచెం చురుకుదనం పెరుగుతుంది. కాని దీర్ఘకాలికంగా ఉపయుక్తం కాదు. ఇవే కాదు.... అడిటివ్స్, కలరింగ్ ఏజెంట్లు, స్టెబిలైజ్డ్ ఏజెంట్లు కలిపిన రెడీ టు ఈట్ ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వొద్దని సూచించారాయన.

**- ముదుంబై, జర్నలిస్టు**



# కిశోరబాలికల ఆరోగ్యం – శుభ్రత

**1. యవ్వన దశలో ఆడపిల్లలు పాటించవలసిన శారీరక శుభ్రత**

ఆడపిల్లల్లో ఎనిమిది నుండి పద్దెనిమిది సంవత్సరాల వయసులోపు శరీరంలో చాలా మార్పులు ఏర్పడుతుంటాయి. ఈ వయసులో చంకలలో, జననేంద్రియాలలో వెంట్రుకలు రావడం జరుగుతుంది. ముఖంపైన మొటిమలు వస్తుంటాయి. శరీర ఆకృతిలో వంపులు ఏర్పడతాయి. వక్షోజాల ఎదుగుదల, నడుము భాగం పెద్దదిగా కావడం మొదలైన మార్పులు చోటుచేసుకుంటాయి. కొన్ని సమయాలలో చాలా సంతోషంగా, కొన్ని సమయాలలో దిగులుగా, ఇలా భావోద్వేగాలు భిన్నంగా ఉంటాయి. కౌమారదశ అనబడే ఈ దశలో పలు అనుమానాలు, మానసిక అస్థిరత కలగడం సహజమే. యవ్వనదశలో ఆడపిల్లలు తమ శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. శరీరంలో వెంట్రుకలు ఉన్న భాగాలలో మురికి చేరడం, సూక్ష్మక్రిములు చేరడం సహజం. సబ్బుతో నీళ్లతో వాటిని శుభ్రపరుచుకోవాలి. చేతివేళ్ల గోళ్లను కత్తిరించి శుభ్రంగా ఉంచుకోవాలి. మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన ప్రతిసారి (మూత్ర విసర్జన మాత్రమే చేసినా కూడా) జననాంగాలను శుభ్రపరుచుకొని తడిలేకుండా తుడుచుకోవాలి.

మీ శరీరంలో ఏర్పడే మార్పు ఏంటో తెలుసుకోలేక పోతున్నారా? మీకు అర్థం కావడం లేదా? మీతో స్నేహపూర్వకంగా మెలిగే మహిళా డాక్టర్లను లేదా నర్సులను అడిగి వివరాలు తెలుసుకోండి.

**2. బహిష్టు లేదా ఋతుస్రావం**

ఆడపిల్లలకు పది నుండి పదహారు సంవత్సరముల మధ్య వయస్సులో జననేంద్రియం నుండి రక్తస్రావం మొదలవుతుంది. దీన్నే రజస్వల కావడం, పెద్దమనిషి కావడం, వయసురావడం అని వ్యవహరిస్తుంటారు. ఇదే బహిష్టు, ఋతుస్రావం కావడానికి ప్రారంభంగా చెప్పవచ్చు. 'ఆడపిల్లలు సక్రమంగా ఎదుగుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నారు' అనడానికి ఇది సూచిక.

అదే విధంగా ఆరోగ్యవంతమైన ఆడపిల్లలలో కొందరికి పది సంవత్సరాల వయస్సుకు కొంచెం ముందుగానో లేదా పదహారు సంవత్సరాల వయస్సుకు కొంచెం తరువాత కూడా మొదటిసారిగా రజస్వల కావడం జరగవచ్చు.

మొదటిసారి ఋతుస్రావం ఏర్పడిన తర్వాత 50 సంవత్సరాల వయసు వరకు ప్రతినెలా రక్తస్రావం జరుగుతుంది. రజస్వల అయిన మొదటి సంవత్సరం బహిష్టు సక్రమంగా కాకుండా ఉండవచ్చు. తర్వాత తర్వాత ఒక క్రమానికి వచ్చి 28 రోజులకు ఒకసారి జరుగుతుంది. ఈ వ్యవధి కొంత ముందు వెనుకగా కూడా ఉండవచ్చు. రెండు రోజుల నుండి ఏడు రోజుల వరకు రక్తస్రావం ఉండవచ్చు.

బహిష్టు లేదా ఋతుస్రావ సమయాలలో రక్తస్రావం కావడానికి కారణాలు

స్త్రీల కడుపు భాగంలో గర్భాశయానికి రెండు వైపులా అండాశయాలు ఉంటాయి. ఒక్కొక్క వైపు ఒక అండాశయం (ఓవరీ) ఉంటుంది. స్త్రీలు గర్భం ధరించడానికి అవసరమైన అండాలు వీటిలోనే ఉత్పత్తి అవుతాయి. ఈ విధంగా అండాశయంలో ఉత్పత్తి అయ్యే అండాలు, అండవాహికల (ఫెలోపియన్ నాళాలు) ద్వారా గర్భాశయాన్ని చేరుతాయి.

అండం పురుషుల శుక్రకణాలతో కలవడంతో గర్భధారణ

జరుగుతుంది. అప్పుడు ఆ స్త్రీ గర్భం దాల్చినట్లు చెప్తాం. పురుషుల శుక్రకణాలతో కలయిక జరగకపోతే అండం కొన్ని రోజులలో స్త్రీ జననాంగం నుండి బయటకు వచ్చేస్తుంది.

అండం శిశువుగా ఎదగడానికి ఏర్పాట్లు గర్భాశయం ప్రతినెలా చేస్తుంది. గర్భాశయం లోపలి పొర మందంగా (ఎండోమెట్రియమ్) ఉంటుంది. ఇది రక్తకణాలతో నిండి ఉంటుంది. దీనితో లోపలిపొర మందంగా మాత్రమే కాక స్పాంజిలా మారుతుంది. (ఇందులోనే అండం తొమ్మిది నెలలు పెరుగుతుంది) అండం ఫలదీకరణం చెందకపోతే, గర్భం దాల్చకపోతే గర్భాశయం లోపలి పొర అవసరం లేనందున దానిని బయటకు నెట్టి వేస్తుంది. ఫలితంగా అయ్యే రక్తస్రావాన్నే బహిష్టు లేదా ఋతుస్రావం అంటారు.

**3. బహిష్టు లేదా ఋతుస్రావం సమయంలో శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం**

సాధారణంగా బహిష్టు మూడు రోజుల నుండి ఎనిమిది రోజుల వరకు ఉంటుంది. ప్రారంభమయిన మొదట్లో రక్తస్రావం అధికంగా ఉంటుంది. స్త్రీలు తమ జీవితంలోని కొంత భాగాన్ని బహిష్టు సమయాలలో గడుపుతున్నారు. అందుకు దీన్ని వారు సమర్థవంతంగా ఎదుర్కోవాలి కదా? దాని కోసం కొంత ప్రాథమిక సమాచారం తెలుసుకోవడం మంచిది. బహిష్టు సమయంలో రక్తస్రావం జరుగుతుంది అని చెప్పినా నిజానికి బయటకు వచ్చేది అంతా రక్తం కాదు. ఇంతకు ముందు చెప్పినట్లు ఇది రక్తకణాలతో కూడిన ఒక కవచం, అందులో కొంచెం రక్తం కూడా కలిసి ఉంటుంది. కేవలం ముప్పై మిల్లీలీటర్లు రక్తం మాత్రమే బయటకు పోతుంది. ఈ విధంగా కోల్పోయిన రక్తాన్ని త్వరలోనే శరీరం ఉత్పత్తి చేసి సమతులం చేస్తుంది.

**4. బహిష్టు లేదా ఋతుస్రావ సమయాలలో ఎలాంటి సమస్యలు ఏర్పడవచ్చు?**

**బహిష్టు లేదా ఋతుస్రావం రాకుండా ఉండడం**

పదహారు సంవత్సరాల వయసు వచ్చినా కూడా ఆడపిల్లలు కొందరు రజస్వల కాకుండా ఉండవచ్చు. ప్రతినెలా బహిష్టు తప్పకుండా అయ్యే స్త్రీలకు ఉన్నట్లుండి (ఆరు నెలల కంటే ఎక్కువగా కూడా) బహిష్టు లేదా ఋతుస్రావం ఆగిపోవచ్చు. ఈ రెండింటికి హార్మోన్ల లోపం కారణాలుగా ఉండవచ్చు. మానసిక అలసట ఎక్కువగా కలిగి ఉండడం, ఆహార విషయాలలో కఠిన నియంత్రణ, శారీరక శ్రమ ఎక్కువగా ఉండడం, దీర్ఘకాలిక రోగాలు మొదలైన అదనపు కారణాలు కూడా ఉండవచ్చు. ఇలాంటి సందర్భాలలో వైద్యులను సంప్రదించడం మంచిది.

**అధికంగా రక్తస్రావం**

దీన్ని నిర్వచించడం కష్టం. ఎనిమిది రోజులకంటే ఎక్కువగా రక్తస్రావం ఉంటే, నాప్‌కిన్ ఒక గంటలోపు పూర్తిగా తడిగా అయిపోతే అధిక రక్తస్రావం అని చెప్పవచ్చు. గడ్డలతో కూడిన రక్తస్రావం కూడా కావచ్చు. యవ్వనదశలో ఆడపిల్లలకు హార్మోన్ల మార్పులు కారణంగా అధిక రక్తస్రావం కావడం చాలా సహజం. అందుచేత రక్తహీనత కూడా కలుగవచ్చు. స్త్రీ వైద్యులను సంప్రదించి సలహాలు పొందడం చాలా అవసరం.

**బహిష్టు లేదా ఋతుస్రావ సమయానికి ముందు కనిపించే లక్షణాలు**

సాధారణంగా బహిష్టు లేదా ఋతుస్రావం కావడానికి కొన్ని రోజులకు ముందు శరీరంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. తాత్కాలికంగా బరువు పెరుగుతుంది (శరీరంలో నీరు ఎక్కువగా చేరడం వల్ల బరువు పెరుగుతుంది). తలనొప్పి కూడా ఉంటుంది. స్తనాలలో నొప్పి ఏర్పడవచ్చు. మానసిక అశాంతి, చికాకు మొదలైనవి ఏర్పడవచ్చు. బహిష్టు లేదా ఋతుస్రావం అయిన వెంటనే ఇవి తొలగిపోతాయి. ఈ లక్షణాలు కనిపించిన సమయాలలో కొవ్వు, ఉప్పు, చక్కెరలాంటివి ఆహారంలో తక్కువగా ఉండేటట్లు చూసుకోవాలి.

**బహిష్టు లేదా ఋతుస్రావ సమయంలో నొప్పి**

బహిష్టు సమయాలలో పొత్తికడుపు నొప్పి సహజమైనదే. యవ్వనదశలో ఆడపిల్లలలో ఇది ఎక్కువగా ఉంటుంది. ఈ నొప్పి ఏ విధమైన జబ్బు ద్వారా కలగడం లేదు. శరీరంలో ఒక విధమైన హార్మోన్లు ఉత్పత్తి కావడం వల్ల ఈ విధమైన నొప్పి ఏర్పడుతుంది. ఇది ఒకటి రెండు రోజులలో తగ్గిపోతుంది.

కొన్ని సమయాలలో గర్భాశయంలో ఉండే గారపీచు కణజాలం కారణంగా నడుము భాగంలో ఉండే అంటు వ్యాధిని కలిగించే క్రిముల కారణంగా ఈ నొప్పి ఏర్పడుతుంది. బహిష్టు సమయాలలో, బహిష్టు రావడానికి ముందు కలిగే ఈ నొప్పి ఏ విధంగానూ అపాయాన్ని కలిగించేది కాదు. అయినా ఈ నొప్పి కలిగినప్పుడు దాన్ని తగ్గించుకొనే పద్ధతులు తెలుసుకోవాలి కదా? అందుకోసం కొన్ని సలహాలు.

ఒక బాటిల్‌లో వేడి నీరు పోయండి. మూతను బిగించండి. బాటిల్ మీద బట్టను చుట్టి కడుపు భాగంలో కాపడం పెట్టుకోవచ్చు.

- వీపులో క్రింద భాగాన్ని నిమురవచ్చు.
- మీ తల్లిని లేదా స్నేహితులను వీపు భాగంపై ఒత్తమని చెప్పవచ్చు.
- యోగాసనాల ద్వారా కూడా ఈ నొప్పిని తగ్గించవచ్చు.
- సంబంధిత వ్యక్తుల ద్వారా మరిన్ని వివరాలను తెలుసుకోండి.

గర్భధారణ జరిగినప్పుడు బహిష్టు లేదా ఋతుస్రావం జరగదు. తల్లిపాలు బిడ్డకు పట్టించేటప్పుడు కూడా బహిష్టు కాకుండా ఉండడానికి అవకాశాలు ఉన్నాయి. దాదాపు 45-50 సంవత్సరాల వయసులో బహిష్టు లేదా ఋతుస్రావం ఆగిపోతుంది. దీన్నే మెనోపాజ్ అంటారు.

**5. బహిష్టు లేదా ఋతుస్రావ సమయంలో ఎదురయ్యే సాధారణ సమస్యలు**

పదహారు సంవత్సరాల వయస్సు పూర్తయిన తర్వాత కూడా రజస్వల కాలేదా? లేదా బహిష్టు సక్రమంగా జరగడం లేదా? హార్మోన్ల లోపం దీనికి కారణం కావచ్చు.

బహిష్టు ఆగిపోతోందా? లేదా ఆరు నెలలు సక్రమంగా బహిష్టు ఏర్పడి తర్వాత క్రమం లోపిస్తోందా? పౌష్టికాహార లోపం దీనికి కారణం కావచ్చు.

బహిష్టు ఎక్కువ రోజులుగా ఉండి దానితో పాటు నొప్పి కూడా ఉంటోందా? గర్భాశయంలో ఏవైనా మార్పులకు ఇవి లక్షణాలు కావచ్చు. లేదా థైరాయిడ్ గ్రంథి లోపం వల్లనైనా ఇలా జరగవచ్చు. లేదా ఏవైనా అంటువ్యాధి కారక క్రిముల కారణంగా కూడా ఇలా జరగవచ్చు. పైన పేర్కొన్న సమస్యలలో ఏ సమస్య ఉన్నా డాక్టరును సంప్రదించడం చాలా ముఖ్యం.

మనం చేయగలిగినదేమిటి?

సమస్యలను మనమే సరిచేసుకోవడానికి కూడా ప్రయత్నాలు చేయవచ్చు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. అందులో పండ్లు, కాయగూరలు ఎక్కువగా ఉండాలి. ఉప్పు ఎక్కువగా ఉండే, నిల్వచేసే ఆహార పదార్థాలను తీసుకోకూడదు. కెఫిన్ అనే విష పదార్థం కల పానీయాలు (కాఫీ, కోలా లాంటివి) తాగడం తగ్గించుకోవాలి.

కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.

వేగంగా నడవడం వ్యాయామంగా చేయాలి. ఎందుకంటే అప్పుడు ఎండార్ఫిన్ (మనల్ని ఉత్సాహంగా ఉండేటట్లు చేయగల రసాయన పదార్థం) అధిక స్థాయిలో ఉత్పత్తి అవుతుంది. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం ద్వారా కూడా ఉత్తేజాన్ని పొందవచ్చు.

దీనికి సంబంధించి మీలో రేకెత్తే ప్రశ్నలు, ఏర్పడే సందేహాలను స్త్రీ వైద్యులను అడగడానికి వెనుకాడవద్దు.

**6. బహిష్టు లేదా ఋతుస్రావం ఆరోగ్యకరం**

బహిష్టు సమయాలలో తమకు ఏవి సౌకర్యంగా ఉంటాయో ఆ ఆరోగ్య విధానాలు స్త్రీలు చేపట్టాలి. మీ అలవాట్ల ప్రకారం దినసరి చర్యలలో పాల్గొనేటట్లు ఈ ఆరోగ్య విధానాలు ఉండాలి. పాఠశాలకు వెళ్లడం, నడవడం, పరుగెత్తడం, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కాలక్షేపం చేయడం ఈ విధంగా మిగతా రోజులలో ఏవేవి చేస్తున్నారో వాటిని బహిష్టు సమయాలలో కూడా చేయడానికి ఈ విధానాలు ఉపయోగపడాలి.

బహిష్టు లేదా ఋతుస్రావం అనేది ఆరోగ్యకరమైన పెరుగుదలలో ఒక భాగం. కాబట్టి ఆ సమయంలో అశుభ్రంగా ఉన్నామేమోనన్న న్యూనతా భావం ఏర్పరుచుకోకండి. గర్భం దాల్చడానికి, తల్లి కావడానికి మీ శరీరం తగిన విధంగా ఉంది అని తెలియజేసేదే బహిష్టు లేదా ఋతుస్రావం అని చెప్పవచ్చు.

బహిష్టు సమయాలలో శుభ్రంగా ఉండడం నేర్చుకోవాలి. అవసరమైన షాపింగ్ చేయడం, ఆటలలో పాల్గొనడం మొదలైన వాటిని కూడా మీరు బహిష్టు సమయాలలో నిలిపివేయవలసిన అవసరం లేదు. బహిష్టు సమయాలలో తేలిక అయిన సౌకర్యంగా ఉండే దుస్తులను ధరించడానికి మీరు ఇష్టపడగలగాలి.

**పరిశుభ్రంగా ఉండడానికి కొన్ని మార్గాలు**

**గుడ్డలు లేదా నాప్‌కిన్‌లు**

ఒక గుడ్డను మడతపెట్టి మరొక గుడ్డలో దానిని ఉంచి తొడలకు మధ్యలో దాన్ని ఉంచుకునే విధానాన్ని బహిష్టు సమయాలలో చాలా మంది అనుసరిస్తున్నారు. స్రవించే రక్తన్ని ఇది పీల్చుకుంటుంది. ఈ అమరిక నడుముకు బెల్టులాంటి దారంతో కట్టి లోదుస్తులలో ఉంచుకోవచ్చు. గుడ్డలకు బదులుగా దూదిని మడతపెట్టి వలలాగా ఉండే గుడ్డలో చుట్టి కూడా ఏర్పరచుకోవచ్చు. దీన్ని గురించి తెలుసుకోవడానికి సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో అనుభవజ్ఞులైన నర్సులను సంప్రదించవచ్చు.

బహిష్టు సమయంలో ఉపయోగించడానికి కాటన్ గుడ్డలనే ఎంపిక చేసుకోవడం మంచిది. నైలాన్ లాంటి కృత్రిమ దారాలు గల గుడ్డలు స్రవించే రక్తాన్ని సరిగ్గా పీల్చుకోవు. ఇవి చర్మానికి చాలా మంటను కలిగిస్తాయి. నాప్‌కిన్ ప్యాడులకు అంచులు బాగా కుట్టబడి సున్నితంగా ఉండాలి. అప్పుడే అవి చర్మానికి ఒరుసుకోకుండా, గీసుకోకుండా ఉంటాయి.

**శానిటరీ నాప్‌కిన్లు**

కోటెక్స్, కేర్‌ఫ్రీ, స్టేఫ్రీ, విస్పర్ లాంటి పేర్లతో పలు సంస్థలు బహిష్టు సమయాలలో ఉపయోగించదగిన శానిటరీ నాప్‌కిన్‌లను అమ్ముతున్నారు. ఇవి పలురకాలైన ఆకారాలలో దొరుకుతున్నాయి. గుడ్డలను ఉపయోగించడం కంటే ఇవే ఆరోగ్యకరమైనవి. ఎందుకంటే వీటిని ఒకసారి ఉపయోగించి పారేయడం జరుగుతుంది. మన రాష్ట్రంలో కొన్ని గ్రామాలలో మహిళా స్వయం ఉపాధి సంఘాలు తక్కువ ధరలో ఇలాంటి నాప్‌కిన్‌లను అమ్ముతున్నారు.

బహిష్టు సమయాలలో రక్తస్రావానికి తగినట్లు బట్టలను లేదా నాప్‌కిన్‌లను మార్చవలసి ఉంటుంది. చాలా తక్కువగా రక్తస్రావం జరిగినా కూడా ప్రతిరోజూ రెండుసార్లు మార్చుకోవడం మంచిది. గుడ్డలను ఉపయోగిస్తే వాటిని బాగా ఉతికి సూర్యరశ్మి సోకేటట్లు ఆరబెట్టాలి. తడిగా ఉన్న గుడ్డలను ఉపయోగించకూడదు. ఎండ బాగా తగిలేటట్లు ఆరబెట్టిన గుడ్డలను ఉంచుకోవాలి. వాటిని ఒక ప్లాస్టిక్ సంచిలో పెట్టి సురక్షితమైన ప్రదేశంలో ఉంచుకోవాలి.

బహిష్టు సమయాలలో కనీసం మూడు నాప్‌కిన్‌లను ఉంచుకోవడం మంచిది. ఆ రోజులలో మీరు చేసే పనుల ఒత్తిడికి తగినట్లు అవి ఎక్కువగా అవసరం కావచ్చు. మైల బట్టలను, నాప్‌కిన్‌లను మార్చుకునేటప్పుడు మీ చేతుల్ని, తొడల మధ్య భాగాన్ని సబ్బుతో శుభ్రం చేసి ఎక్కువగా నీళ్లు పోసి కడగండి. లేకుంటే రక్తస్రావం ఎండిపోయి దుర్వాసన రావచ్చు.

బహిష్టు సమయాలలో మీకు ఏకాంతంగా ఉండేలా, ప్రత్యేకంగా స్థలం అవసరం. మీ ఇంటిలో, పాఠశాలలో లేదా ఉద్యోగాలు చేసే చోట మీకు ఈ ప్రత్యేకమైన పరిసరాలను కల్పించే స్నానపు గది మరియు మరుగుదొడ్డి ఉండాలి. దీని అవసరం గురించి మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు లేదా మీపై అధికారులకు తెలియజేయడానికి వెనుకాడవద్దు.

మన రాష్ట్రంలో బహిష్టు సమయాలలో ఉపయోగించే నాప్‌కిన్‌లను మహిళా స్వయం ఉపాధి సంఘాలు తయారు చేయడంతో పాటు, మరుగుదొడ్డి సౌకర్యాలతో కూడిన భవనాలను నిర్మించారు. అక్కడున్న స్త్రీల మరుగుదొడ్లలో, ఉపయోగించబడిన నాప్‌కిన్‌లను తగులబెట్టగల దహన పరికరాలు ఉన్నాయి.

పాఠశాల మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాంగణాలలో నాప్‌కిన్‌లను సురక్షిత పద్ధతులలో తొలగించడానికి ఇన్సినేటర్‌లను కట్టుకోవడానికి గ్రామీణాభివృద్ధి శాఖ సహాయపడుతుంది.

**7. యవ్వన దశలో గర్భం దాల్చడం**

స్త్రీ గర్భం ధరించడానికి అర్హురాలు అని ఆమె బహిష్టు లేదా ఋతుస్రావం ఆమెకు తెలుపుతుంది. అయినా ఒక స్త్రీ గర్భం ధరించడానికి, ప్రసవించిన తర్వాత శిశువును పెంచడానికి తగిన శారీరక, మానసిక పరిపక్వత, ఎదుగుదల కూడా ఆమెకు ఉండాలి. అందుకే చిన్న వయస్సు స్త్రీలు గర్భం దాల్చడం సరికాదని వైద్యులు గట్టిగా చెప్పున్నారు.




# విద్యారంగం – నేటి స్థితిగతులు

ఇటీవల కాలంలో ఉన్నత విద్యను అభ్యసించిన డాక్టరేట్లు ఇంజనీయర్లు, ఎంబిఏలు, ఎంసిఏలు ప్రభుత్వంలోని చిన్న చిన్న ఉద్యోగాలకు పోటీపడుతున్నారు. మనదేశంలో ఎక్కువ చదువులు చదివిన వారు తక్కువ స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలకు ఎందుకు దరఖాస్తు చేసుకుంటున్నారని అందరూ ఆలోచించాలి. మనదేశంలో విశ్వవిద్యాలయాలు నిరుద్యోగుల ఉత్పత్తి పారిశ్రామిక సంస్థలుగా మారాయి. అనేక ఇంజనీరింగ్ కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేవు. సరియైన విద్యార్హతలున్న అధ్యాపకులచేత విద్యాబోధన జరగడం లేదు. భారతదేశంలో ప్రతి సంవత్సరం 15 లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలందుకుంటున్నారు. వీరిలో కేవలం 17 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఎం.బి.ఏ. పట్టభద్రులలో 10 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ఎక్కువ మంది పట్టభద్రులకు ఆంగ్లభాషలోగాని, మాతృభాషలోగాని అవసరమైన ప్రావీణ్యం లేదు. ఇది బాధకరమైన అంగీకరించక తప్పని వాస్తవం. ఈనాడు విద్యాప్రమాణాలు గణనీయంగా తగ్గిపోయిన కారణంగా విద్యార్హతలకు చేసే ఉద్యోగానికి సంబంధం లేకుండా పోతుంది. ఉన్నత విద్యను అభ్యసించినవారు చిన్నచిన్న ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిలో మార్పురావాలంటే విద్యాప్రమాణాలను గణనీయంగా పెంచాలి. పట్టభద్రుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. అందుకు తగ్గ నిష్పత్తిలో ఉద్యోగావకాశాలు పెరగడం లేదు. 2011 జనగణన ప్రకారం మనదేశంలో సుమారు 12 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారు. ప్రతి సంవత్సరం తాజాగా నిరుద్యోగుల జాబితాలో కోటి ముప్పై లక్షల మంది వరకు చేరుతున్నారు. చిన్నదయినా పెద్దదయినా ప్రభుత్వ ఉద్యోగం ఉంటేచాలు అని భావించడానికి కారణం ప్రభుత్వ ఉద్యోగాలలోని ఉద్యోగ భద్రత, పనిచేసినా చేయకపోయినా ప్రతినెల స్థిరమైన జీతం, కొన్ని ప్రభుత్వ శాఖలలో జీతంతోపాటు అదనపు రాబడి కూడా ఉంటుంది. ఈ కారణంగానే ఉన్నత విద్యను అభ్యసించిన వారు కూడా చిన్న చిన్న ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు.

ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకూ ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రభుత్వ విధానాలను అమలు పరచడంలో కీలకమైన పాత్రను పోషిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరిచేది ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవ చేయవచ్చన్న ఉద్దేశ్యంతో కూడా కొంత మంది యువకులు ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రైవేట్ ఉద్యోగులతో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగులకూ సమాజంలో గౌరవ మర్యాదలు, పలుకుబడి ఎక్కువ. ప్రభుత్వ ఉద్యోగుల పనితీరుపై ఎన్ని విమర్శలు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు లేని దేశం మనకు కనిపించదు. నిజానికి ప్రభుత్వ పాలనా సామర్థ్యం ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యంపైనే ఉంటుంది. ఈ కారణంగానే ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలపట్ల అన్ని దేశాల ప్రభుత్వాలు శ్రద్ధకనబరుస్తాయి. కొన్ని శతాబ్దాల క్రితమే

సమగ్ర లోపంపై నియామక విధానానికి చైనాలో పునాదులు వేయడం జరిగింది. చైనాలో యోగ్యతా ఆధార నియామకం కోసం పోటీ పరీక్షలను నిర్వహించి ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం మొదలైంది. ఆధునిక కాలంలో యోగ్యత (మెరిట్) ఆధార భర్తీ విధానాన్ని మన దేశం ప్రారంభించింది. భారతదేశంలో యోగ్యత అధారంగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం 1853వ సంవత్సరంలో ప్రారంభమైంది. బ్రిటన్‌లో ఆ తరువాత 1857లో యోగ్యతా అధారంగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ ఉద్యోగాలలో యోగ్యత అధార భర్తీ విధానాన్ని అమెరికాలో 1883వ సంవత్సరంలో ఫ్రాన్స్‌లో 1847వ సంవత్సరంలో ప్రారంభించారు.

ప్రభుత్వ ఉద్యోగస్తులను లేదా సివిల్ సర్వీసులను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. కేంద్ర సర్వీసులు 2. రాష్ట్ర సర్వీసులు, 3. అఖిల భారత సర్వీసులు. కేంద్ర సర్వీసులకు చెందిన ఉద్యోగులు తమ సేవలను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తారు. రాష్ట్ర సర్వీసులకు చెందిన ఉద్యోగులు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి తమ సేవలను అందిస్తారు. అఖిల భారత సర్వీసులకు చెందిన ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్., ఐ.ఎఫ్.ఎస్. అధికారులు తమ సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని కీలక పదవులను వీరే నిర్వహిస్తారు. నిజానికి ఈ సర్వీసుల భర్తీ ప్రక్రియ మిగతా సర్వీసుల భర్తీ ప్రక్రియకంటే కటినంగా ఉంటుంది. ఇప్పుడు ఐఐటి, ఐఐఎం, పట్టభద్రలతోపాటు డాక్టర్లు కూడా ఈ సర్వీసులలో చేరడం పట్ల మక్కువ కనబరుస్తున్నారు. ఈ పరిణామాన్ని కేంద్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ ఛైర్మన్ ఇటీవల స్వాగతించారు. ఇందుకు కారణం మిగతా పట్టభద్రులతో పోలిస్తే ఐఐటి, ఐఐఎం, డాక్టర్లు మిగిలిన పట్టభద్రులకంటే ఎక్కువ సామర్థ్యం కలిగి ఉండడం.

ఇటీవల తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్స్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌కు స్పందిస్తూ 5,64,431 మంది అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సుమారు 146 మంది డాక్టర్లు ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించకమానదు. గతంలో రాష్ట్రంలోని గ్రూప్-1 సివిల్ సర్వీసుల పట్ల డాక్టర్లు ఆసక్తి కనబరచారు. ఇప్పుడు డాక్టర్లు గ్రూప్-2 ఉద్యోగాలలో కూడా చేరాలనుకోవడం ఆందోళనా పూర్తి సంకేతాలను పంపిస్తుంది. ఖచ్చితంగా గ్రూప్-2 ఉద్యోగం వారి అర్హతకు శిక్షణకు తగినదికాదు. గ్రూప్-2 ఉద్యోగాలకు మొత్తం 5,64,431 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 9,204 మంది ఇంజనీర్లు, 4000 మంది ఎంబిఏ, ఎంసిఏ వంటి పోస్టుగ్రాడ్యుయేట్‌లు 15 మంది డాక్టరేట్, ఎంఫిల్, పట్టాను పొందిన వారు ఉన్నారు. గ్రూప్-2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో 2,03,379 మంది మహిళలు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 10,477 మంది అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్-2 ఉద్యోగాలలో గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్, సహాయ వాణిజ్య పన్నుల అధికారుల, సబ్‌రిజిస్ట్రార్లు, మద్యపాన నిషేధ ఎక్సైజ్ శాఖాలలో సబ్ ఇన్స్‌పెక్టరు ఉద్యోగాలు ఉన్నాయి. గ్రూప్-2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో 2,748 మంది 44 సంవత్సరాల పైబడినవారు. వీరికి ఉద్యోగం లభించిన వీరు 14 సంవత్సరాలకంటే ఎక్కువ కాలం ఉద్యోగంలో ఉండడానికి వీలుపడదు. 16,465 మంది 39-44 సంవత్సరాల వయస్సు వారు. 44,883 మంది 34-39 సంవత్సరాల వయస్సున్నవారు. మిగిలిన 5,00,325 మంది 34 సంవత్సరాలలో వయస్సు కలిగిఉన్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే కరీంనగర్ జిల్లా నుండి అత్యధికంగా 80,442 మంది, నల్లగొండ జిల్లా నుండి 76,628 మంది, వరంగల్ జిల్లా నుండి 73,250 మంది, హైదరాబాద్ జిల్లా నుండి 50,781 మంది అభ్యర్థులు గ్రూప్-2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. అత్యల్పంగా ఉద్యోగాలకు నిజామాబాద్ నుండి 33,473 మంది దరఖాస్తు చేసుకున్నారు.

తెలంగాణా రాష్ట్రంలోని పోలీసు శాఖకు చెందిన కానిస్టేబుల్, సబ్-ఇన్స్‌పెక్టరు ఉద్యోగాల నియామక బాధ్యత తెలంగాణ పోలీసు నియామక మండలిది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 9,281 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి 2015 డిసెంబరు 13న ఉద్యోగ ప్రకటన జారీ చేశారు. ఈ ఉద్యోగాలకూ సుమారు నాలుగు లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని భావించడం జరిగింది. అయితే ఇందుకూ భిన్నంగా ఈ సంఖ్య ఐదు లక్షలు దాటింది. కానిస్టేబుల్ ఉద్యోగాలకూ ఈనెల 4వ తేదీన గడువు ముగిసేనాటికి మొత్తం 5,35,037 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పదోతరగతి ఉత్తీర్ణలైన వారి నుండి పి.హెచ్.డి. పట్టా పొందినవారు, ఇంజనీరింగ్ పట్టభద్రులు వేలమంది ఉన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రభుత్వం సూచించిన విద్యార్హత ఎస్సీ, ఎస్టీలకు పదోతరగతి మిగిలిన వారికి ఇంటర్మీడియేట్.

నిరుద్యోగులందరికి ప్రభుత్వ ఉద్యోగాలు దొరుకుతాయనుకోవడం భ్రమ. దొరికినా ఉద్యోగంలో అనివార్యంగా సర్దుకుపోవాలి. కేవలం వైట్‌కాలర్ ఉద్యోగాలపై ప్రస్తుతం ఉన్న మక్కువను యువత విడనాడాలి. ప్రస్తుతం మనదేశంలో కార్పెంటర్, ప్లంబర్, మిషన్‌వర్కర్స్, ఎలక్ట్రిషియన్ వంటి అనేక వృత్తి పనివాళ్ళ కొరత ఉంది. యువత ఇటువంటి పనులలో శిక్షణ పొందితే ఉపాధికి కొరత ఉండదు. మన విద్యా విధానంలో వృత్తిపర సాంకేతిక విద్యకు ప్రాధాన్యం కల్పించాలి. ఇంజనీరింగ్ విద్యావిధానంలోని లోపాలను సరిదిద్దితే కొంతవరకు నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చు.

ప్రస్తుతం మనదేశం ముందున్న సమస్య ఆర్థికవృద్ధి మాత్రమే కాదు. ఈ వృద్ధి అవసరమైన ఉద్యోగాలను సృష్టించగలగాలి. తాజా అంచనాల ప్రకారం ప్రతినెల ఒక మిలియన్ మంది యువకులు నూతనంగా నిరుద్యోగుల జాబితాలో చేరుతున్నారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించకపోతే యువత నేరస్తులుగాను, అసాంఘిక శక్తులుగా మారే అవకాశం ఉంది. చదువు మధ్యలో మానేసినా అప్పటిదాక చదివింది ఏదో ఒక ఉపాధి కల్పించేదిగా ఉండాలని గాంధీజీ భావించారు. లోపభూయిష్ట విద్యావిధానం వల్ల అది జరగడం లేదు. గాంధీజీ ఉద్దేశ్యంలో భగవంతుడు మనకు కాళ్ళు చేతులు ఇచ్చింది కష్టపడి పనిచేయడానికి. వాటిని సరిగా ఉపయోగిస్తే మన దేశంలో చేయడానికి ఎంతో పని వుంది. ఉద్యోగాలను సృష్టించగల కుటీర చిన్నపరిశ్రమలు ప్రస్తుతం ఉన్న పోటీకి తట్టుకోలేక మూతపడడం వల్ల నిరుద్యోగులు పెరుగుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమలను చిన్నపరిశ్రమలను నెలకొల్పేవారిని ప్రభుత్వం ప్రోత్సహించాలి. స్వయం ఉపాధి ప్రణాళికలతో ముందుకొచ్చే యుతవకు రుణ సౌకర్యం కల్పించి తగిన శిక్షణను ఇవ్వడం ద్వారా కొంత వరకు నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చు.

**డాక్టర్ పి.మోహన్‌రావు అసోసియేట్ ప్రొఫెసర్,**
**రైల్వే డిగ్రీ కాలేజి, సికింద్రాబాద్**




# ఉపాధి హామీ చట్టంపై రాష్ట్రస్థాయి సదస్సు

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపాధిహామీ చట్టం–పదేండ్ల అమలు – ఫలితాలు–అనుభవాలు' అంశంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించింది. దీనికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.వెంకట్ అధ్యక్షత వహించగా సంఘసంస్కర్త అరుణారాయ్, తెలంగాణా గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ అనితారామచంద్రన్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, కార్యదర్శి బి.ప్రసాద్, నాయకులు వెంకట్రాములు, ఆంజనేయులు, నారి ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణారాయ్ మాట్లాడుతూ పేదలకు చేదోడు వాదోడుగా ఉన్న ఈ పథకం విజయవంతమైందని చెప్పారు. పతకం అమల్లో దేశంలోనే తెలంగాణ ముందున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇందుకు గర్వపడాలని చెప్పారు. నిరుద్యోగులను గుర్తించి చట్టాన్ని అమలు చేయడం అభినందనీయమన్నారు. సామాజిక తనిఖీల ద్వారా లోపాలను గుర్తించి, సరిచేస్తే అద్భుతమైన ఫలితాలు రావడానికి అస్కారముటుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు దీన్ని వాడుకోవచ్చన్నారు. గ్రామీణ రోడ్లు, పాఠశాలలు కట్టడం తదితర పనులు చేయడానికి అవకాశముందని వివరించారు. వలసలను నివారించడానికి ఇది బాగా ఉపయోగపడిందని అభిప్రాయపడ్డారు. 96 లక్షల మేర బ్యాంకు ఖాతాలు తెరవడానికి అవకాశం కలిగిందన్నారు. ఈ పథకంలో 19 శాతం ఎస్సీలు, 15 శాతం ఎస్టీలు, 52 శాతం మహిళలు లబ్ధిపొందుతున్నారని వివరించారు. అంతర్జాతీయ సంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు సైతం దీనికి మద్దతిచ్చాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 94 దేశాల్లో ఆయా పనులు చేస్తున్నారని, ఉపాధి హామీ పథకమే అతి పెద్దదని వివరించారు. ప్రపంచ బ్యాంకు సైతం దీన్ని అంగీకరించిందని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థకు ఉపాధి హామీ చట్టం ఊతమిస్తున్నదన్నారు. 2014–15 ఆర్థిక నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నారని తెలియజేశారు. పనిని హక్కుగా చట్టరూపంలో తేవడం అత్యంత సంతోషమన్నారు. ఇది అందరి విజయంగా చెప్పారు. ఈ చట్టాన్ని రక్షించుకోవాలని, పని కోసం, వేతనాల కోసం ప్రశ్నించాలని కోరారు. గత పదేండ్లలో ఏ దేశం కూడా పనిని హక్కుగా గుర్తించ లేదన్నారు. దీనికోసం పోరాడింది భారత్ మాత్రమేనన్నారు. 'హరత్ హత్ కో కామ్ దో హామ్ కా పూరా దామ్ దో' అనే నినాదమిచ్చారు.

## రోజు 12 లక్షల మంది పనిచేస్తున్నారు
## గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ అనిత రామచంద్రన్

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో ప్రతిరోజూ 12 లక్షల మంది పనిచేస్తున్నారని గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ అనితా రామచంద్రన్ అన్నారు. ఈ పథకం కోసం తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించారని చెప్పారు. సిక్కిం నుంచి కేరళ దాకా ఇప్పుడు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. ఇది మత్తులాంటిదని, పనిచేస్తే వదలాలని అనిపించదన్నారు. మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమన్నారు. సమస్యలు, ఇబ్బందులు ఉన్నాయని, ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ పోవాల్సిన అవసరముందన్నారు. విభజన తరువాత కొన్ని ఇబ్బందులు వచ్చాయన్నారు. స్మార్ట్‌కార్డ్ ప్రయోగం విఫలమైందని, ఇందుకు ఐసిఐసిఐ, యాక్సిస్ బ్యాంకులపై కేసులు సైతం పెట్టామన్నారు. వేతనాలు చెల్లించలేకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. వేసవిలో పనివేళలు మారుతున్నాయని, ఉదయం, సాయంత్రం పనిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. అందుకు డబ్బులు చెల్లిస్తామని సూచించారు. మేట్ల పనితీరును పరిశీలించి గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. దళితుల భూముల్లో ఉపాధి హామీ, ఇందిర ప్రభ పథకాల ద్వారా సౌకర్యాలు కల్పించామన్నారు. 'మిషన్ భగీరథతోపాటు, మిషన్ కాకతీయ పనులు కూడా ఇందులో చేయనున్నట్లు వివరించారు. ఉద్యానవన పంటలకు సంబంధించి పనులను ప్రోత్సహిస్తామని తెలియజేశారు. వంద రోజులు పనిచేసిన కూలీలకు లైఫ్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామన్నారు. వీరికి స్త్రీ నిధి రుణాలు ఇప్పించి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు సైతం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అవినీతి అక్కడక్కడా ఉన్నదని సామాజిక తనిఖీల ద్వారా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వ్యవసాయ కార్మికులు హాజరయ్యారు. ●



# గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యత

ప్రపంచ మానవాళిని మంచిమార్గంలో నడిపించుటకు విశ్వాసమే ప్రాముఖ్యమైనది. అలాంటి చరిత్రలో గ్రీకు, హిబ్రూ, ఇటీలలో క్రైస్తవ్యం ఎంతో ప్రాచుర్యం పొందింది. యేసు పుట్టికతోనే కాలంకు ఒక విభజన జరిగింది. అదే క్రీస్తు పూర్వం, క్రీసు శకంగా పేరు పొందింది. అలాంటి చరిత్రను నిర్మించిన క్రీసు జననం, జీవన కాలం, ఆయన మరణంకు ఎంతో ప్రాముఖ్యత కలిగింది. క్రీస్తును నమ్మే వారికి పవిత్ర గ్రంథం బైబిలు. ఇదే మొదటి ముద్రిత గ్రంథం. నేటికి 1640 భాషలలో ముద్రించిబడింది. భాష, లిపి లేని భాషలో ప్రపంచమంతట బోధించబడుతుంది.

క్రైస్తవులు పాటించే రెండు పండుగలు ఒకటి యేసు పుట్టుక క్రిస్‌మస్. రెండోది గుడ్‌ఫ్రైడే ఆయన మరణమై శిలువలో వేలాడిదీసిన దినం. ఈ గుడ్‌ఫ్రైడే యొక్క ప్రాముఖ్యత. పాప విమోచన పాపం చేసి దేవునికి దూరమైన మానవుని పాపములు విడుదల నిమిత్తం తనను తాను శిలువలో బలిగా అర్పణమయినా యేసు ఆయన అతి చిన్న వయస్సులో అంటే 33 సంవత్సరాలకే రోమన్ సామ్రాజ్య నేతల చేత శిలువ వేయబడ్డాడు.

ఆనాటి యూదుల సమాజం యేసు బోధిస్తున్న విషయాలు వారి విశ్వాసంనకు విరుద్ధంగా ఉన్నాయి. విశ్రాంతి దినంన వ్యాధులు నయం చేయుట, యూదుల మందిరం సినగాగ్ నందు బోధించుట, యూదుల మతానికి వ్యతిరేకంగా పని చేస్తున్నాడని నేరం మోపబడి శిలువ వేయబడ్డారు. శిలువ శిక్ష విధించిన పొంతుపిలాతు (రోమన్ సామ్రాజ్యపు యెరుషలేము ప్రతినిధి) యేసునందు ఏ దోషం లేదనగా యూదుల పెద్దలు యేసుని శిలువ వేసి దొంగ బరబ్బాను విడుదల చేయాలని కేకలు వేశారు. అంటే యూదుల కుట్రే ఆయన శిలువ మరణంకు కారణం. ఆ దినంన ఏ దోషం లేని యేసుపై రోమన్ చట్టానికి వ్యతిరేకంగా బోధించుతున్నాడనే నేరం మోపి శిలువ వేయడం జరిగింది.

శిలువ వేయుటకు ముందు యేసు అనుచరులైన 12 మంది శిష్యులలో ఇస్కరి యేతు యూదా ప్రభువుని ముద్దాడి గుర్తించుతాడు. అందకుగాను తను 30 వెండి నాణెములు తీసుకొంటాడు. ప్రభు యేసును అప్పగిస్తాడు. ఆయనను శిలువ వేసిన రోజునే క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా జరుపుకొంటారు. యేసుక్రీస్తు శిలువ వేయబడిన రోజు కాబట్టి దీనిని క్రైస్తవులు శుభ శుక్రవారంగా భావిస్తారు. సర్వమానవాళి సంరక్షణకు వారి పాపాలను ప్రక్షాళన చేసి, ప్రజలందరూ శాంతి, సమారాధనతో జీవించేలా చూసేందుకు అవతరించిన దైవకుమారుడు యేసుక్రీస్తు. ఆయన శిలువనందు వ్రేలాడుతూ పలికిన మాటలు ఎంతో లోతైనవి యంటారు. గొప్పకృపను, ప్రేమను త్యాగాన్ని చాటుతాయి. కనుక గుడ్‌ఫ్రైడే అయింది. గుడ్‌ఫ్రైడే రోజున ప్రభువు శ్రమమరణమును ప్రేమతో జ్ఞాపకం చేసుకొంటారు. అంతేగాక ఆయనకు ఈ శ్రమలు కలిగాయి? ఎందుకు గాయములు? ఎందుకు ఆయన రక్తం శిలువలో చిందించాడు అనే విషయాలు శుభ శుక్రవారం నాడు క్రైస్తవులు తమ చర్చిలలో ధ్యానించుకొంటారు.

తండ్రి తన బిడ్డలను మోసినట్టుగా ప్రజల చింత దు:ఖములను శిలువ రూపంలో క్రీస్తు తన భుజాల మీద మోసాడు. బైబిలు చెబుతుంది. ఏసుప్రభువు తనను తాను అపరాధ పరిహారార్థం బలిగా అప్పగించుకొని ఆయనే లోక పాపము మోయు దేవుని గొర్రెపిల్ల అయ్యాడని అంటారు. జనం రోగాలను భరించేందుకు తన శరీరమంతటిని కొరడా దెబ్బలకు అప్పగించాడని ఆయన శరీరంపై ఆయన గాయాల వల్ల మనకు స్వస్థత కలుగుతున్నదని, శాపాల నుంచి విమోచనం కలిగించేందుకు శిలువ మార్గంలో ఆయన పిరికివానివలె కాకుండా విజయవీరునిగా నడిచి జయము పొందాడని, లోకము, శరీరమును జయించాడని క్రైస్తవులు విశ్వసిస్తారు.

గుడ్‌ఫ్రైడ్ సందర్భంగా స్థానిక సంఘాలలో శ్రమదినములను ఏర్పాటు చేసుకొని శిలువ శ్రమలను ధ్యానించుకుంటారు. శుభశు క్రవారంను పురస్కరించుకొని క్రైస్తవులు నలుబది రోజులు ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఆ రోజుల్లో ఇళ్ళకు వెళ్ళి కుటుంబ ఆరాధానలు నిర్వహిస్తారు. క్రీస్తు ఒకవైపు, శ్రమ, నింద అవమానములను సహించాడని, మరో వైపు తన కన్నీరును, చెమటను, రక్తంను, ప్రాణమును ధారాపోసాడని క్రైస్తవులు నమ్ముతారు. ఆయన పొందిన గాయములు మనకెన్నో ఆశీర్వాదములు కలుగచేయుచున్నాయని క్రీస్తు ఆరాధకులు పేర్కొంటారు. ఏసుక్రీస్తు జీవిత స్ఫూర్తితో మనమందరం సౌభ్రాతృత్వానికి, శాంతి సహనాలకు పాటుపడదాం.

కె.ఏ.



# వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

వేసవికాలం వచ్చేసింది. ఎండలుకు చిన్నా పెద్దా అల్లాడిపోతున్నారు ఈ అధిక వేడికి అనారోగ్య సమస్యలు చుట్టిముడతాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఇంకా మున్ముందు ఎలా ఉంటుందో ఆలోచిస్తుంటేనే భయమేస్తుంది. ఈ సూర్య ప్రతాపాన్ని ఎలా తప్పించుకోవాలో... ఎంతినాలో...ఏం త్రాగాలో... సూర్యని టెంపర్ నుండి ఎలా తప్పించుకోవాలో తెలుసుకోవాలి. వేసవిలో ఉష్ణోగ్రత తీవ్రత వల్ల చాలా మందికి వడదెబ్బ, తలనొప్పి, మూత్రకోశ వ్యాధులు, చర్మవ్యాధులు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఉష్ణోగ్రత పెరగటం వల్ల శరీరంలోని నీరు శాతం తగ్గి రక్తనాళాలు పైన ఒత్తిడి పెరిగి రక్తంలో నీటి శాతం తగ్గి సహజ స్థితిని కోల్పోయి కళ్ళు తిరిగి పడిపోవడం వంటివి జరుగుతుంటాయి. వేడి వాతావరణం వలన శరీరం వెడెక్కి డిహైడ్రెషన్‌కు గురై గుండె విపరీతంగా కొట్టుకోవడం, వాంతులు, తలతిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. వడదెబ్బ ఎక్కువగా స్త్రీలు, ముసలివాళ్ళు, పిల్లలకి తగులుతుంది. వడదెబ్బ తగిలిన వెంటనే ప్రథమ చికిత్స చాలా అవసరం. లేదంటే ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది.

### వడదెబ్బ తగిలిన వారికి అందించవలసిన ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వెంటనే స్పృహకోల్పోతారు. వారికి వెంటనే నీటితో ముఖము కడిగి వారికి నీటిని త్రాగించాలి.
- వడదెబ్బ తగిలిన వారికి వారి శరీర ఉష్ణోగ్రతలను అదుపు చేస్తే పెద్ద ప్రమాదం నుంచి బటయపడతారు. వారికి నీళ్ళతో తడిపిన గుడ్డను ముఖముపైన కప్పాలి. ఆ తరువాత అందుబాటులో ఉంటే ఐస్‌ముక్కలను ఒక కవరులో పెట్టి బహుమూలలు (చంకలు, తోడలు మధ్యలో) ఉంచాలి. దీని వలన శరీర ఉష్ణోగ్రత తొందరగా తగ్గుతుంది. ఐస్‌ముక్కలు అందుబాటులో లేనప్పుడు స్పాంజ్‌ను తడిపి బహుమూలల్లో పెట్టవచ్చు.
- వీలైనన్నీ ఎక్కువ కొబ్బరి నీళ్ళు, నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం త్రాగించాలి.
- శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి అందేలా సెలైన్ (ఫ్ల్యూయిడ్స్) ఇవ్వాలి.
- ప్రాథమిక చికిత్స చేసినప్పటికి కోలుకోకపోతే ఆసుపత్రికి తరలించి తక్షణమే వైద్యం అందేలా చూడాలి.

### వేసవి కాలంలో తీసుకోవలసిన ఆహారం, పానీయాలు

సాధారణంగా వేసవి కాలంలో కాస్తంత సేద తీరేందుకు చల్లగా పండ్ల రసాలు, శీతల పానీయాలు, చెరుకురసాలు, కొబ్బరి నీళ్ళు సేవిస్తుంటారు. ఇవికాకుండా ఎండాకాలంలో మనల్ని మనమే సంరక్షించుకోవాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఏ ఆహారం తీసుకుంటే అనారోగ్య సమస్యల బారి నుండి తప్పించుకోవచ్చు అనే విషయాలు తెలుసుకోవాలి.

- చల్లగా మజ్జిగ, లేదా పెరుగు లేదా వాటితో తయారు చేసిన లస్సీలు తాగాలి. వీటికి వివిధ రకాల పండ్లను కలిపి తీసుకుంటే ఇంకా మంచిది. వేసవి తాపం నుండి బయటపడటానికి ఇవి బాగా ఉపయోగపడతాయి.
- ఎండాకాలంలో ఎక్కువగా లభించే పుచ్చకాయలు శరీరాన్ని చల్లపర్చుడానికి అద్భుతంగా పనిచేస్తాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వేసవిలో శరీరానికి కావలసిన ఖనిజ లవణాలు, పోషకాలను పుచ్చకాయలు అందిస్తాయి. మండే

ఎండ నుండి ఉపశమనం పొందాలంటే కీర దోసకాయలను ఎక్కువగా తీసుకోవాలి. వీటిలో పీచు పదార్థంతోపాటు నీరు ఎక్కువగా ఉంటుంది. ఇవి డిహైడ్రేషన్ నుండి రక్షించడమే కాకుండా శరీరాన్ని బాగా చల్లబరుస్తాయి.

- వేసవి కాలంలో ఆకుపచ్చని కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం ఎంతో మంచిది. వీటిలో నీటి శాతం అధికంగా ఉంటుంది అయితే వీటిని వేసవి కాలంలో అధికంగా ఉడికించకుండా తింటేనే మంచిది.
- రూపంలో, రుచిలో దోసకాయలను పోలివుండే ఖర్బుజా పండ్లలో 90 శాతం నీరే ఉంటుంది. వీటిని వేసవిలో ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరం ఎల్లప్పుడూ చల్లగా ఉంటుంది.
- వేసవిలో నిమ్మరసం తీసుకోవడం వల్ల అనేక రకాల ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చు. అంతేకాక ఎండదెబ్బ నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు. కొద్దిగా చక్కెర, ఉప్పు, నిమ్మరసం కలిపి తయారు చేసిన చల్లని షర్బత్‌ను తాగితే శరీరానికి చాలా మంచిది.
- వేసవిలో చాలా మంది ఐస్‌క్రీంలు, ప్రధానంగా ఎండాకాలంలో వీటిని అందరూ ఎక్కువగా తింటారు. వీటివల్ల శరీరానికి చల్లదనం చేకూరుతుంది. అయితే కొవ్వు, చక్కెరల దృష్ట్యా ఐస్‌క్రీంలను కొద్ది మొత్తంలో మాత్రమే తీసుకోవడం మంచిది.

**వేసవి కాలంలో తప్పనిసరిగా పాటించవలసిన నియమాలు**

- ఎక్కువ సమయం ఎండలో తిరగకూడదు. సాధ్యమైనంత వరకు బయట పనులు ఉదయం, సాయంత్రం చేసుకోవాలి.
- బయటకు వెళ్ళేటప్పుడు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుని బయటకు వెళితే కొంతవరకూ రక్షణ పొందవచ్చు. వదులుగా ఉన్న దుస్తులు, కాటన్ దుస్తులు ధరిస్తే మంచింది.
- గొడుగు, లేదా టోపిలాంటివి ధరించాలి.
- బండి మీద వెళ్ళేటప్పుడు స్కార్ఫ్‌లు, హెల్మెట్‌లు ధరించడం మంచిది.

వేసవికాలంలో మధ్యాహ్న సమయంలో సాధారణంగా బయటకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉండటానికి చాలామంది ఇష్టపడుతుంటారు. అయితే ఇంట్లో ఉన్నా ఇంట్లో కూడా వేడిగానే ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఇల్లంతా చల్లగా ఉండాలంటే ఏసి ఒక్కటి పరిష్కారం అనుకుంటారు చాలామంది. అలాగని అందరూ దానిని కొనలేరు. ఇటువంటి పరిస్థితుల్లో ఇంట్లో ప్రత్యామాయ మార్గాలు ద్వారా చల్లగా ఉండే విధంగా చూసుకోవాలి.

- ఇంటి గదుల్లో ఉష్ణోగ్రత తగ్గించేందుకు కిటికీలకు, తలుపులకు తెరను వాడి వేడిని తగ్గించుకోవచ్చు. ఇలాకాకుండా నార పట్టా ఎంచుకొని వాటిని తడిపి కిటికీలకు, గది గుమ్మాలకు వేలాడదీయండి. మధ్య మధ్య నీళ్ళు చల్లతూ ఉండాలి. ఇలా చేస్తుంటే ఇంట్లో వేడి తగ్గి చల్లగా మారుతుంది.
- దుప్పట్లు, పరదాలు, లేత రంగుల్లో ఉండేలా చూసుకోవాలి. ఇవి వేడిని తక్కువగా స్వీకరిస్తాయి.
- షెడ్‌నెట్ మొక్కలకే కాకుండా ఎండ నేరుగా ఇంట్లోకి రాకుండా కట్టుకోవచ్చు. కిటికీలు, బాల్కనీలు, పోర్టికోలు దగ్గర కట్టుకుంటే సరిపోతుంది.

మొక్కలు సహజంగా వేడిని స్వీకరించి స్వచ్ఛమైన గాలిని అందిస్తాయి. అటువంటి ఇండోర్ మొక్కలను ఇంట్లో అక్కడక్కడే పెంచుకోవాలి. పైన సూచించిన విధంగా తగు జాగ్రత్తలు తీసుకొనట్లయితే వేసవి కాలంలో వచ్చే అనారోగ్య సమస్యల నుండి విముక్తి పొంది ఆరోగ్యంగా వుండవచ్చు.

– ఎం.ప్రదీప్ కుమార్, రిసెర్చ్ అసోసియేట్, టిసిపార్డ్

## జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ సంస్థ నూతన డైరెక్టర్ జనరల్



జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ (NIRD & PR) సంస్థ డైరెక్టర్ జనరల్‌గా డా॥ W.R. రెడ్డి IAS (1986) కేరళ కేడర్ బ్యాచ్ అధికారి 10.3.2016 పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గత పోస్టింగ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ, ట్యాక్సెస్ కేరళ ప్రభుత్వంలో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో ఐదు సంవత్సరాలు 1990–1995లో ప్రాజెక్టు డైరెక్టర్ , కడప డిఆర్‌డిఏ తదుపరి జాయింట్ సెక్రటరీ, ఇరిగేషన్ శాఖ మరియు కమేండ్ ఏరియా అభివృద్ధిలో పని చేశారు.

డా॥ W.R. రెడ్డి కేరళ ప్రభుత్వంలోను, కేంద్ర ప్రభుత్వ శాఖలలో పలు శాఖలు నిర్వహించారు. వాటిలో కేరళలో ఎం.డి కేరళ కో–ఆపరేటివ్ సొసైటీ , మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్, జిల్లా కలెక్టర్, కన్నూర్, పల్లాక్కోడ్ (పార్ఘాట్) కొల్లం జిల్లా, కేరళ మరియు జాయింట్ సెక్రెటరీ కేంద్ర వ్యవసాయ శాఖలో పని చేశారు. డా॥ రెడ్డికి వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి ద్వారా పేదలకు చేయూతనందించడంలో ఎంతో ఆసక్తి వుంది.

డా॥ రెడ్డి అబ్దుల్లాపురం గ్రామం, కర్నూలు జిల్లా గవర్నమెంట్ హైస్కూలు వెల్పనూరు, కర్నూలు జల్లాలోను ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరులో చదివారు B.Sc వ్యవసాయం తిరుపతిలోను, M.Sc వ్యవసాయం, Ph.D ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిటూట్ పూస, న్యూఢిల్లీలో చేశారు. ●

# వివిధ రంగాల్లో మొదటి మహిళ

| | |
|---|---|
| భారతదేశపు మొట్టమొదటి మహిళా రాష్ట్రపతి | ప్రతిభాపాటిల్ |
| భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రి | శ్రీమతి ఇందిరా గాంధీ |
| రాజ్యసభ సభ్యత్వం ద్వారా ప్రధాన మంత్రి అయిన మొట్టమొదట మహిళా ప్రధాన మంత్రి | శ్రీమతి ఇందిరా గాంధీ |
| భారతదేశపు మొట్టమొదట మహిళా ముఖ్యమంత్రి | సుచేతాకృపాలినీ |
| భారతదేశంలో మొట్టమొదటి దళిత మహిళా ముఖ్యమంత్రి | మాయావతి |
| సుప్రీం కోర్టు మొట్టమొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి | మీరా సారూబ్ ఫాతిమా బీబి |
| భారతదేశంలో హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన మొట్టమొదట మహిళ | లీలాసేథ్ |
| దేశంలో మొట్టమొదట మహిళా న్యాయమూర్తి | అన్నాచాందీ |
| భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలైన మొట్టమొదటి మహిళ | సరోజినీ నాయుడు |
| భారతదేశంలో ఒక రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన మొట్టమొదటి మహిళ | షాన్నోదేవి |
| భారత రత్న అవార్డు పొందిన మొట్టమొదటి భారతీయ మహిళ | ఇందిరాగాంధీ |
| నోబుల్ బహుమతి పొందిన మొట్టమొదట భారతీయ మహిళ | మదర్ థెరిస్సా |
| రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డు పొందిన మొట్టమొదటి వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి | కరణం మల్లేశ్వరి |
| రామన్‌మెగ్సెసే అవార్డు పొందిన మొట్టమొదట సంగీత కళాకారిణి | ఎం.ఎస్.సుబ్బలక్ష్మి |
| భారతదేశపు మొట్టమొదటి మిస్ వరల్డ్ | రిటాఫారియా |
| భారతదేశపు మొట్టమొదటి మిస్ యూనివర్స్ | సుస్మితాసేన్ |
| భారతదేశపు మొట్టమొదటి మహిళా కెబినెట్ మంత్రి | విజయలక్ష్మి పండిట్ |
| జాతీయ కాంగ్రెస్ మొదటి అధ్యక్షురాలు | అనిబిసెంట్ |
| ఐరాస జనరల్ అసెంబ్లీ మొదటి అధ్యక్షురాలు | విజయలక్ష్మి పండిట్ |
| భారతదేశపు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మొదటి మహిళ | బచ్చేంద్రిపాల్ |
| సముద్రంపై ప్రపంచాన్ని చుట్టిన మొదటి భారతీయ మహిళ | ఉజ్వలరాయ్ |
| భారతదేశపు మొదటి ఐఎఎస్ అధికారిణి | అన్నా జారిమల్హోత్ర |
| భారతదేశపు మొదటి ఐపిఎస్ అధికారిణి | కిరణ్‌బేడి |
| భారతదేశపు మొదటి అడ్వకేట్ | కర్నీలియా సోరాభి |
| భారతదేశపు మొదటి డాక్టర్ | కాదంబినీ గంగూలి |
| భారతదేశపు ఎంఎ పాసైన మొదటి మహిళ | చంద్రముఖీబోస్ |
| భారతదేశపు మొదటి చీఫ్ ఇంజనీర్ | పి.కె.థెరిసా |
| భారతదేశపు మొదటిమిస్ ఇండియా | ప్రమీత |
| భారతదేశం నుంచి మొదటి వ్యోమగామి | కల్పనాచావ్లా |
| జ్ఞానపీఠ్ అవార్డు స్వీకరించిన మొట్టమొదటి మహిళా రచయిత్రి | ఆశాపూర్ణ దేవి |
| బుకర్‌ప్రైజ్ పొందిన మొట్టమొదటి భారతీయ మహిళ | అరుంధతిరాయ్ |
| భారతదేశపు మొట్టమొదటి మహిళ డిజిపి | కంచన్ భట్టాచార్య |
| భారతదేశపు మొట్టమొదట మహిళ ఎన్నికల కమిషనర్ | వి.యస్.రమాదేవి |
| భారతదేశపు మొట్టమొదటి మహిళ మేయర్ | తారాచెరియన్ |
| ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుసార్లు అధిరోహించిన మొట్టమొదటి భారతీయ మహిళ | సంతోష్ యాదవ్ |
| ఉత్తరధృవంలో భారత త్రివర్ణపతాకం ఎగురవేసిన మొట్టమొదటి భారతీయ మహిళ | ప్రతిసేన్‌గుప్త |
| వింబుల్డన్ మూడో రౌండ్‌లో ప్రవేశించిన మొట్టమొదటి భారతీయ మహిళ | సానియామీర్జా |
| జూనియర్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన మొట్టమొదటి భారతీయ మహిళ | సానియామీర్జా |
| ఒలంపిక్ క్రీడల్లో అథ్లెటిక్ పోటీల్లో ఫైనల్స్‌కు చేరిన మొట్టమొదటి భారతీయ మహిళ | పిటి ఉష |
| భారతదేశంలో మొట్టమొదటి మహిళా దర్శకురాలు | బేగం ఫాతిమా సుల్తానీ |
| భారతదేశంలో మొట్టమొదటి సినిమా హిరోయిన్ | దేవికారాణి |
| భారతదేశంలో మొట్టమొదటి పద్మశ్రీ అవార్డు పొందిన నటి | నర్గీస్‌దత్ |
| రాజ్యసభకు ఎన్నికైన మొట్టమొదటి సినీనటి | నర్గీస్‌దత్ |
| సెలబ్రిటి బిగ్‌బ్రదర్ టివి షో గెల్చిన మొట్టమొదటి భారతీయ నటి | శిల్పాశెట్టి |
| ఇండియన్ ఎయిర్‌లైన్స్ మొట్టమొదటి మహిళా పైలెట్ | దుర్గా బెనర్జి |

సేకరణ - ఎం.ప్రదీప్ కుమార్, రిసెర్చ్ అసోసియేట్, టిసిపార్డ్



## రైతులకు ధీమా ఇచ్చే సరికొత్త భీమా

# ప్రధాన మంత్రి ఫసల్ (పంటల) భీమా యోజన (పిఎంఎఫ్‌బివై)



- నూతన పంటల భీమా పథకానికి కేంద్ర ప్రభుత్వం “పచ్చజెండా”
- స్వాతంత్ర్య అనంతరం రైతు సంక్షేమానికి తీసుకొన్న అతిపెద్ద చర్య - ప్రధాని మోడి
- ట్రాక్టర్లు - పంపుసెట్లు - పశువులు - వ్యవసాయ పనిముట్లుకు సైతం భీమా కవచం
- తక్కువ ప్రీమియం - ఎక్కువ వెసులుబాటు
- పంట నష్టం ఫోటో తీసి పంపితే భీమా చెల్లింపు అధికారుల పరిశీలన లేకుండా 25% చెల్లింపు
- రైతులపాలిట రక్షణ ఛత్రం
- రైతుల జీవితాల్లో వెలుగులునింపనున్న పిఎంఎఫ్‌బివై

**భా**రతదేశ వ్యాప్తంగా గల మొత్తం (19,440 కోట్ల హెక్టార్ల) పంటల సాగు విస్తీర్ణంలో కేవలం 37 % భూములకే నీటిపారుదల వసతి ఉంది. మిగిలిన 63% అనగా 12.5 కోట్ల హెక్టార్లు సాగు భూమికి వర్షాలే ఆధారం. అయితే దేశంలో వార్షిక వర్షపాతంలో 70% రుతుపవనాల మీద ఆధారపడి ఉంది. దేశంలో సగం వ్యవసాయ భూములకు జూన్–సెప్టెంబర్ నెలల మధ్య కురిసే వర్షాలే ఆధారం. అందుకనే భారతదేశంలో వ్యవసాయంతో ప్రకృతి వైపరీత్యాలు సహజీవనం చేస్తుంటాయంటారు. ఈ ప్రకృతి వైపరీత్యాల వలన చేతికి రాని పంటలు, దక్కని మద్దతు ధర అతివృష్టి, అనావృష్టితో దెబ్బతింటున్న పంటలు. అక్కరకు రాని సామాజిక పథకములు అన్ని కలసి రైతుకు తీవ్రమనోవేదన కలిగిస్తున్నాయి.

“ హరిత విప్లవం దేశానికి ఆహార భద్రత కల్పించింది కానీ అన్నదాతకు ఆదాయ భద్రత కల్పించ లేకపోయింది. అందరికీ అన్నం పెట్టి రైతు తాను పస్తులు ఉండవలసి వస్తుంది. అలాంటి రైతులు సంక్షోభంలో చిక్కుకొని కాడి–మేడి వదిలి ఆత్మహత్యలు చేసుకోకుండా, దేశంలో రైతులు ఆత్మహత్యలు తగ్గించడమే కాకుండా ఏ ఒక్కరూ ప్రాణత్యాగానికి ఒడికట్టని భారతదేశమును రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అన్న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు వ్యాఖ్యలు దేశంలోని రైతుల దయనీయస్థితిని ప్రతిబింభిస్తున్నాయి.

2004–2012 సంవత్సరల మధ్య కాలములో మనదేశంలో 1,46,373 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఏడాదికి సగటున 16263 మంది రోజుకు 45 మంది చొప్పున రైతులు బలవన్మరణమునకు గురౌతున్నారు. గడిచిన 3 సంవత్సరములలో 3 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొనగా దేశంలో సుమారు 56% రైతులు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రత్యామ్నాయం లభిస్తే 78% రైతులు వ్యవసాయం నుండి తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్న అర్జున్‌సేన్ గుప్తా కమిటీ నివేదిక కఠోరమైన వాస్తవాలను మన కళ్ళ ముందు ఉంచింది.

దేశంలోని రైతుల కష్టాలను కడచేర్చుడానికి 1985 సంవత్సరముల నుండి పలు రకములైన పంటల బీమా పథకములు రూపుదిద్దుకొన్నాయి. కానీ ఆయా పథకముల వలన రైతుకు లభించిన బీమా రక్షణ అతి తక్కువే. అందులో ఏ ఒక్క పథకము రైతులలో విశ్వాసమును కల్పించలేకపోయింది. అంతేకాక వారిపట్ల ఆపనమ్మకం పెరిగింది. బీమా పథకముల పట్ల రైతులు వ్యతిరేకత పెంచుకొన్నారు.

ఈ దుర్భిక్ష, దుర్భర పరిస్థితుల నుండి దేశంలో వ్యవసాయం చేసే రైతులకు ఎదురయ్యే తీవ్ర కష్టనష్టాల నుండి రైతులకు ధీమా ఇచ్చే సరికొత్త బీమా పథకమును ప్రధానమంత్రి నరేంద్రమోడి 2016 జనవరి నెలలో ప్రకటించారు. ప్రధాన మంత్రి ఫసల్ (పంటల) బీమా యోజన పేరుతో ప్రారంభించబడిన ఈ పథకం స్వాతంత్ర్య అనంతర భారతదేశ చరిత్రలోనే రైతుల సంక్షేమం కోసం చేపట్టిన అతి పెద్ద కార్యక్రమం అని చెప్పవచ్చును. దేశంలోని పంటల బీమా పథకములన్నింటిలోనూ అత్యుత్తమమైనదిగా పరిగణించవచ్చును.

ఇప్పటి వరకు 3 రకములైన పంటల బీమా పథకములు మనదేశంలో అమలులో ఉన్నాయి. అవి 1.జాతీయ సాధారణ

వ్యవసాయ పంటల బీమా (ఎన్ఎఐఎస్) 2. సవరించిన జాతీయ సాధారణ వ్యవసాయ పంటల బీమా (ఎంఎన్ఎఐఎస్) 3. వాతావరణ వ్యవసాయ పంటల బీమా పథకమును మరియు సవరించిన జాతీయ సాధారణ పంటల బీమా పథకమును కలిపేసి కొత్తగా ప్రధాన మంత్రి ఫసల్ (పంటల) బీమా యోజన (పిఎంఎఫ్బివై) పథకమును రూపొందించినారు.

## బీమా కంపెనీల ఎంపిక - బీమా పథకం అమలు

ఆయా రాష్ట్ర ప్రభుత్వములు బీమా కంపెనీలను ఎంపిక చేస్తాయి. రాష్ట్రము మొత్తమునకు ఒకే బీమా కంపెనీ... భారత వ్యవసాయ బీమా కంపెనీతో కలసి ఇంకో 10 ప్రైవేటు బీమా కంపెనీలు ఈ పథకమును అమలు చేస్తాయి. ఇందులో 65% బీమా, మార్కెట్ అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా పరిధిలో ఉంటుంది. ప్రతి జిల్లాలోను ప్రస్తుతం అమలులో ఉన్న అధికార పాలనా యంత్రాంగం ద్వారా ఈ బీమా పథకం అమలు చేయడం జరుగుతుంది.

## గత పంటల బీమా పథకాల వర్తింపు

అకాల వర్షాలు, వడగండ్ల వానలు, వరదల వలన పంట ముంపు, పొలంలో ఉన్న పంటలకు జరిగే నష్టాలు, పంటకోత తరువాత జరిగే నష్టాలకు మాత్రమే గతంలో బీమా రక్షణ వర్తించేది.

పైగా ప్రీమియం (కిస్తీ) 14% చెల్లించాల్సి ఉండేది. పంటలు-ప్రాంతాలకు గల ముప్పును బట్టి అట్టి ప్రీమియం 57% వరకు ఉండేది. ఇలా రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తం ఎక్కువ.

పంటల బీమా పరిహారం చెల్లింపు విషయానికొస్తే 50% పంట నష్టపోతే కాని పరిహారం ఉండేది కాదు.

పంటల బీమా రక్షణ పథకములలో కేవలం పంటకు మాత్రమే బీమారక్షణ ఉండేది. ఇతరత్రా రైతులకు ఏ విధమైన సదుపాయములు లభించేవి కావు. అందుచేతనే గత బీమా రక్షణ పథకములు రైతుల ఆదరణను పొందలేక పోయినాయి. దేశంలో 19.44 కోట్ల హెక్టార్ల పంట భూమిలో కేవలం 25% పంటలకే బీమా చేయగలిగారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, బీహార్, యూపి రాష్ట్రాలలో ఎక్కువ మంది రైతులు అప్పట్లో బీమా పాలసీలు చేసినప్పటికి అవి బీమా పథకములో 5.5% పంట విలువనైనా తిరిగి రాబట్టుకోలేకపోయారు.

## ప్రధాన మంత్రి ఫసల్ (పంటల) బీమాయోజన పథకము

ప్రీమియం చెల్లింపు: గతంలో అమలులో ఉన్న పంటల బీమా పథకములకు ప్రీమియం 14% ఉండేది. అది రైతులకు చాలా భారంగా ఉండినది. అయితే ప్రస్తుతం నూతనంగా అమలులోకిరానున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమాయోజన పథకంతో ఆహార ధాన్యములు, నూనె గింజల పంటలకు రబీ సీజన్లో అయితే పంట విలువలో 1.5% ఖరీఫ్ పంటలకైతే పంట విలువలో 2% రైతులు చెల్లించాలి. ఉద్యాన వన పంటలు అనగా కూరగాయలు, పండ్లు, పూలతోటలు మొదలగు పంటలు మరియు వాణిజ్య పంటలు అనగా ప్రత్తి, జనుము, పొగాకు మొదలగు పంటలు అయితే రబీ, ఖరీఫ్ ఏ పంట కాలమునకైనా పంట విలువలో 5% ప్రీమియంగా చెల్లించవలసి ఉంటుంది. ఏ పంటకు రైతు ఎంత ప్రీమియం చెల్లించాలి అనేది ప్రభుత్వ సూచన మేరకు ఆ రాష్ట్రమునకు కేటాయించబడిన బీమా సంస్థ నిర్ణయిస్తుంది. బీమా సంస్థ నిర్ణయించిన మొత్తంలో రైతులు చెల్లించే స్వల్పమొత్తమును మినహాయించగా మిగిలిన మొత్తమును ప్రభుత్వం భరిస్తుంది. ప్రీమియం సబ్సిడీని కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వములు చెరో 50% + 50% భరించవలసి ఉంటుంది.

ప్రధాన మంత్రి ఫసల్ (పంటల) బీమా యోజన ప్రయోజనాలు / సదుపాయలు

1. నారుపోసి నష్టపోయినా
2. పంట వేసిన 15 రోజులకే నష్టపోయినా
3. పొలంలో ఉన్న పంటకు నష్టం కల్గినా
4. కోతకోసిన పంటకు నష్టవ కల్గినా
5. తీవ్రమైన అతివృష్టి మరియు వరదల వలన పంట ముంపు, ఇతర నష్టములు మొదలైనవి మాత్రమే కాకుండా...
6. తీవ్రమైన అనావృష్టి కారణంగా పొలంలో అసలు పంటే వేయలేని పరిస్థితులు.
7. అటువంటి సందర్భంలో పొలం తయారీకి అయిన ఖర్చులు ఉదాహరణకు దుక్కిదున్నుటకు, పొలం బాగు చేయుటకు అయిన ఖర్చులు మరియు ప్రాంతీయంగా సంభవించిన ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలు అన్నింటికీ ఈ బీమా వర్తించడం విశేషం.

నష్టం అంచనా విషయమునకు వస్తే గత పంటల బీమా పథకముల నిబంధనల ప్రకారం 50% పైగా పంట నష్టపోతేనే పరిహారం లభించేది. ప్రస్తుత నూతన పంటల బీమా పథకం 33% పంట నష్టపోయినా అంతకు కొంచెం తగ్గినా పరిహారం చెల్లించడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం మార్గదర్శకాలను తెలంగాణా, ఏపి ప్రభుత్వముల వ్యవహారాల శాఖలకు తాజాగా పంపినది. అందులోని కొన్ని అంశాలు.

1. గత పంటల బీమా పథకాల ప్రకారం పంటకు ప్రీమియం (కిస్తీ) చెల్లిస్తే పైరు నష్టపోతేనే కొంత పరిహారం వస్తోంది. నూతన పంటల బీమా పథకం ప్రకారం సదరు పంట సాగు చేసిన రైతు లేదా అతని కుటుంబ సభ్యులు ప్రమాదవశాత్తు మరణించినారు. 2 లక్షల దాకా పరిహారం వస్తుంది. ఏదైనా ప్రమాదంలో రెండు కళ్ళు, కాళ్ళు, చేతులు పోయినా (ఒక కాలు, ఒక కన్ను, ఒక చేయి పడిపోయినా) ఈ పరిహారం పూర్తిగా ఇస్తారు. రైతుకు 70 సంవత్సరముల వయస్సు వరకే ఈ బీమా వర్తిస్తుంది. ఇంతేకాక రైతు నివసించే ఇంటికి అందులోని సామాగ్రికి సైతం బీమా వర్తించనుంది. సౌకర్యములు పొందాలంటే రైతు తాను పంట రుణం తీసుకొనే బ్యాంకులో పొదుపు ఖాతా కలిగియుండి ప్రతి సంవత్సరం 12 రూపాయల చొప్పున కిస్తీ చెల్లించడానికి అంగీకరిస్తూ బ్యాంకుకు లేఖ వ్రాసి ఇవ్వాలి. ప్రతి ఏటా జూన్వ తేదీన ఈ డబ్బులను రైతు ఖాతా నుండి బ్యాంకులు మినహాయించుకొంటాయి.
2. వ్యవసాయమునకు ఉపయోగించే విద్యుత్ మోటారు 1 అశ్వికశక్తి (హెచ్పి) నుండి 10 అశ్విక శక్తి (హెచ్పి) గల వాటికి కాలిపోయినా, ధ్వంసమైనా బీమా రక్షణ వర్తిస్తుంది.
3. వ్యవసాయమునకు ఉపయోగించే ట్రాక్టర్కు ప్రమాదం జరిగినా,

ధ్వంసం అయినా కాలిపోయినా మరియు ట్రాక్టర్ నడుపుచున్న డ్రైవర్ మరణించినా సంబంధితులకు బీమా పరిహారం అందుతుంది.

4. వ్యవసాయం చేసే రైతు నివసించే ఇల్లు అందలి సామాగ్రి చోరీ మరియు దగ్ధం వంటి సందర్భములలో రైతు నష్టపోయినపుడు ఆదుకొనేలా బీమాపథకం రూపొందించబడినది.

5. వ్యవసాయదారునికి చెందిన పశువులు మృతి చెందినా, వ్యవసాయమునకు ఉపయోగించే పరికరములు దగ్ధమైనా పాడైపోయినా రైతుకు పరిహారం చెల్లించబడుతుంది.

- 2016 ఖరీఫ్ పంట కాలము జూన్/జూలై నుండి ఈ పథకం అమలు చేయబడుతుంది.
- ఈ సంవత్సరం ఖరీఫ్ ఋణములు ఇచ్చే బ్యాంకులు వారు తప్పనిసరిగా ప్రీమియం (కిస్తీ) మినహాయించుకొని ఎఐసికి పంపవలెను. ఇలాగే రబీ పంట (అక్టోబర్/నవంబర్)కు ఇచ్చే పంట రుణములకు బీమా మొత్తమును యధావిధిగా మినహాయించవలెను.
- పంట రుణములు తీసుకోని రైతులు సైతం నూతన బీమా పథకంలో చేరడానికి అర్హులే. ఇలా చేరడం ద్వారా బీమా రక్షణ సదుపాయమలన్నీ పొందవచ్చును.
- దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న కౌలు రైతులకు త్వరలోనే ఈ పథకమును వర్తింపజేయనున్నారు. అయితే కౌలు రైతుల విషయం రాష్ట్రాల పరిధిలో ఉంచుతూ, కౌలు రైతులకు కూడా నూతన పంటల బీమా పథకమును వర్తింపజేసేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ రాష్ట్రాలకు సూచించింది. కౌలు రైతులలో గుర్తింపు కార్డులు ఉన్నవారికి ఈ బీమా రక్షణ వర్తింప జేయనున్నారు.

బీమా పరిహారం చెల్లింపులో జాప్యం నివారణ – సత్వర చెల్లింపు

గతంలో విపత్తులు సంభవించినపుడు బీమా పరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగేది. సంబంధిత అధికారులు సందర్శించి, నష్టమును నిర్ధారించి, నివేదికలు తయారు చేసి, ప్రభుత్వమునకు పంపడం వంటి తతంగం జరిగేది. ఇదంతా పంట నష్టపోయిన రైతుకు మనోవేదన కల్గించేది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో సాంకేతికత వినియోగమునకు పెద్దపీట వేయనున్నారు. రైతు పంట నష్టంపై తక్షణ అంచనాకు జిపిఎస్ వ్యవస్థ నుండి స్మార్ట్‌ఫోన్లు, రిమోట్ సెన్సింగ్ పద్ధతులు, డ్రోన్లు, ఇంకా ఇతర ఆధునిక పరిజ్ఞానమును వాడనున్నారు. గ్రామ పంచాయతీ స్థాయి అధికారులకు స్మార్ట్‌ఫోన్లు కూడా ఇవ్వనున్నారు. ఇందుకు అయ్యే ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు భరించనున్నాయి. సాగు మొదట్లోనే పంట నష్టపోయినచో పంటకోత ప్రయోగాలు జరిపి నష్ట నిర్ధారణ, పరిహారం ప్రకటించే వరకు బాధిత రైతులు వేచి ఉండాల్సిన అవసరం లేదు. అధికార్లుకానీ, పంట నష్టపోయిన రైతులుగానీ నేరుగా స్మార్ట్ ఫోన్లు ఉపయోగించి పంట నష్టమును మరియు పొలములను ఫోటోలు తీసి పంపించినా తక్షణం 25% బీమా పరిహారం చెల్లించేలా ఈ పథకమును రూపొందించారు.

## నష్టపరిహారం చెల్లించే విధానం

పంట నష్టం జరిగిందని తెలియగానే సంబంధిత నష్టపోయిన పంట తాలుకా ఫోటోలు వివరములు చేరిన వెంటనే బీమా మొత్తంలో 25% రైతు ఏ బ్యాంకు ఖాతా నుండి బీమా ప్రీమియం (కిస్తీ) చెల్లించినారో అదే ఖాతాకు పంట నష్టపరిహారమును తక్షణం ఆన్‌లైన్ ద్వారా ఎల్ఐసి జమ చేస్తుంది. మిగిలిన 75% క్లెయిమ్ సెటిల్‌మెంటు కోసం సాంకేతిక పరిజ్ఞానమును వినియోగిస్తారు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా పంట కోత సమాచారమును ఫోటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. రిమోట్ సెన్సింగ్ ఛాయా చిత్రాల ద్వారా ప్రకృతీ వైపరీత్యాల వలన నష్టపోయిన సాగు ప్రాంతాల్ని గుర్తించి నేరుగా బీమా వర్తింప జేస్తారు. ఒకపొలములో కొద్దిగా నమూనా పంటను కోసి నూర్పిడి చేస్తే వచ్చే దిగుబడిని పంటకోత ప్రయోగం అంటారు. రిమోట్ సెన్సింగ్ పద్ధతుల వలన పంటకోత ప్రయోగాల పరిశీలనలు తగ్గుతాయి.

మన దేశంలో మొత్తం పంటల విస్తీర్ణం 19.44 కోట్ల హెక్టార్లు ఉండగా ఆ విస్తీర్ణంలో ఇంత వరకు కేవలం 25% విస్తీర్ణమునకు మాత్రమే బీమా కవచం ఉంటోంది. వచ్చే 3 సంవత్సరములలో 50% విస్తీర్ణమును పంటల బీమా పరిధిలోనికి తేవాలని నిర్ణయించుకొన్నారు. 2016–2017 సంవత్సరంలో 30% విస్తీర్ణంలో బీమాకు ప్రభుత్వంపై పడే భారం 3100 కోట్లు 2017–2018 సంవత్సరములో 40% విస్తీర్ణంలో బీమాను ప్రోత్సహించుటకు 7,400 కోట్లు అవసరమవుతాయి. 2018–2019 సంవత్సరములలో నిర్దేశిత 50% సాగు విస్తీర్ణంలో పంటల బీమా రక్షణ కవచం లక్ష్యం కొరకు కేంద్ర ప్రభుత్వ 8800 కోట్ల మొత్తం వెచ్చించాల్సి ఉంటోంది. ఇదే మొత్తంలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ వంతు మొత్తమును భరించాల్సి వస్తుంది. 75వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు జరుపుకొనే 2022 నాటికి దేశ వ్యవసాయ రంగం ఆదాయం మరీ ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో రైతుల ఆదాయమును రెట్టింపు చేయాలన్న ప్రధాని నరేంద్ర మోడి ఆలోచనలు వాస్తవరూపం దాల్చాలంటే ఈ లక్ష్యసాధన తప్పనిసరి.

1985 సంవత్సరం నుండి నేటి వరకు పలు పంటల బీమా రక్షణ పథకములు మన దేశంలో రైతుల సంక్షేమం కొరకు అమలు పర్చబడినాయి. అయితే ఆ బీమా పథకముల వలన కరువు, ముంపు పరిస్థితులలో తల్లడిల్లిన రైతులకు లభించిన బీమా రక్షణ అతిస్వల్పం. పైగా వానిలో ఏ ఒక్క బీమా పథకము రైతులలో పూర్తి విశ్వాసమును కల్పించకపోగా రైతులు ఆయా పథకాలపట్ల వ్యతిరేకతను, అపనమ్మకాన్ని పెంచుకొన్నారు. రైతుల కష్టాలను నష్టాలను అధిగమించేలా అవి ప్రయోజనకరమైన పంటల బీమా, ప్రమాద బీమా, ట్రాక్టర్, మోటర్, వస్తు సామాగ్రి అంశాలకు వర్తించే విధముగా రూపొందించిన ఈ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతుల్లో సరికొత్త ఆశలు నింపుతోంది.

తెలంగాణ ప్రాంత రైతులకు ఈ పథకం మరింత ఉపయోగపడనుంది. దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంతంలో కరువు విలయతాండవం చేస్తోంది. కొత్త జిల్లాల్లో అనావృష్టి కరువు పరిస్థితులు, ఎక్కువగా ఉండగా మరికొన్ని జిల్లాల్లో అతివృష్టి ముంపు సమస్యల వలన రైతులు భారీగా నష్టపోతున్నారు. ఒక దేశం – ఒకే పథకం నినాదంతో దేశవ్యాప్తంగా అమలు కానున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం క్షేత్రస్థాయిలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి రైతుకు ప్రతి ఎకరా పంట భూమికి రక్షణగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదని ఆశిద్దాం.

కోమట్ల త్రినాధరెడ్డి

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Navatelangana Printers Pvt.Ltd. M.H.Bhavan, Near RTC Kalayanamandapam, Hyderabd.-20. Published at TSIPARD, Rajendranagar, Hyderabad- 500 030. Editor : Anita Ramachandran

Regd. No. HSE/929/2014-2016
Published on 22-3-2016

Sthanika Palana
Date of posting March, 2016

RNI No.APTEL/27888/2009.
Licenced to post without prepayment
No.R&D/HSE/929/WPP/2015-16



తాజా సమాచారం కోసం www.tsipard.gov.in
మరియు YouTube facebook /tsipard
టోల్ ఫ్రీ నెం.: 1800 425 7070



కేంద్రప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ఎ.కె.గోయల్, ఐఏఎస్.తో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖనుగూర్చి వివరిస్తున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్, ఐఏఎస్



తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖల కలయిక అంశంపై టిసిపార్డులో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులు



మహిళాదినోత్సవం సందర్భంగా టిసిపార్డులో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న టిసిపార్డు కమిషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్, ఐఏఎస్., మరియు ఇతర అధికారులు